ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

సోమవారం 16 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 150 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

పేలుళ్లు.. సైరన్లతో
దద్దరిల్లిన బహ్రెయిన్

బహ్రెయిన్‌లో అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ డ్రోన్ల దాడి

ఆరు డ్రోన్లతో దాడి చేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటన

2





ఇక ఇంటికే శబరిమల
అయ్యప్ప ప్రసాదం!

భక్తుల కోసం ఇండియా పోస్టు ప్రత్యేక పార్శిల్ సేవలు

ఈ నెల 17 నుంచి 24 గంటల బుకింగ్ కౌంటర్

స్పీడ్ పోస్టు ద్వారా దేశవ్యాప్తంగా డెలివరీ

ఒక టిన్ అరవణతో పార్శిల్‌కు రూ.520

2

గిరిజనులకు వెదురుపై పూర్తి హక్కులు కల్పించాం!

గత ప్రభుత్వాలు గిరిజనుల సమస్యలను పట్టించుకోలేదు

బ్రిటిష్ కాలం నాటి చట్టాన్ని రద్దు చేశాం: ప్రధాని మోదీ

రూ.3 వేల కోట్లతో 246 అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

గత ప్రభుత్వాలు గిరిజనుల సమస్యలను అర్థం చేసుకోలేదని, వారి సంక్షేమంపై శ్రద్ధ చూపలేదని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. బ్రిటిష్ పాలకులు వెదురును చెట్టుగా పరిగణిస్తూ దానిని నరికితే జైలు శిక్ష విధించేలా చట్టం తీసుకొచ్చారని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా గత ప్రభుత్వాలు ఆ నిబంధనలను తొలగించలేదని అన్నారు.

- న్యూఢిల్లీ, నవంబర్ 15 (సింగిడి)

2



సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్
ప్రపంచ నాయకత్వం సాధించాలి!

దేశీయంగా అధునాతన టెక్నాలజీల అభివృద్ధికి రాజ్‌నాథ్ పిలుపు

రక్షణ రంగంలో స్వావలంబనకు ఎన్‌డీటీ వ్యవస్థ బలోపేతం కావాలి

విదేశీ సాంకేతికతపై ఆధారపడటం తగ్గించాలి

2





డిసెంబర్ మొదటి వారంలో పార్లమెంట్
శీతాకాల సమావేశాలు

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం కసరత్తు

లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి పెంపునకు ప్రతిపాదన

2029 ఎన్నికల ముందే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలే లక్ష్యం

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పై రాజకీయ వాతావరణం అంతకంతకూ ఘర్షణ పూరితంగా మారుతున్న నేపథ్యంలో, డీలిమిటేషన్‌కు సంబంధించిన ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభుత్వానికి శాసనపరమైన ప్రాధాన్యంగా మారింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ బలాన్ని ప్రస్తుతమున్న 543 సీట్ల నుంచి గరిష్ఠంగా 850కి విస్తరించాలని కోరుతున్న ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇది 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు మార్గం సుగమం చేయనుంది.

- న్యూఢిల్లీ, నవంబర్ 15 (సింగిడి)

సీఎం రేవంత్‌కు రాజాసింగ్ సంచలన లేఖ

2

సజ్జనార్ అవకతవకలపై సీబీఐతో విచారణకు డిమాండ్

తెలంగాణకు రూ.30 వేల కోట్ల
ప్యాకేజీ ఇవ్వండి!

ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

ఎల్‌నినో ప్రభావంతో 365 మండలాల్లో కరువు పరిస్థితులు

తుమ్మిడిహెట్టి, సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు అనుమతులు కోరిన సీఎం

గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా ప్రారంభోత్సవాలకు రావాలని ఆహ్వానం

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావం, కరువు పరిస్థితులను అధిగమించేందుకు రూ.30 వేల కోట్ల తక్షణ ఆర్థిక ప్యాకేజీ మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఆదివారం ఢిల్లీలోని ప్రధాని నివాసం లోక్‌కల్యాణ్ మార్గ్‌లో మోదీతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అనుమతులు, కేంద్ర నిధుల కేటాయింపు తదితర అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

- న్యూఢిల్లీ, నవంబర్ 15 (సింగిడి)

2



ఓ రెండో ముఖ్యమంత్రి గారూ...
మీ రౌడీ ఎమ్మెల్యే సంగతేంది!



భర్త రఫ్ చేస్తారా..? రోడ్డెక్కమంటారా..?

శ్రీధర్‌బాబును నిలదీసిన నరేష్ యాదవ్... 'బాలి' చేతిలో 'రాజు' జాతకం!

పోచమ్మ దగ్గరకు రండి.. ఆధారాలతో నిరూపిస్తాం!

నేనేమన్నా అంటున్నానా..? అంటూ మొదలు పెట్టిన ఓ కార్మిక నాయకుడు.. ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యేపై ఆరోపణల అస్త్రాలు సంధించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడినీ వదలకుండా, తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా అభివర్ణిస్తూ మంత్రి శ్రీధర్‌బాబుపైనా సెటైర్లు విసిరారు. సొంత పార్టీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని మంత్రినే నిలదీసిన ఈ వ్యవహారం గోదావరిఖని కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది.

(గోదావరిఖని - సింగిడి)

ఆదివారం కార్మిక నాయకుడు అంబటి నరేష్ యాదవ్ సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియో రాజకీయంగా చర్చనీయాంశమైంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయనపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఎమ్మెల్యే అనుచరుల వ్యవహారశైలినీ తప్పుబట్టారు. రౌడీయిజం, అవినీతి పెరిగిపోయాయని.. ఎవరైనా ప్రశ్నిస్తే అర్ధరాత్రి దాడులు చేయిస్తున్నారంటూ ఆరోపించారు.

బూడిద లారీలు, 40 టన్నుల లారీల వ్యవహారాల్లో బినామీలను రంగంలోకి దించి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని, అడ్డొస్తే చంపుతానంటూ బెదిరిస్తున్నారని నరేష్ యాదవ్ ఆరోపించారు. ఈ పరిణామాలపై మంత్రి శ్రీధర్‌బాబు తక్షణమే జోక్యం చేసుకోకపోతే కాంగ్రెస్ పార్టీకి నష్టం తప్పదని హెచ్చరించారు.



'బాలి' గాడే చెబుతున్నాడట!

ఎమ్మెల్యే వెంట తిరిగే అనుచరులే ఆయన వ్యవహారాల గురించి చెబుతున్నారంటూ నరేష్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. గ్యాస్ లీక్‌తో మామను చంపడం, సుపారీ తీసుకుని స్కూల్ పిల్లల వ్యాన్‌ను ప్రమాదానికి గురిచేసే ప్రయత్నం చేయడం వంటి తీవ్రమైన నేరారోపణలను ప్రస్తావించారు. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై కేసు ఉందని కూడా పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర నిర్ధారణ అవసరం.

ఇవన్నీ తాను కల్పించి చెబుతున్నవి కావంటూ.. ఎమ్మెల్యే అనుచరుడు 'బాలి' పేరును ప్రస్తావిస్తూ మరిన్ని ప్రశ్నలు సంధించారు. ఎమ్మెల్యే వెంట అసలైన కాంగ్రెస్ నాయకులు లేరని, స్వార్థ ప్రయోజనాల కోసం చేరిన బ్రోకర్లే ఉన్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పోచమ్మ దగ్గర తేల్చుకుందాం!

మంత్రి శ్రీధర్‌బాబును ఉద్దేశించి.. 'రెండో ముఖ్యమంత్రి గారూ.. మీ ఎమ్మెల్యే వ్యవహారంపై వెంటనే స్పందించండి. లేకపోతే మేమే రోడ్డెక్కాల్సి వస్తుంది' అంటూ హెచ్చరించారు. ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. మీ ఎమ్మెల్యేను గోదావరిఖనిలోని పోచమ్మ గుడి దగ్గరకు తీసుకురండి.. మేము ఆధారాలతో వస్తాం.. అన్నింటినీ అక్కడే నిరూపిస్తామంటూ సవాల్ విసిరారు.

ఒకవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు.. మరోవైపు మంత్రికి బహిరంగ హెచ్చరికలు.. ఇంకోవైపు పోచమ్మ గుడి వేదికగా ఆధారాలతో చర్చకు సవాల్! నరేష్ యాదవ్ విడుదల చేసిన ఈ వీడియో ఇప్పుడు గోదావరిఖని రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే, మంత్రి వర్గాలు ఎలా స్పందిస్తాయో.. కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణ
ఆత్మగౌరవం తెలియదు!

రాహుల్ పర్యటనలో సీఎం, మంత్రుల తీరుపై కేటీఆర్ విమర్శలు

గాంధీ కుటుంబానికి బాడీగార్డుల్లా వ్యవహరిస్తున్నారంటూ వ్యాఖ్యలు

అధికారిక కార్యక్రమాల్లో రాహుల్ పాల్గొనడంపై బీఆర్ఎస్ అభ్యంతరం

2



తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు.

తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

- హైదరాబాద్, నవంబర్ 15 (సింగిడి)

బ్రేకులు లేకుండానే 463 కిమీలు
పరుగులు తీసిన వందే భారత్

రైల్వే శాఖలో ఘోర తప్పిదం

లోకో పైలట్లు మొత్తుకున్నా పట్టించుకోని అధికారులు

భారతీయ రైల్వేలో ప్రయాణికుల భద్రతను ప్రశ్నార్థకం చేసే ఓ దిగ్భ్రాంతికర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్రేకింగ్ సిస్టమ్ సరిగ్గా పనిచేయని ఓ ఖాళీ వందే భారత్ రైలును ఏకంగా 463 కిలోమీటర్ల దూరం నడిపించినట్లు తేలింది. అక్టోబర్ 24న జార్ఖండ్ నుంచి ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన ఈ తీవ్ర నిర్లక్ష్యంపై సౌత్ ఈస్టర్న్ రైల్వే జోన్ తీవ్రంగా స్పందించింది. రాంచీ డివిజనల్ రైల్వే మేనేజర్ కు విచారణ ఆదేశాలు జారీ చేస్తూ నవంబర్ 7న ఉత్తర్వులు ఇచ్చింది. నవంబర్ 11న అస్సాంలో కోల్‌కతా-సైరాంగ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనకు కొద్ది రోజుల ముందే ఈ ప్రమాదకర తప్పిదం జరగడం గమనార్హం.

- న్యూఢిల్లీ, నవంబర్ 15 (సింగిడి)

2



జనరల్ న్యూస్ సింగిడి

తెలంగాణకు రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వండి!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కీలక సమావేశం నిర్వహించారు. ఆదివారం ఢిల్లీలోని ప్రధాని నివాసం లోక్ కల్యాణ్ మార్గ్‌లో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు, సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, కేంద్ర నిధుల కేటాయింపు వంటి అంశాలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అవసరాలను వివరిస్తూ పలు కీలక వినతులు సమర్పించారు. ముఖ్యంగా రైతులను ఆదుకోవడంతో పాటు కరువు నివారణ చర్యల కోసం కేంద్రం నుంచి రూ.30 వేల కోట్ల తక్షణ ఆర్థిక సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడి పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీటి అవసరాలపై కరువు ప్రభావం పడుతోందని



వివరించారు. రైతులను ఆదుకోవడానికి, కరువు నివారణ చర్యలు చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.30 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించాలని కోరినట్లు తెలుస్తోంది. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అవసర మైన కేంద్ర అనుమతులు, నిధులు త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ సమ్మతి లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు ఇప్పించడంతో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) వచ్చేలా సహకరించాలని కోరారు. సీతమ్మసాగర్ బ్యారేజీకి పర్యావరణ అనుమతులు లభించేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని కూడా సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం అంశం కూడా ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును సమ్మక్క సాగర్ లేదా ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఈ అనుసంధానం ద్వారా తరలించే నీటిలో తెలంగాణకు 50 శాతం వాటా కేటాయించాలని కోరినట్లు సమాచారం. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేలా కేంద్రం సహకరించాలని కూడా సీఎం రేవంత్ రెడ్డి బృందం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న అంతరాష్ట్ర సమస్యలను ప్రధానికి ముఖ్యమంత్రి, మంత్రులు వివరించారు.



ఏపీకి మరో తుపాను ముప్పు

ఇది ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం, ఈ వాయుగుండం నవంబర్ 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాలు, పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని తుపానుగా మారనుంది. ఆ తర్వాత నవంబర్ 17 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడనుంది. అనంతరం మరింత తీవ్రరూపం దాల్చి, రాగల రెండు రోజుల్లో వాయవ్య దిశగా కదులుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపునకు దూసుకువచ్చే అవకాశముంది. ఇది తుపానుగా మారితే దీనిని 'అక్వాన్' అని పిలవనున్నారు. ఈ తుపాను ప్రభావంతో నవంబర్ 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర, యానాంలలోని చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబర్ 18 నుంచే కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు ప్రారంభమవుతాయి. రాయలసీమలో నవంబర్ 19, 20 తేదీల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. తెలంగాణలోనూ నవంబర్ 20న పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో నవంబర్ 18, 19 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒడిశాలో నవంబర్ 19 నుంచి 21 వరకు భారీ వర్షాలు నమోదయ్యే వీలుంది. నవంబర్ 18 నుంచి 20 వరకు కోస్తాంధ్ర, యానాం, తమిళనాడు, పుదుచ్చేరి తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం నెలకొంటుంది. నవంబర్ 20న తెలంగాణలోనూ బలమైన ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణ
ఆత్మగౌరవం తెలియదు!

ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు. కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. ఏ హోదాలో, ఏ ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్నారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ శనివారం గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఈ ప్రశ్నలను సంధించింది.

చంద్రబాబుకు
షర్మిల ఆహ్వానం

అమరావతి, నవంబర్ 15 (సింగిడి)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్వయంగా కలిశారు. తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహ మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ ఆయనకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఆమె, పెళ్లి కార్డును అందించి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తన కుమార్తె అంజలి రెడ్డి, కాబోయే అల్లుడు సోమల రఘురామ్ రెడ్డిల వివాహానికి సంబంధించిన వివరాలను చంద్రబాబుకు షర్మిల వివరించారు. పెళ్లికి తప్పనిసరిగా విచ్చేయాలని ఆమె కోరారు. సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం వైఎస్ షర్మిల ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. చంద్రబాబుకు వెడ్డింగ్ కార్డు అందజేస్తున్న ఫొటోను పోస్ట్ చేస్తూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని తన నివాసంలో కలిసి నా కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి – సోమల రఘురామ్ రెడ్డి ల వివాహ మహోత్సవానికి విచ్చేసి కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందించడం జరిగింది" అని పేర్కొన్నారు. కుమార్తె వివాహాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వైఎస్ షర్మిల.. రాజకీయాలకు అతీతంగా పలువురు ప్రముఖులను స్వయంగా కలిసి ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులకు ఆమె వివాహ ఆహ్వాన పత్రికలను అందజేశారు. తాజాగా ఏపీ సీఎం చంద్రబాబును కలిసి ఆహ్వానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. షర్మిల కుమార్తె వివాహం నవంబరు 25న జరగనుండగా, డిసెంబరు 5న రిసెప్షన్ నిర్వహించనున్నారు.

బ్రేకులు లేకుండానే 463 కిమీలు పరుగులు తీసిన వందే భారత్

అక్టోబర్ 24న జార్ఖండ్‌లోని హతియా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ కి ఓ ఖాళీ వందే భారత్ స్లీపర్ కార్ రేక్‌ను తరలించాల్సి ఉంది. దీనిని ఒక గూడ్స్ లోకో మోటివ్ (ఇంజిన్) సాయంతో లాక్కెళ్లేలా ఏర్పాట్లు చేశారు. నిబంధనల ప్రకారం, వందే భారత్ బోగీల బ్రేకింగ్ సిస్టమ్‌ను ఆ గూడ్స్ ఇంజిన్ బ్రేకింగ్ సిస్టమ్‌తో అనుసంధానం చేయాలి. కానీ, రైల్వే సిబ్బంది ఆ పనిని సరిగ్గా చేయకపోగా, రైలు సిబ్బంది ఇచ్చిన హెచ్చరికలను సైతం గాలికి వదిలేశారు.

పైలట్లు మొత్తుకున్నా పట్టించుకోలేదు

హతియా స్టేషన్ నుంచి రైలు బయలుదేరిన వెంటనే, నిబంధనల ప్రకారం లోకో పైలట్ 'బ్రేక్ ఫీల్, బ్రేక్ పవర్ టెస్ట్' నిర్వహించారు. ఆ సమయంలో రైలుకు బ్రేక్ పవర్ చాలా బలహీనంగా ఉందని, బ్రేకులు అసలు పడటం లేదని గుర్తించారు. రైలు రాంచీ స్టేషన్‌కు చేరుకోగానే, బ్రేక్ పవర్ సరిగ్గా లేదంటూ లోకో పైలట్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ, రైలును అదే స్థితిలో ముందుకు పంపించారు.
ఆ తర్వాత మూరీ స్టేషన్ నుంచి రైలును నడిపిన మరో లోకో పైలట్ కూడా ఇదే విషయాన్ని సంబంధిత కంట్రోలర్లకు నివేదించారు. బీపీ ప్రెజర్ తగ్గించినా బ్రేకులు పడటం లేదని స్పష్టంగా చెప్పారు. కానీ ఎవరూ స్పందించలేదు.

463 కిలోమీటర్ల తర్వాత అసలు విషయం బయటపడింది

ఇలా కేవలం ఇంజిన్ బ్రేకులు, రీజెనరేటివ్ బ్రేకింగ్ సాయంతోనే ఆ రైలు సుమారు 463 కిలోమీటర్లు ప్రయాణించింది. చివరకు ఉత్తరప్రదేశ్‌లోని చందౌలీ జిల్లాలో ఉన్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్‌కు చేరుకున్న తర్వాత అక్కడి సిబ్బంది ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అధికారులు రైలును క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. వందే భారత్ కోచ్‌లన్నింటి బ్రేకింగ్ సిస్టమ్‌లు 'ఐసోలేట్' (నిలిపివేసి) అయి ఉన్నాయని, అందుకే బోగీలకు బ్రేకులు పడటం లేదని తేలింది.

సిబ్బంది నిర్లక్ష్యం

ప్రాథమిక విచారణలో రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడింది. రైలు బయలుదేరే ముందే బ్రేకులు పనిచేస్తున్నాయో లేదో భౌతికంగా తనిఖీ చేయాల్సిన క్యారేజ్ అండ్ వ్యాగన్ (సిబ్బంది ఆ పని చేయలేదు. లోకో పైలట్లు పదేపదే సమాచారం ఇచ్చినా సెక్షన్, ట్రాక్షన్ కంట్రోలర్లు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వందే భారత్ బ్రేకింగ్ సిస్టమ్‌పై పూర్తి అవగాహన లేకపోవడంతో, రైలు సిబ్బంది కూడా బోగీల్లో బ్రేకులు పడుతున్నాయో లేదో చెక్ చేయలేకపోయారు. "సరైన బ్రేక్ పవర్ లేకుండా రైలును నడపడం అత్యంత ప్రమాదకరం. ఇది ఇతర ప్రయాణికుల రైళ్లకు, సిబ్బంది ప్రాణాలకు పెను ముప్పు తెచ్చేది" అని ఎస్ఈఆర్ జోన్ తన ఉత్తర్వుల్లో ఆందోళన వ్యక్తం చేసింది.

ఇక ఇంటికే శబరిమల అయ్యప్ప ప్రసాదం!

త్రివేండ్రం, నవంబర్ 15 (సింగిడి)

శబరిమల అయ్యప్ప భక్తులకు మరో శుభవార్త. ఇండియా పోస్ట్, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కలిసి ప్రత్యేక ప్రసాదం డెలివరీ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ఈనెల 17 నుంచి శబరిమల సన్నిధానంలో 24 గంటల ప్రత్యేక పార్శిల్ బుకింగ్ కౌంటర్ పనిచేయనుంది. అరవణ పాయసం, అప్పం, విభూతి, పసుపు, కుంకుమ, నెయ్యి వంటి ప్రసాదాలను స్పీడ్ పోస్టు ద్వారా దేశంలోని ఏ ప్రాంతానికైనా పంపించనున్నారు. ఒక అరవణ టిన్‌తో ఇతర ప్రసాదాలు కలిపిన పార్శిల్‌కు పోస్టల్ ఛార్జీలు సహా రూ.520 ఖర్చవుతుంది. 4 టిన్లకు రూ.960.. 10 టిన్లకు రూ.1,760 చెల్లించాలి. శబరిమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న పోస్టాఫీసుల ద్వారా కూడా ఈ సేవను వినియోగించుకోవచ్చు. శబరిమల అయ్యప్పస్వామి భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, ఇండియా పోస్టు గుడ్‌న్యూస్ చెప్పాయి. ఇకపై భక్తులు శబరిమలలో స్వామివారి ప్రసాదాలను కొనుగోలు చేసి.. వాటిని నేరుగా తమ ఇంటి వద్దకే తెప్పించుకోవచ్చు. ఇందుకోసం ఇండియా పోస్ట్ ప్రత్యేక పార్శిల్ బుకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. అరవణ పాయసం, అప్పంతో పాటు ఇతర ప్రసాదాలను దేశంలోని ఏ ప్రాంతానికైనా స్పీడ్ పోస్టు ద్వారా పంపించుకునే అవకాశం కల్పించనుంది. మండల-మకరవిళక్కు యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ), ఇండియా పోస్టు మధ్య కుదిరిన ఒప్పందం మేరకు శబరిమల సన్నిధానంలో ప్రత్యేక పార్శిల్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ సముదాయంలోని అరవణ, అప్పం ప్రసాదాల పంపిణీ కౌంటర్ల పక్కనే ఈ కేంద్రం పని చేస్తుంది. భక్తులు రోజులో ఎప్పుడైనా తమకు కావాల్సిన ప్రసాదాలను బుక్ చేసుకోవచ్చు. ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ సేవ మండల యాత్రా కాలం మొత్తం.. అంటే 41 రోజుల పాటు అందుబాటులో ఉండనుంది. భక్తులు తమ ఇంటి అడ్రస్ వివరాలు అందిస్తే ఇండియా పోస్ట్ సిబ్బంది స్పీడ్ పోస్టు ద్వారా ప్రసాదాలను ఇంటికి పంపిస్తారు. ఈ సదుపాయం ద్వారా కేవలం అరవణ పాయసం మాత్రమే కాకుండా శబరిమలలో లభించే పలు ప్రసాదాలను కూడా పంపించుకోవచ్చు. శబరిమల అయ్యప్ప ప్రసాదాల్లో భాగంగా అరవణ ప్రసాదం, అప్పం, విభూతి, పసుపు, కుంకుమ, ఆడియ శిష్టం నెయ్యి, అష్టోత్తరార్చన ప్రసాదాలు ఉన్నాయి. భక్తులు తమకు కావాల్సిన ప్రసాదాలను ఎంచుకుని పార్శిల్ బుక్ చేసుకునే సదుపాయం కల్పించనున్నారు. ప్రసాదాల పరిమాణాన్ని బట్టి ధరలు, పార్శిల్ పంపించే ఛార్జీలు మారుతాయి.



భారీగా పెరిగిన ఓటర్ల నమోదు

హైదరాబాద్, నవంబర్ 15 (సింగిడి)

రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలకు ఎమ్మెల్సీల ఎన్నిక ప్రక్రియ ఊపందుకుంది. రెండు నెలల క్రితం ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మొన్నటి వరకు 2.5 లక్షలుగా ఉన్న దరఖాస్తులు రెండు వారాల్లోనే 6 లక్షలకు చేరుకున్నాయి. కాగా ఎన్నికల అధికారులు దీనిపై ముమ్మరంగా ప్రచారం చేశారు. మరికొన్ని రోజుల్లో తుది జాబితా విడదల అవ్వనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెల్సీ పదవికాలం మార్చి 29, 2027న ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాయి.

తుది జాబితా విడుదల అప్పుడే!

రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనుంది. తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 30న ముద్రిస్తారు. ఎన్నికల షెడ్యూల్‌ను జనవరి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు సమాచారం. తుది ఓటర్ల జాబితా తర్వాత దరఖాస్తులను పరిశీలించి, ఆమోదించిన దరఖాస్తులతో మరో రెండు అనుబంధ ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తారని అధికారులు చెబుతున్నారు.

రికార్డు స్థాయిలో ఓటరు నమోదు

గత ఎన్నికల్లో మూడు ఉమ్మడి జిల్లాల్లో అంటే ప్రస్తుత 9 జిల్లాల్లో 156 మండలాల నుంచి 5 లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇప్పుడు ఓటర్ల జాబితాలో అదనంగా లక్ష నుంచి రెండు లక్షల మంది చేరే సూచనలు ఉన్నాయని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఓటరు నమోదు దరఖాస్తులపై నిఘాను పెంచారు. 6 లక్షల దరఖాస్తుల్లో ఇప్పటి వరకు కేవలం 2,57,309 దరఖాస్తులు మాత్రమే ఆమోదించారు. 6,330 దరఖాస్తులు తిరస్కరించగా, 3.35 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

అప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు

ఈ నెల 6 వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి, 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు సుదర్శన్ రెడ్డి ఇటీవల తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురించిన తర్వాత ఈ నెల 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల సమయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిశీలించి వచ్చే నెల 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామన్నారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత నామినేషన్ల గడువు చివరి రోజు వరకు కూడా గ్రాడ్యుయేట్ల ఓటు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

జిల్లాల వారీగా దరఖాస్తులు ఇవే!

రంగారెడ్డి	1,51,777
వికారాబాద్	40,125
మేడ్చల్	1,43,039
హైదరాబాద్	1,02,946
మహబూబ్‌నగర్	45,489
నాగర్‌కర్నూల్	43,638
వనపర్తి	29,274
గద్వాల్	22,986
నారాయణ్‌పేట్	20,145
మొత్తం	55,99,419

పార్టీల వారీగా ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వారి అభ్యర్థులను ఇదివరకే ఎంపిక చేశాయి. బీఆర్ఎస్ నుంచి ఇంకా ఎవరినీ బరిలో నిలపలేదు. బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైన ఎన్.రాంచందర్‌రావును ఖరారు చేసినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా ఆయనను ఎంపిక చేసినట్లు సమాచారం. మరికొన్ని రోజుల్లో ఆయన పేరును పార్టీ అధికారికంగా ప్రకటించనుంది.

పేలుళ్లు.. సైరన్లతో
దద్దరిల్లిన బహ్రెయిన్

బహ్రెయిన్‌లో అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ డ్రోన్ల దాడి
ఆరు డ్రోన్లతో దాడి చేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటన
పేలుళ్లు, సైరన్లతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు
అమెరికా మరో తప్పు చేస్తే పరిస్థితులు చేయి దాటుతాయని హెచ్చరిక

న్యూఢిల్లీ, నవంబర్ 15 (సింగిడి)

పేలుళ్లు, సైరన్లతో గల్ఫ్ దేశమైన బహ్రెయిన్ లో మోతమోగింది. అల్-రిఫా హెలికాప్టర్ స్థావరం వద్ద ఉన్న అమెరికా సైనిక స్థావరం పై తాము దాడి చేసినట్లు ఆదివారం ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఆ లక్ష్యంపై ఆరు డ్రోన్లు ప్రయోగించినట్లు తెలిపింది. అమెరికా చేసే ఎలాంటి దురాక్రమణకైనా కఠినమైన, మరింత తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించింది. దీంతో అప్రమత్తమైన బహ్రెయిన్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది.. వరుస పేలుళ్లు, సైరన్‌ల శబ్దాలతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఎత్తైన ప్రదేశాలను వదిలి, వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు ప్రజలకు సూచించారు.

అమెరికా మరో తప్పు చేస్తే..
పరిస్థితులు చేయి దాటుతాయి: ఇరాన్

ఇరాన్‌పై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనలపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రరాజ్యం మరో తప్పు చేస్తే..పరిస్థితులు చేయి దాటుతాయని హెచ్చరించారు. 'అమెరికా చర్చల మార్గాన్ని ఎంచుకుంటుందా లేక యుద్ధ మార్గాన్ని ఎంచుకుంటుందా అనేది మేము పట్టించుకోము. మేము పెట్టిన ఏడు షరతులను అంగీకరిస్తేనే ఆ దేశంతో ఒప్పందానికి ద్వారాలు తెరుచుకుంటాయి. అలా కాదని మళ్లీ దాడులకు తెర లేపితే శక్తిమంతమైన ఇరాన్ సాయుధ దళాలు యుద్ధ క్షేత్రాన్ని నిర్దేశిస్తాయి' అని హెచ్చరించారు.

సీఎం రేవంత్‌కు
రాజాసింగ్ సంచలన లేఖ

హైదరాబాద్, నవంబర్ 15 (సింగిడి)



హైదరాబాద్ సీపీగా బాధ్యతలు నిర్వర్తించి ఇటీవల బదిలీ అయిన వీసీ సజ్జనార్‌పై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. సజ్జనార్ హయాంలో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలన్నారు. బంగారం చోరీ, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో దర్యాప్తు దారి మళ్లిందనే అనుమానాలపై స్వతంత్ర దర్యాప్తు చేయాలన్నారు. కర్ణాటకలోని సజ్జనార్ సొంతూరిలో 100 ఎకరాల భూమి కొన్నట్లు వస్తున్న ఆరోపణలపై కూడా విచారించాలన్నారు. ఇటీవల సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు సజ్జనార్‌పై చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈమేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి రాజాసింగ్ లేఖ రాశారు. ఆస్తుల వివరాలు, ఆదాయ వనరులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయా? అన్నది తే ల్చాలని డిమాండ్ చేశారు. జనార్ధన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ సజ్జనార్ చేసిన ఇటీవలి ట్వీట్ తర్వాత ఆయన ప్రవర్తన పై పలు ప్రశ్నలు, అనుమానాలు మరింత బలపడ్డాయని రాజా సింగ్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ఆయన హయాంలో జరిగిన కొన్ని దర్యాప్తుల పారదర్శకత, నిష్పక్షపాతతపై ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.

బంగారం చోరీ కేసు

బంగారం చోరీ కేసులో ఎలాంటి పురోగతి లేదని, ఇప్పటివరకు అరెస్టులు ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడానికి, వాస్తవాలను తొక్కి పెట్టడానికి ఏవైనా ప్రయత్నాలు జరిగాయా అనేది తేల్చాలన్నారు. ఆయన హయాంలో నమోదైన హోమ్‌వే కేసులో కూడా తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ, దర్యాప్తులో ఆశించిన పురోగతి లేదని లేఖలో ఎత్తిచూపారు. ఈ కేసు విచారణలో జాప్యానికి గల కారణాలను స్వతంత్రంగా పరిశీలించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చిన తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కుంభకోణం దర్యాప్తు దారి మళ్లిందనే తీవ్ర ఆందోళనలు ఉన్నాయని రాజా సింగ్ పేర్కొన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డితో సహా ఉన్నతాధికారుల ప్రమేయంపై ఆరోపణలు, ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ విచారణ పురోగతిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. అప్పటి సీపీ సజ్జనార్ పాత్రపై కూడా స్వతంత్ర విచారణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్
ప్రపంచ నాయకత్వం సాధించాలి!

హైదరాబాద్, నవంబర్ 15 (సింగిడి)

అధునాతన సాంకేతికతలను కేవలం వినియోగించే దేశంగా కాకుండా, వాటిని స్వయంగా అభివృద్ధి చేసే, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే, ప్రపంచ నాయకత్వాన్ని సాధించే దేశంగా భారత్ ఎదగాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. దేశ రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు స్వావలంబన సాధించేందుకు నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఎన్‌డీటీ) వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 36వ వార్షిక ఎన్‌డీఈ అండ్ ఎనేబ్లింగ్ టెక్న

పంచాయతీ నిధులకు గోల్‌మాల్ గండం!

అభివృద్ధి పనుల పేరుతో అక్రమాలకు తెరలేపుతున్నారా?
ప్రజాధనం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు.. బిల్లుల మాయాజాలంపై విచారణ ఎప్పుడు?

(కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 15 సింగిడి)



గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధులు గ్రామాల రూపురేఖలు మార్చాల్సింది పోయి, కొందరి జేబులు నింపుతున్నాయనే ఆరోపణలు గ్రామీణ ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం విడుదల చేస్తున్న పంచాయతీ నిధులు సక్రమంగా ఖర్చవుతున్నాయా? చేసిన పనులకే బిల్లులు చెల్లిస్తున్నారా? కాగితాలపైనే అభివృద్ధి చూపిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కాగితాలపైనే అభివృద్ధి.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి?గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయిస్తోంది. అయితే కొన్ని గ్రామాల్లో పనులు పూర్తిస్థాయిలో జరగకుండానే బిల్లులు సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల నాణ్యతలేని పనులు చేపడుతున్నారని, మరికొన్ని చోట్ల పనుల అంచనా వ్యయాలు, వాస్తవ ఖర్చుల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.బిల్లుల మాయాజాలం.. తనిఖీలు చేసే వారెవరు?పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు, అంచనా పత్రాలు, కొలతల పుస్తకాలు, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, చెల్లింపుల వివరాలు పారదర్శకంగా ఉండాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియలో ఎక్కడైనా అక్రమాలు జరిగితే వాటిని గుర్తించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది. ఒకే పనికి రెండుసార్లు బిల్లులు సమర్పించడం, పనుల పరిమాణాన్ని ఎక్కువగా చూపించడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వంటి ఆరోపణలు నిజమా కాదా అన్నది సమగ్ర విచారణ ద్వారానే తేలాలి.ప్రజాధనం ప్రజల కోసమే.. మరి ఫలితం ఎక్కడ?గ్రామంలో రోడ్లు బాగుండాలి, మురుగునీటి సమస్య పరిష్కారం కావాలి, తాగునీరు అందాలి, వీధులు పరిశుభ్రంగా ఉండాలి అనేది ప్రతి గ్రామస్థుడి ఆకాంక్ష. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలయ్యే సొమ్ముతో పాటు ప్రభుత్వం విడుదల చేసే నిధులు కూడా ప్రజల సంక్షేమానికే వినియోగించాలి. కానీ నిధులు ఖర్చయినట్లు రికార్డుల్లో కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో అభివృద్ధి కనిపించకపోతే ప్రజల్లో అనుమానాలు రావడం సహజం.సామాజిక తనిఖీలు నిర్వహించాలిప్రతి గ్రామపంచాయతీలో గత కొన్ని సంవత్సరాలుగా విడుదలైన నిధులు, చేపట్టిన పనులు, వాటి అంచనా వ్యయాలు, చెల్లించిన బిల్లులు, పనుల ప్రస్తుత పరిస్థితిపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలి. గ్రామ సభల్లో ఆదాయ వ్యయాల వివరాలను ప్రజలకు వెల్లడించాలి. అవసరమైన చోట సామాజిక తనిఖీలు నిర్వహించి, అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.ఉన్నతాధికారుల స్పందన ఏది?పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు ఈ ఆరోపణలను తేలికగా తీసుకోకుండా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రతి గ్రామంలో చేపట్టిన పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చాలి. నిధుల వినియోగంలో పారదర్శకత తీసుకురావాలి. అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా సరే బాధ్యత వహించేలా చర్యలు ఉండాలి.గ్రామాభివృద్ధి కోసం విడుదలైన ప్రతి రూపాయి గ్రామ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడటం అధికారుల బాధ్యత మాత్రమే కాదు.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరి బాధ్యత కూడా. గ్రామాల అభివృద్ధి పేరుతో నిధుల గోల్‌మాల్ జరిగిందా? లేక ఆరోపణల్లో వాస్తవం లేదా? అన్నది పారదర్శక విచారణతోనే తేలాలి. ప్రజలకు కావాల్సింది కాగితాలపై అభివృద్ధి కాదు.. కళ్లముందు కనిపించే నిజమైన అభివృద్ధి!



విశ్వహిత శతకం పుస్తకావిష్కరణ

ప్రపంచ హితం కోసం కవులు పునరంకితం కావాలి
కాళోజీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 15 (సింగిడి)

ప్రపంచ హితం కోసం కవులు మరోసారి పునరంకితం కావాల్సిన అవసరం ఉందని బహుభాషావేత్త, కాళోజీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న సంఘర్షణలు, సమస్యలను వెలికితీసి ప్రజలకు తెలియజేయడంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ కవి వెంగళ లక్ష్మణ్ రచించిన 'విశ్వహిత శతకం' పుస్తకాన్ని నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సమాజంలో జరిగే సంఘర్షణలు, పరిణామాలను నిశితంగా పరిశీలించి వాటిపై స్పందిస్తూ రచించిన పుస్తకమే విశ్వహిత శతకమని అన్నారు. తన కళ్లముందు జరుగుతున్న సంఘటనలను చూసి చలించి, వ్యాకులతకు గురై, ఆందోళనతో కలాన్ని కదిలించిన సందర్భాలు ఈ రచనలో ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. మనసుపెట్టి చదివితే ఇక్కడి మట్టి, గాలి, పరిసరాల ప్రభావంతో కవుల అంతరంగిక వేదన, సామాజిక స్పృహ అర్థమవుతాయని వివరించారు.సిరిసిల్ల నుంచి పలువురు కవులు తమ రచనల ద్వారా సమాజ హితాన్ని చాటుతున్నారని కొనియాడారు. ఈ పుస్తకంలోని పదాలు, పద్యాలు సామాన్య పాఠకులకు సైతం సులభంగా అర్థమయ్యేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సాహిత్యం ద్వారా సమాజంలోని సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడం అభినందనీయమని అన్నారు. రచయిత వెంగళ లక్ష్మణ్ రచనలను పలువురు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జనపాల శంకరయ్య, జూకంటి జగన్నాథం, బుర్మా గోపాల్‌తో పాటు పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

నేడు బాలల ప్రజావాణి
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 15(సింగిడి)



బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సాధారణ ప్రజావాణితో పాటు బాలల ప్రత్యేక ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.పిల్లల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ టి.జి.ఎస్. పి సి.ఆర్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సాధారణ ప్రజావాణితోపాటు ప్రత్యేకంగా 'బాలల ప్రజావాణి' నిర్వహించాలని నిర్ణయించింది.ఈ బాలల ప్రజావాణిలో బాలలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాలల హక్కుల పరిరక్షణ, బాలల భద్రత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అనాథ, సంరక్షణ అవసరమైన బాలల సమస్యలు, బాలల అభివృద్ధి తదితర అంశాలపై ఫిర్యాదులు, వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.అలాగే బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వ్యక్తులు కూడా తమ పరిధిలోని బాలల సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. బాలలకు మెరుగైన భవిష్యత్తును అందించడంతో పాటు, వారి హక్కులను కాపాడి, సమస్యలకు పరిష్కారం చూపడమే బాలల ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.

సీపీఎస్ రద్దు కోసం 'చలో ఢిల్లీ'కి టీఎన్జీఓ పిలుపు

డిసెంబర్ 12న రాంలీలా మైదానంలో 'కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ'
పెద్దపల్లి జిల్లా ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలి:
టీఎన్జీఓ అధ్యక్ష, కార్యదర్శులు బొంకూరి శంకర్ అయిరెడ్డి సందీప్ రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 15 (సింగిడి):

కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ప్రధాన డిమాండ్‌తో డిసెంబర్ 12న చేపట్టనున్న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎన్జీఓ యూనియన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బొంకూరి శంకర్, జిల్లా కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ జీవితానికి ఆర్థిక భద్రత కల్పించాల్సిన పెన్షన్ వ్యవస్థ నేడు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2004 జనవరి 1 నుంచి కేంద్రం తెచ్చిన నూతన పెన్షన్ విధానం , రాష్ట్రంలో అమలవుతున్న సీపీఎస్ వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడే ఈ విధానంలో చివరి వేతనం ఆధారంగా కనీస పెన్షన్ భరోసా లేకపోవడం, ఉద్యోగి మరణానంతరం కుటుంబ పెన్షన్ ప్రయోజనాలపై స్పష్టత లేకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కేంద్రం కొత్తగా తెచ్చిన యూపీఎస్ విధానం కూడా ఓపీఎస్‌కు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. డిసెంబర్ 12న ఢిల్లీలో ఉద్యోగుల మహాగర్జన ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12, 2026న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ' నిర్వహించనున్నట్లు తెలిపారు. పీఎఫ్ఆర్డీఏ చట్టం రద్దు, ఎన్పీఎస్ సీపీఎస్ రద్దు, యూపీఎస్ ఉపసంహరణ, పాత పెన్షన్ పునరుద్ధరణ మరియు ఉద్యోగులకు సంపూర్ణ సామాజిక భద్రత కల్పించాలనే డిమాండ్లతో ఈ మహాగర్జన జరుగుతుందన్నారు. ఈ పోరాటం కేవలం ప్రస్తుత ఉద్యోగుల కోసమే కాకుండా భావితరాల భవిష్యత్తు కోసం కూడా అని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఢిల్లీకి తరలివచ్చి ఉద్యోగుల ఐక్యతను చాటాలని వారు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 15 (సింగిడి)

సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్డే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం చేస్తూ ప్రధాని మోడీ ,అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు అనంతరం సిరిసిల్ల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు మాట్లాడుతూ విదేశీ ప్రతినిధులకు కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో వీసాలు రద్దు చేసిందని లేదా అనుమతి నిరాకరించిందని ఆరోపించారు. బిజెపి నేతలు నియంతలా వ్యవహరిస్తున్నారని, ప్రశ్నించే గొంతులను చూసి భయపడుతున్నారని విమర్శించారు.తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణకు వచ్చే పెట్టుబడులను కంపెనీలను యువతకు ఉద్యోగ అవకాశాలు రాకుండా అడ్డుకుంటున్నారని, వారిని తెలంగాణ ప్రజానీకం బీజేపి నేతలను క్షమించబోరని సుర దేవరాజు మండిపడ్డారు.రాహుల్ గాంధీ హోదాపై వివరణ. రాహుల్ గాంధీ కేవలం కాంగ్రెస్ నేత మాత్రమే కాదని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాజ్యాంగ బద్ధమైన హోదా అని ప్రభుత్వం గుర్తుచేస్తోంది. గతంలో ప్రధాని రాజీవ్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్న వాజ్‌పేయిని విదేశీ సదస్సులకు పంపారని, మోదీ విదేశాల్లో సదస్సులు పెడితే తప్పు లేనప్పుడు రాహుల్ హైదరాబాద్ వస్తే తప్పేంటని సుర దేవరాజు నిలదీశారు.గిగ్ వర్కర్స్ పాలసీ పెట్టుబడులు. రాహుల్ గాంధీ కేవలం ప్రసంగించడానికే కాకుండా, తెలంగాణ ప్రభుత్వం తెస్తున్న 'గిగ్ వర్కర్స్ పాలసీ' ప్రారంభించడానికి వచ్చారని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వచ్చినప్పటి నుండి నిర్వహించిన గ్లోబల్ సదస్సులు అంతర్జాతీయ పర్యటనల ద్వారా వేల కోట్లు పెట్టుబడి ఒప్పందాలు కుదిరాయని తెలంగాణ ప్రజలు సంతోషిస్తే బిజెపి నాయకులకు ఏమో జీర్ణించుకోలేక పోతున్నారు అని ఇష్టమొచ్చిన ఆరోపణ చేస్తున్నారని ఇది మీకు తగదని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు మాజీ పీసీసీ కార్యదర్శి గడ్డం నరసయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్ టౌన్ ఉపాధ్యక్షులు మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ బొప్ప దేవయ్య మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొలనూరి రమాదేవి నాయకులు గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్ రాగుల రాములు కంసాల మల్లేశం పత్తిపాక లక్ష్మీరాజ్యం బైరి ప్రభాకర్ బూర యాదగిరి ఇప్పపూల లక్ష్మణ్ శ్రీనివాస్ మల్లేశం ఆడపు ప్రసాద్ తడక వెంకటేశం పాల్గొన్నారు.

ఓటు వేసిన తర్వాత ఓటరు గుర్తుండడా?

ఎన్నికల వేళే ప్రజలు గుర్తుకొస్తారా..?
హామీల అమలుకు ఐదేళ్లు ఎందుకు పట్టాలి!

(కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 15 సింగిడి)



ప్రజాస్వామ్యంలో ఓటరే అసలైన యజమాని. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత అదే ఓటరుకు ప్రజా ప్రతినిధుల దర్శనం కరువవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు ఇంటింటికీ తిరుగుతూ చేతులు జోడించి ఓట్లు అడిగే నాయకులు, గెలిచిన తర్వాత ప్రజల సమస్యలు వినేందుకు సమయం కేటాయించకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆలోచించాల్సిన అంశం.ఎన్నికలు వచ్చాయంటే చాలు.. గ్రామాల్లో సందడి మొదలవుతుంది. వీధివీధికి నాయకుల రాక, ఇంటింటికీ పలకరింపులు, హామీల వర్షం, అభివృద్ధి పనులపై భరోసాలు.. ఇలా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతాయి. రోడ్లు వేయిస్తాం, డ్రైనేజీలు నిర్మిస్తాం, తాగునీటి సమస్య పరిష్కరిస్తాం, యువతకు ఉపాధి కల్పిస్తాం, పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తాం అంటూ ఎన్నో మాటలు చెబుతారు.కానీ ఎన్నికల ప్రక్రియ ముగిసి, ఫలితాలు వెలువడి, అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పరిస్థితి మారిపోతుందనే భావన ప్రజల్లో బలపడుతోంది. ఎన్నికల సమయంలో కనిపించిన నాయకులు ఆ తర్వాత ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ఇచ్చిన హామీల అమలు గురించి అడిగితే స్పష్టమైన సమాధానం దొరకడం లేదని పలుచోట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.హామీలు ఎన్నికలకేనా.. ప్రజల సమస్యలకు పరిష్కారం ఎప్పుడు?ఒక గ్రామంలో రోడ్డు సమస్య ఉండవచ్చు. మరోచోట తాగునీటి బాటులో లేకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా మారకూడదు.ప్రజలు నాయకులను ఎన్నుకునేది కేవలం పదవులు అప్పగించడానికి కాదు. తమ ప్రాంత అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం, తమ గొంతుకను ప్రభుత్వానికి వినిపించడానికి. అందుకే గెలిచిన నాయకుడు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజల మధ్య ఉండాలి. వారి సమస్యలు వినాలి. సాధ్యమైన వాటిని పరిష్కరించాలి. సాధ్యం కాని వాటిపై వాస్తవ పరిస్థితిని వివరించాలి.ఓటరులోనూ మార్పు రావాలి!బాధ్యత కేవలం నాయకులపైనే ఉందని భావించడం సరైంది కాదు. ఓటర్లలోనూ చైతన్యం పెరగాలి. కులం, మతం, ప్రాంతం, వ్యక్తిగత పరిచయాలు, తాత్కాలిక ప్రలోభాలకు అతీతంగా అభ్యర్థుల పనితీరు, ప్రజా సమస్యలపై వారి అవగాహన, గతంలో చేసిన సేవలు, ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలను పరిశీలించే రాజకీయ చైతన్యం అవసరం.ఎన్నికల సమయంలో ప్రశ్నించినట్లే ఎన్నికల తర్వాత కూడా ప్రశ్నించాలి. ఇచ్చిన హామీలపై నిలదీయాలి. గ్రామసభల్లో పాల్గొనాలి. అభివృద్ధి పనుల వివరాలు అడగాలి. ప్రజాధనం ఎలా ఖర్చవుతోందో తెలుసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం తప్పు కాదు.. అది పౌరుడి హక్కు, బాధ్యత.మారాల్సింది రాజకీయ సంస్కృతి!ప్రజాప్రతినిధులు ప్రజలను ఓటర్లుగా మాత్రమే కాకుండా తమను ఎన్నుకున్న యజమానులుగా చూడాలి. ప్రతి గ్రామంలో ప్రజలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి. సమస్యల పరిష్కారానికి గడువులు నిర్ణయించాలి.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే స్పష్టమైన సమాధానం చెప్పాలి

తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్ చార్జ్ చెన్నమల్ల చైతన్య డిమాండ్

మానకొండూర్, నవంబర్15(సింగిడి)



నియోజకవర్గంలోని గన్నేరువరం మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు,ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు.గన్నేరువరం మండల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న గుండ్లపల్లి–గన్నేరువరం–పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణంపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ బిల్లుల సమస్య ఉందని చెప్పి ప్రజల సమస్యలను పక్కన పెట్టడం సరైన పరిష్కారం కాదన్నారు. మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఇచ్చిన హామీ అమలు ఎక్కడి వరకు వచ్చిందో ప్రజలకు తెలియజేయాలని, సర్వే, ప్రతిపాదనలు, నిధుల మంజూరు వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.ప్రతి మండలానికి స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి నిరుద్యోగ యువతకు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ అందించాలని అన్నారు. మండలంలో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.రైతులకు సాగునీరు, విద్యుత్, రైతు భరోసా, పంటల కొనుగోలు, పంట నష్టపరిహారం వంటి అంశాల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై బహిరంగ శ్వేతపత్రం విడుదల చేయాలి అన్నారు.తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్కపై ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్ చేసిన నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గతంలో టీఆర్ఎస్ పార్టీపై చేసిన విమర్శలు, ప్రచారంలో చేసిన ఆరోపణలను కూడా ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. కవితపై చేసిన వ్యాఖ్యలకు ప్రవీణ్ కుమార్ ఆధారాలు ప్రజల ముందుంచాలని, తన వ్యాఖ్యలను సమీక్షించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగులకు అండగా నిలవడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, రైతుల సంక్షేమానికి కృషి చేయడం, సమాజంలోని అన్ని వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడం తమ పార్టీ లక్ష్యాలని తెలిపారు. మానకొండూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల యువతీ యువకులు, మహిళలు, విద్యార్థులు, మేధావులు, రైతులు, నిరుద్యోగులు, సామాజిక న్యాయం కోరుకునే ప్రతి ఒక్కరూ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గన్నేరువరం మండల అధ్యక్షులు గువ్వా అభిషేక్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి మొగ్గ మల్లేశం, నియోజకవర్గ సంయుక్త కార్యదర్శి గువ్వా శ్రీనివాస్, రక్షణ సేన యువ నాయకులు అభిలాష్, అజయ్, నగునూరి చంద్రబోస్, వడ్లకొండ అక్షయ్, పూర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బీమా పథకంలో అక్రమాలు?

మరణించిన వారి పేర్లతో లేబర్ కార్డులు నకిలీ డెత్ సర్టిఫికెట్లతో పరిహారం కాజేత
అధికారులు, దళారుల కుమ్మక్కుపై బాధితుల ఆరోపణలు
సమగ్ర విచారణకు డిమాండ్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 15 (సింగిడి)

జిల్లాలో కార్మికుల బీమా పథకంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మరణించిన కార్మికుల పేర్లతో లేబర్ కార్డులు సృష్టించి, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో బీమా పరిహారాన్ని కాజేస్తున్నారని బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన బాధితులు ఆరోపించారు.సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బాధితుడు శ్రీనివాస్ నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తన మామ దాకూరి మల్లారెడ్డి 2019లో విద్యుదాఘాతంతో మృతి చెందగా, ఆయన పేరుతో 2020లో లేబర్ కార్డు నమోదు చేసి, 2022లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించినట్లు మరో డెత్ సర్టిఫికెట్ సృష్టించి రూ.6.30 లక్షల బీమా సొమ్ము కాజేశారని ఆరోపించారు. మరో బాధితుడు అల్వాల లక్ష్మణ్ మాట్లాడుతూ, తన అక్క కూస లక్ష్మి పేరుతోనూ నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి రూ.1.30 లక్షల పరిహారం పక్కదారి పట్టించారని తెలిపారు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలేదని, విచారణ పేరుతో బెదిరింపులు ఎదురవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా లేబర్ కార్డుల నమోదు, బీమా క్లెయిమ్‌లు, మరణ ధ్రువీకరణ పత్రాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అసలైన నామినీలకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



గిరిజన హక్కుల పోరాట యోధుడు బిర్సా ముండా ఆశయాలు ఆదర్శనీయం!

కామారెడ్డిలో ఘనంగా జనజాతి గౌరవ్ దివస్ వేడుకలు

కామారెడ్డి, నవంబర్ 15:సింగిడి



గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం సాగించి, తన జీవితాన్ని సమాజం కోసం అంకితం చేసిన భగవాన్ బిర్సా ముండా ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (జడ్పీ సీఈఓ) చందర్ అన్నారు.భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ఆదివారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జనజాతి గౌరవ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని అధికార

ఎడిటోరియల్

Editorial

మౌన ముద్ర
వీడిన వేళ..
సోనియా ఆత్మకథ రేపుతున్న రాజకీయ ప్రకంపనలు

భారత రాజకీయ యవనికపై దశాబ్దాల పాటు అత్యంత శక్తివంతమైన కేంద్రబిందువుగా నిలిచినప్పటికీ, తన అంతరంగాన్ని ఎప్పుడూ బాహ్య ప్రపంచానికి తెరవని నాయకురాలు సోనియా గాంధీ. అటువంటి నేత తన జీవిత గమనాన్ని అక్షరబద్ధం చేస్తూ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' (దీవశ్రీశీఅస్త్రఅఅస్త్ర:్రా జీశీబతీఅవఎ శీటఅశీజవ) పేరుతో ఆత్మకథను తీసుకురావడం దేశ రాజకీయ, సాహిత్య వర్గాల్లో పెను సంచలనానికి దారితీసింది. ఇటలీలోని ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి భారత్‌లోని అత్యున్నత రాజకీయ వంశానికి కోడలిగా అడుగు పెట్టి, ఆపై దేశ గతిని నిర్దేశించే స్థాయికి ఎదిగిన ఆమె ప్రయాణం ఒక అరుదైన చారిత్రక ఘట్టం.

వ్యక్తిగత సంఘర్షణలు – రాజకీయ అనివార్యతలు

ఈ పుస్తకంలో సోనియా గాంధీ ప్రధానంగా తన వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగాలను, కుటుంబ అనుబంధాలను ఆవిష్కరించారు. 1965లో కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీతో చిగురించిన ప్రేమ, భారతీయ సంప్రదాయాల్లో ఒదిగిపోయిన తీరును ఆమె హృద్యంగా వివరించారు. ముఖ్యంగా, రాజకీయాలంటే తనకు మొదటి నుంచీ విముఖత ఉండేదని, తన భర్త రాజీవ్ గాంధీ ప్రజాజీవితంలోకి రావడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని ఆమె వెల్లడించడం ఆసక్తికరం. అయితే, అత్తగారు ఇందిరా గాంధీ, ఆ తర్వాత భర్త రాజీవ్ గాంధీల దారుణ హత్యలు ఆమె జీవిత గమనాన్ని పూర్తిగా మార్చివేశాయి. విషాదం నుంచి తేరుకుని, పార్టీని కాపాడుకునే క్రమంలో ఆమె రాజకీయ బాధ్యతలు చేపట్టాల్సిన అనివార్య పరిస్థితులను ఈ పుస్తకం కళ్లకు కడుతుంది.

అధికార త్యాగమా? వ్యూహాత్మక నిర్ణయమా?

2004 సార్వత్రిక ఎన్నికల్లో యూపీఏ కూటమిని విజయతీరాలకు చేర్చిన తర్వాత, ప్రధానమంత్రి పదవిని వదులుకుని మన్మోహన్ సింగ్‌కు ఆ బాధ్యతలు అప్పగించిన ఘట్టం భారత రాజకీయాల్లో ఎప్పుడూ చర్చనీయాంశమే. తన అంతరాత్మ ప్రబోధం మేరకే ఆ నిర్ణయం తీసుకున్నానని, దేశ ప్రయోజనాలే తనకు ముఖ్యమని సోనియా తన ఆత్మకథలో స్పష్టం చేశారు. ఒక దశాబ్దం పాటు తెరవెనుక ఉంటూనే సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపించిన తీరును ఆమె విశ్లేషించారు. అయితే, ఇది నిస్వార్థ త్యాగమా లేక అప్పటి రాజకీయ సమీకరణాల దృష్ట్యా తీసుకున్న వ్యూహాత్మక అడుగా అన్న చర్చ మరోసారి తెరపైకి వచ్చింది.

రాజకీయ దుమారం – భిన్న కోణాలు

ఇది కేవలం తన వ్యక్తిగత, కుటుంబ ప్రయాణం మాత్రమేనని సోనియా పేర్కొన్నప్పటికీ, పుస్తకంలోని కొన్ని అంశాలు రాజకీయ విమర్శలకు తావిచ్చాయి. గత ఆరు దశాబ్దాలుగా దేశంలో జరిగిన రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులను విశ్లేషిస్తూ, ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరుపై ఆమె చేసిన వ్యాఖ్యలు అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. కాంగ్రెస్ శ్రేణులు ఈ పుస్తకాన్ని ఒక విదేశీ యువతి భారతదేశాన్ని తన మాతృభూమిగా స్వీకరించి చేసిన త్యాగానికి ప్రతీకగా అభివర్ణిస్తుంటే, విమర్శకులు మాత్రం ఇందులో చారిత్రక వాస్తవాలను తమకు అనుకూలంగా మలుచుకున్నారని ఆరోపిస్తున్నారు. రాజకీయ విమర్శలు, ప్రశంసలు ఎలా ఉన్నప్పటికీ, దశాబ్దాల పాటు మౌనంగా ఉన్న ఒక కీలక నేత తన గళాన్ని విప్పడం భారత రాజకీయ చరిత్రకు ఒక ముఖ్యమైన ఆధారం. అధికారం, విషాదం, బాధ్యతల మధ్య నలిగిన ఒక మహిళ అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ పుస్తకం, సమకాలీన భారత రాజకీయాలను లోతుగా అర్థం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుంది.



ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170

జానపద సినీ కథా నాయకుడు కాంతారావు
నవంబర్ 16.. కత్తి కాంతారావు జయంతి

తెలుగు సినీరంగంలో నందమూరి, అక్కినేనిల హవా నడుస్తున్న రోజుల్లో, సినిమాలు పరిమితంగా నిర్మిస్తున్న కాలంలో మరో హీరోకి అవసరం ఉందన్న ఆలోచన సినీ పరిశ్రమ చెయ్యని వేళ ఆ టాప్ హీరోల తర్వాత హీరోగా గుర్తింపు పొందిన అందాల నటుడు, జానపద హీరో, నాటి యువతుల కలల రాకుమారుడు కాంతారావు.

తాడేపల్లి లక్ష్మీ కాంతారావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. కానీ కత్తి కాంతారావంటే తెలుగు నాట తెలియని వారుండరు. వెండి తెరపై జానపద కథా నాయకుడిగా టి. ఎల్. కాంతారావు వేసిన ముద్ర అలాంటిది. కత్తి పట్టిన జానపద వీరుడు అంటే ఇప్పటికీ కూడా మొదటగా గుర్తుకు వచ్చేది కాంతారావే.
విఠలాచార్య, కాంతా రావుల కలయిక అపూర్వం. ప్రేక్షకులకు గుర్తుండి పోయినప్పటికీ ఆయన పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో సైతం మంచి పాత్రల ద్వారా అరుదైన అభినయాన్ని చూపించారు. నారదుడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా కూడా నటించారు. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడిగా నటించిన కాంతా రావు, రాష్ట్రపతి అవార్డును కూడా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము 2000లో రఘుపతి వెంకయ్య అవార్డు ప్రదానం చేసి సత్కరించింది. ఆయన స్వీయ చరిత్ర "అనగనగా ఒక రాకుమారుడు".



తెలంగాణలోని నల్గొండ జిల్లా కోదాడ ప్రాంతంలో గుడిబండ గ్రామములో 1923లో ఒక కరణీకపు కుటుంబంలో పుట్టి, వంశపారంపర్య పట్వారీ వృత్తిమీద కన్నా ముఖానికి రంగువేసుకుని నటించటం మీద మక్కువ పెంచు కున్నాడు కాంతారావు. ఏడాది వయసులోనే తండ్రిని కోల్పోయారు. చదువుకునే రోజుల్లోనే నాటకాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆపై వెండితెరపైకి వచ్చి నటుడిగా, నిర్మాతగా కూడా మరపురాని సినిమాలను అందించారు. తెలుగు సినిమా రంగములో అనేక సాంఘిక, జానపద, పౌరాణిక పాత్రలు ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశాడు. హెచ్.ఎం. రెడ్డి తీసిన 'నిర్దోషి' (1951), 'ప్రతిజ్ఞ' (1953) మొదలుకుని 450కి పైగా సినిమాల్లో నటించారు. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన జానపద చిత్రాల్లో కథానాయ కుడిగా ధీరోదాత్తంగా నటించి పేరు సంపాదించారు. నిర్మాతగా 'సప్త స్వరాలు', 'గండర గండడు', 'ప్రేమ జీవులు', 'గుండెలు తీసిన మొనగాడు' సినిమాలు తీశారు.

రామారావు, నాగేశ్వరరావు లకు సమకాలికులుగా కొన్ని సందర్భాలలో వారితో సమానమైన గుర్తింపు పొందారు. దాసరి నారాయణరావు మాటల్లో "తెలుగు చలనచిత్ర సీమకు రామారావు నాగేశ్వరరావులు రెండు కళ్ళైతే , వాటి మధ్య తిలకం వంటివారు కాంతారావు.

ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 2000 లో రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరించింది. ఆయన మొత్తం 400 పైగా చిత్రాలలో నటించాడు. ఒక దశాబ్దంపాటు హీరోగా రెండవ హీరోగా ఎన్నెన్నో పాత్రలు పోషించారు. 'నారదుడి' పాత్రకు కాంతారావును తప్పించి మరెవరినీ ఊహించు కోలేనంతగా మెప్పించాడు. పౌరాణిక పాత్రలైన రాముడు, కృష్ణుడు పాత్ర ల్లోనూ ఎన్టీఆర్ తరువాత కాంతారావుగా గుర్తింపు జానపద హీరోగా కాంతారావుకు తిరుగులేదు.

కాంతారావు కుమారుడు రాజా, సుడిగుండాలు సినిమాలో నటించాడు. ఆ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకున్నాడు. యువ నటులు రావడం, జానపద చిత్రాలు తగ్గిన క్రమంలో, స్వయంగా సప్తస్వరాలు (1969); గండర గండడు (1969); ప్రేమ జీవులు (1971); గుండెలు తీసిన మొనగాడు (1974); స్వాతి చినుకులు (1989) తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు. సినీ ప్రొడక్షన్ లో ఏ మాత్రం అనుభవం లేని కాంతా రావు స్వయంగా సినిమాలు తీసిన సమయాన 1969 నాటికి తెలంగాణ రాష్ట్ర సాధన తొలిదశ ఉద్యమం సాగుతోంది. సినిమాలు ఆడే పరిస్థితి లేదు. 'సప్త స్వరాలు' 'గండర గండడు' వంటి సినిమాలు బాగున్నా ఆయన్ని ఆర్థికంగా ఆదుకోలేక పోయాయి. 'ప్రేమ జీవులు' సినిమా ఫ్లాప్. భారీ నష్టం. అయినా సినీ రంగంలోనే వెతుక్కోవాలని ఆ తర్వాత తీసిన మరో రెండు సినిమాలు కూడా లాభాలను చేతికి అందివ్వలేదు.

ఫైనాన్షియర్లకు వడ్డీలు కట్టటంతో సరిపోయింది. క్యారక్టర్ ఆర్టిస్ట్ గా కొత్త అవతారం ఎత్తాల్సి వచ్చింది. ఈ లోగా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్ కు తరలింది. పెరిగిన అప్పుల వల్ల చివరికి కట్టు కున్న ఇల్లును అమ్ముకుని, అప్పులు తీర్చి, ఒక చిన్న పెట్టెతో హైదరాబాద్ చేరారు.

చిరుపాత్రలు, టి.వి. సీరియళ్ళు చేశారు. నటుడిగా కాక, వ్యక్తిగతంగా చాలా ఇబ్బందులు పడ్డారు. ఏవయినా సభలకు పిలిస్తే ఇచ్చే డబ్బులు, సన్మానాలు చేసి ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి. ప్రభుత్వ పరంగా గుర్తింపు లేదు. అతికష్టం మీద ఇచ్చిన రఘుపతి వెంకయ్య అవార్డు తప్పించి మరేమీ లేదు. అన్నీ నిరాశలే. చిట్టచివరి వరకు సొంత ఇంటికల కంటూనేవున్నారు.

అడపాదడపా సినీ పెద్దలు ఎవరయినా సహాయం అందించినా అది ఇంటికి సరిపోయేంత కాదు. ఇల్లు గడవటానికి సరిపోయేంత మాత్రమే. చివరికి క్యాన్సర్ బారిన పడ్డారు. అదీ ఆలస్యంగా గుర్తింపు. ఏ దురలవాట్లూ లేక, ఎవరికీ హాని చేయని మనిషి ఒక్క సంవత్సరంలో శరీరాన్ని తినేసిన క్యాన్సర్ దెబ్బకు మరణించారు.

సినీరంగానికి వెలుపల స్నేహితులు ఉన్న వాడు కాదు కాంతారావు. తాను పుట్టి పెరిగిన సముద్రమే చేపను ఎత్తి అవతల వేస్తే అది ఎలా విలవిలా కొట్టుకుంటుందో, అలా సినీరంగమనే సముద్రపు ఆటు పోట్లకు బలైన రాకుమారుడు కాంతారావు. ప్రేక్షకుల మనసులో చెరగిపోని ముద్ర వేసిన కాంతారావు, తన 85వ ఏట, 2009 మార్చి 22క్యాన్సర్ వ్యాధి మూలంగా హైదరాబాద్‌లో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు.. ప్రజాస్వామ్యానికి చీకట్లు!
జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా..

ప్రజాస్వామ్యంలో పత్రికలు ప్రజల గొంతుకలుగా ఉండాలి. అధికారాన్ని ప్రశ్నించే అక్షరాలుగా నిలవాలి. అవినీతిని వెలికితీసే ఆయుధాలుగా, ప్రజా సమస్యలను పాలకుల ముందుంచే వేదికలుగా పనిచేయాలి. కానీ నేడు భారత పత్రికా రంగంలో కనిపిస్తున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని పత్రికలు రాజకీయ పార్టీల కరపత్రాలుగా మారుతున్నాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఏ పత్రిక నిజం చెబుతోంది? ఏది రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాన్ని ప్రచారం చేస్తోంది? ఏది ప్రజల సమస్యలను రాస్తోంది? ఏది అధికారానికి అనుకూలంగా వార్తలను వక్రీకరిస్తోంది? అన్నది సాధారణ పాఠకుడు తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. పత్రికను తెరిస్తే వార్త కనిపించాలి.. కానీ ఇప్పుడు కొన్ని చోట్ల పార్టీ ప్రచారం కనిపిస్తోంది. ప్రజల కోసం నడవాల్సిన కలం.. రాజకీయ విధేయతకు బందీ అవుతున్నదా? ఇదే జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా దేశం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన ప్రశ్న.

నవంబర్ 16 జాతీయ పత్రికా దినోత్సవం. 1966 నవంబర్ 16న భారత ప్రెస్ కౌన్సిల్ పనిచేయడం ప్రారంభించిన సందర్భంగా ఈ రోజును నిర్వహిస్తున్నారు. స్వేచ్ఛాయుత, బాధ్యతాయుత పత్రికా వ్యవస్థకు ప్రతీకగా ఈ రోజు నిలుస్తుంది. పత్రికా స్వేచ్ఛను కాపాడటం, జర్నలిజంలో నైతిక ప్రమాణాలను నిలబెట్టడం ప్రెస్ కౌన్సిల్ లక్ష్యం. అయితే పత్రికా స్వేచ్ఛను స్మరించుకునే ఈ రోజున, ఆ స్వేచ్ఛ నిజంగా ఎంతవరకు సజీవంగా ఉందన్న ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

పత్రికలు పార్టీల కరపత్రాలుగా మారితే.. ప్రజలకు నిజం ఎవరు చెబుతారు?

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు తమ విధానాలను ప్రచారం చేసుకోవడానికి పత్రికలు, ప్రకటనలు, ప్రచార వేదికలను ఉపయోగించుకోవచ్చు. అది వారి హక్కు. కానీ వార్తాపత్రిక ఒక రాజకీయ పార్టీ ప్రచార పత్రంగా మారడం మాత్రం జర్నలిజం ధర్మానికి విరుద్ధం. ఒక పార్టీ అధికారంలో ఉంటే దాని విజయాలను అతిశయంగా ప్రచారం చేస్తూ, వైఫల్యాలను దాచిపెట్టడం.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదే పార్టీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, తమకు అనుకూలమైన రాజకీయ శక్తి అధికారంలోకి వచ్చిన తర్వాత మౌనం వహించడం.. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలు పత్రికల విశ్వసనీయతను దెబ్బతీస్తాయి.

కొన్ని రాజకీయ శక్తులు తమకు అనుకూలమైన వార్తా వేదికలను ఏర్పాటు చేసుకుంటున్నాయన్న విమర్శ ఉంది. మరికొన్ని మీడియా సంస్థలు రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కారణంగా ప్రభుత్వాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఒక పత్రికలో ఒకే ఘటనను ప్రజా సమస్యగా చూపిస్తే, మరో పత్రికలో అదే ఘటనను ప్రభుత్వ విజయంగా చిత్రీకరిస్తుంది. ఇంకొకటి దానిని పూర్తిగా విస్మరిస్తుంది. ఒకే వాస్తవానికి భిన్నమైన రాజకీయ రంగులు అద్దినప్పుడు పాఠకుడికి వార్తపై నమ్మకం ఎలా కలుగుతుంది?

పత్రికలు పార్టీ కార్యాలయాల నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా వార్తలు రాస్తే, సంపాదకీయ నిర్ణయాలు రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్తే, జర్నలిస్టుల స్వతంత్ర ఆలోచనకు చోటు లేకపోతే.. అది జర్నలిజం కాదు. రాజకీయ ప్రచారానికి వార్తా ముసుగు తొడిగినట్లే. పాఠకుడు పత్రిక కొనుగోలు చేసేది పార్టీ ప్రచారం కోసం కాదు.. వాస్తవాలు తెలుసుకోవడానికి.

నిజం--అబద్ధం మధ్య గీత చెరిగిపోతోంది!

ఒకప్పుడు పత్రికల మధ్య పోటీ అంటే ఎవరు ముందుగా వార్త అందిస్తారు? ఎవరు లోతైన పరిశోధన చేస్తారు? ఎవరు ప్రజా సమస్యను సమగ్రంగా విశ్లేషిస్తారు? అన్నదానిపై ఉండేది. ఇప్పుడు కొన్ని సందర్భాల్లో పోటీ రాజకీయ అనుకూలతల చుట్టూ తిరుగుతున్నదన్న విమర్శ ఉంది. ఒక పార్టీ నాయకుడి వ్యాఖ్యను పెద్ద వార్తగా ప్రచురించే పత్రిక, మరో పార్టీ నాయకుడి వ్యాఖ్యను చిన్న వార్తగా చూపిస్తుంది. ప్రభుత్వ వైఫల్యంపై కథనం రాసే మీడియా సంస్థపై రాజకీయ ఒత్తిళ్లు వస్తే, ఆ కథనం ప్రచురణకు ముందే ఆగిపోతుంది. ప్రజా ప్రయోజనానికి సంబంధించిన వార్తను యజమాని లేదా ప్రకటనదారుడి ప్రయోజనం కోసం పక్కన పెట్టే పరిస్థితి ఏర్పడితే, అది ప్రజల సమాచార హక్కుపై దాడి.

ఈ ధోరణి పాఠకుడిని అయోమయానికి గురిచేస్తుంది. వార్తలపై విశ్వాసం తగ్గుతుంది. చివరకు ప్రజలు అన్ని పత్రికలను అనుమానంతో చూడడం ప్రారంభిస్తారు. నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులపై కూడా అపనమ్మకం పెరుగుతుంది. తప్పుడు వార్తలు, వక్రీకరణలు, పెయిడ్ న్యూస్, నిర్ధారణలేని ఆరోపణలు ప్రజాస్వామ్య చర్చను విషపూరితం చేస్తాయి. పత్రికలపై ప్రజల నమ్మకం కోల్పోవడం మీడియా రంగానికే కాదు.. ప్రజాస్వామ్యానికి కూడా ప్రమాదకరం.

ప్రభుత్వాల ప్రకటనల గుప్పిట్లో సంపాదకీయ స్వేచ్ఛ!

పత్రికా స్వేచ్ఛను బలహీనపరిచే మరో ముఖ్యమైన అంశం ఆర్థిక ఆధారపడటం. అనేక పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటాయి. ప్రకటనల కేటాయింపులో వివక్ష, ప్రకటనల నిలిపివేత, ఆర్థిక ఒత్తిళ్లు సంపాదకీయ నిర్ణయాలను ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. చిన్న, ప్రాంతీయ పత్రికలు ఈ ఒత్తిడిని మరింత తీవ్రంగా ఎదుర్కొంటాయి.

ప్రభుత్వానికి అనుకూలంగా రాస్తే ప్రకటనలు.. విమర్శిస్తే ఆర్థిక ఇబ్బందులు అనే పరిస్థితి ఏర్పడితే, పత్రికా స్వేచ్ఛ కాగితంపై మాత్రమే మిగిలిపోతుంది. ప్రభుత్వ ప్రకటనలు ప్రజలకు పథకాల సమాచారం అందించడానికి ఉపయోగపడాలి. కానీ అవి మీడియాను నియంత్రించే సాధనాలుగా మారకూడదు. ప్రకటనల కేటాయింపు పారదర్శకంగా, సమాన ప్రమాణాలతో జరగాలి.

మీడియా యాజమాన్యం కొద్దిమంది సంపన్నులు, కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కావడం కూడా ఆందోళనకరం. ఒకే యాజమాన్యానికి అనేక మీడియా సంస్థలు ఉండి, వాటికి రాజకీయ లేదా వ్యాపార ప్రయోజనాలు ముడిపడితే వార్తల వైవిధ్యం దెబ్బతినవచ్చు. వార్తల ఎంపికలో సంపాదకీయ బృందం కంటే యాజమాన్య ప్రయోజనాలు ప్రాధాన్యం పొందే ప్రమాదం ఉంటుంది.

భారత మీడియా యాజమాన్య కేంద్రీకరణ, రాజకీయ అనుబంధాలు, పెయిడ్ న్యూస్, స్వీయ సెన్సార్‌షిప్ వంటి అంశాలపై =ూఖీ, =వబ్‌వతీం ×అర్‌ఱ్‌బ్‌వ,ం=ూ× తదితర సంస్థలు ఆందోళనలు వ్యక్తం చేశాయి. ం=ూ× మీడియా యాజమాన్యంపై చేసిన అధ్యయనాల్లో వాణిజ్యీకరణ, యాజమాన్య కేంద్రీకరణ సంపాదకీయ స్వాతంత్ర్యాన్ని ప్రభావితం చేయగలవని ప్రస్తావించింది.

నిజం రాసిన జర్నలిస్టుకు కేసులా? నిర్బంధాలా?

ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు దాడులు, బెదిరింపులు, అరెస్టులు, నిర్బంధాలను ఎదుర్కొంటున్న ఘటనలు దేశంలో నమోదవుతున్నాయి. 2026 అక్టోబర్‌లో ఎన్నికల సంఘం ప్రధాన అధికారిపై నిరసనలను కవర్ చేస్తున్న సమయంలో ఢిల్లీ, అహ్మదాబాద్, పుణె నగరాల్లో కనీసం 43 మంది జర్నలిస్టులను తాత్కాలికంగా నిర్బంధించినట్లు కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (జూజీ) నివేదించింది. కొందరిపై దాడులు జరిగాయని, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని, చిత్రీకరణకు అడ్డంకులు కల్పించారని ఆ సంస్థ పేర్కొంది.

జర్నలిస్టులపై కేసులు నమోదు చేసే ప్రతి సందర్భంలో చట్టపరమైన ప్రక్రియను గౌరవించాలి. నేరం నిరూపించకముందే దీర్ఘకాల నిర్బంధం శిక్షగా మారకూడదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకు, అవినీతి ఆరోపణలను వెలుగులోకి తెచ్చినందుకు, ప్రజా నిరసనలను కవర్ చేసినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉంటే వాటిపై స్వతంత్ర విచారణ జరగాలి. అధికారుల చర్యలకు పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి.

పత్రికలు ప్రజల పక్షాన నిలవాలి.. పార్టీల పక్షాన కాదు!

పత్రికా స్వేచ్ఛను కాపాడటానికి ప్రభుత్వాలే కాదు, రాజకీయ పార్టీలు, మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టు సంఘాలు, పౌర సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వ ప్రకటనల కేటాయింపులో పారదర్శకత ఉండాలి. మీడియా యాజమాన్యాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. జర్నలిస్టుల భద్రతకు చట్టపరమైన రక్షణలు, దాడులపై వేగవంతమైన విచారణ, అక్రమ నిర్బంధాలపై న్యాయ పర్యవేక్షణ అవసరం. సంపాదకీయ స్వాతంత్ర్యాన్ని కాపాడే అంతర్గత వ్యవస్థలు ప్రతి మీడియా సంస్థలో ఉండాలి.

రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా వార్తలు రాయలేదని పత్రికలను శత్రువులుగా చూడకూడదు. తమకు అనుకూలంగా రాస్తున్నాయనే కారణంతో మీడియాను ప్రజాస్వామ్యానికి అద్దంగా ప్రకటించకూడదు. ఒక పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విమర్శలను సహించాలి; ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పత్రికా స్వేచ్ఛను సమర్థించాలి. ఈ ద్వంద్వ ప్రమాణాలు మారాలి.

పత్రికలు ప్రభుత్వాలకు అమ్ముడుపోవడం, రాజకీయ పార్టీల కరపత్రాలుగా మారడం, అవినీతిని ప్రశ్నించే ధైర్యాన్ని కోల్పోవడం.. ఇవన్నీ ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతాలు. పత్రికలు ప్రజల సమస్యలను రాయాలి. ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలి. ఆక్రమణలు, అవినీతి, అక్రమాలను వెలికితీయాలి. అధికారాన్ని ప్రశ్నించాలి. ప్రజలకు నిజాన్ని అందించాలి. అదే జర్నలిజం అసలు ధర్మం.

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా దేశం ముందున్న అసలు ప్రశ్న ఇదే. పత్రికలు ప్రజల కోసం ఉండాలి.. పార్టీల కోసం కాదు. జర్నలిస్టుల కలం అధికారానికి భయపడకూడదు. పాఠకుడి నమ్మకాన్ని మోసం చేయకూడదు. నిజం రాసే ధైర్యం, తప్పును ప్రశ్నించే నిబద్ధత, ప్రజల పక్షాన నిలిచే సంకల్పం.. ఇవే పత్రికా స్వేచ్ఛకు నిజమైన పునాదులు.

పత్రికలు ప్రజాస్వామ్యానికి కాపలాదారులుగా నిలవాలి.. రాజకీయ పార్టీల కరపత్రాలుగా కాదు. కలం అమ్ముడుపోతే వార్త చనిపోతుంది. వార్త చనిపోతే ప్రజాస్వామ్యం అంధకారంలోకి జారిపోతుంది.



(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్, సెల్: 9010128884)

తెలంగాణ
పిల్లలం!

మేం మా తెలంగాణ పిల్లలం
మా తెలుగు వెలుగు మల్లెలం
తెలుగునాట పుట్టిన వారలం
వెలుగు తోట పెట్టిన పోరలం !

మా పిల్లల పండుగ బొడ్డెమ్మ
మా పెద్దల పండుగ బతుకమ్మ
ఈ రెండు పండుగలు జరిపిస్తాం
మేం అందరినీ ఇక మురిపిస్తాం!

మా ఇంటి ముందు పందిరి వేస్తాం
పుట్టమన్నుతో బొడ్డెమ్మను చేస్తాం
కలిసిమెలిసి మేం ఆమెను పూజిస్తాం
ఇలా వెలసిన ఆ తల్లిని ఇక ప్రేమిస్తాం!

తంగేడు పూల బాసల గుసగుసలు
కలువ పూల కాంతుల మిసమిసలు
తెలుసుకొని మేం సేకరించిన వారలం
కలుసుకొని సహకరించిన పోరలం !

మా బాల బాలికల ఓ బతుకమ్మా
నువ్వు బయలుదేరి ఇక రావమ్మా
నీ రాక కోసం మై మేమంతా చూస్తున్నాం
మీ పూజ కోసమై సర్వం సిద్ధం
చేస్తున్నాం!

నీవు మహా శక్తి స్వరూపిణివి
ఓ మా బంగారు బతుకమ్మా
మాకు ముక్తి ప్రసాదించవమ్మా
మాకు శక్తి నొసంగేది నీవేనమ్మ !



-గుర్రాల లక్ష్మారెడ్డి, సహస్ర కవి,
రచయిత-9491387977.
కల్వకుర్తి నాగర్ కర్నూల్ జిల్లా.

ఆణిముత్యాల మణిపూసలు

మాటల్లో మంచితనం
అది మనకు మూలధనం
అని మీరు తెలుసుకోండి
వెంటనే ఆ వైనం !

గురువుగారిని పూజించు
చదువుల కోసం అర్థించు
చదువు విలువను తెలుసుకో
చదువులమ్మ ను ప్రార్థించు !

మనిషి జీవితం దివ్యం
అది ఓ మహా కావ్యం
శ్రావ్యంగా పఠించుమ
నేడు జీవితం ద్రవ్యం !

తేజస్విని లక్ష్మీ సుత
సీతమ్మ అగ్నిపునీత
మరి వీరు పతివ్రతలు
వీరితోడు తులసి మాత !

ఆకాశంలో చుక్కలు
మెరిసెనులే ఇక దిక్కులు
అద్భుతమేగా దృశ్యం
తొలగిపోయే గా మబ్బులు !

అందరినీ ప్రేమించు
అంతటనూ విహరించు
దేహం దేవాలయం
గమనించి సంచరించు !

మనకు మొదటి గురువు తల్లి
తెలుసుకో నీవిక చెల్లి
కనిపించే మన దేవత
తెలిసిందా చిట్టి తల్లి !

పై నక్షత్రకాంతులు
మెరిసే మిణుగురులు
తళతళ మెరుస్తున్నవి
మిన్నుకు మణిహారాలు !

మెతుకు కరువైపోయింది
బతుకు బరువై పోయింది
వినాశ కాలం వచ్చేను
చేతికి చిప్పే మిగిలింది !

భగవంతుడు ప్రేమిస్తడు
కాని తను ద్వేషించడు
దేవుడిని నమ్ముకున్న
తను తప్పక కరుణిస్తడు !

దుఃఖానికి దూరమును
సుఖానికి చేరువను
ఎపుడూ కోరుకొనరాదు
భరించు వాటి భారమును !

సరిగమల ప్రభావితం
గీతం మన సంగీతం
గమనించి అభ్యసించు
నీగళ గానామృతం !



ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

కరీంనగర్, నవంబర్15(సింగిడి)

బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమావత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో బిర్సా ముండా జయంతి, జాతీయ గిరిజన గౌరవ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథి సాయిని మల్లేశం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిని మల్లేశం మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన జయంతిని జాతీయ గిరిజన గౌరవ దినోత్సవంగా ప్రకటించడం గిరిజనులకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయాలని ఎస్టీ మోర్చా నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొట్టే మురళీకృష్ణ, బోయిన పల్లి ప్రవీణ్ రావు, గాజుల స్వప్న, కార్పొరేటర్ బండ రమణ, జాడి బాల్ రెడ్డి, మొగిలి శ్రీనివాస్, లావుడియా తిరుపతి నాయక్, బానోత్ శివ నాయక్, మాలోతు దీక్షిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 15, (సింగిడి):



ఈనెల 19న సిద్దిపేట కు సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తుండడంతో చిన్న గుండవెల్లి వెళ్లే మార్గంలో ఏర్పాటుచేసిన సభ ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం సూచించారు. సభ నిర్వహించే స్థలాన్ని ఆర్డీవో సదానందం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎమ్మార్వో హరికిరణ్, లతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు పద్యానికి ప్రత్యేక గుర్తింపు

రెండు పుస్తకాలను ఆవిష్కరించిన ప్రముఖ పద్యకవి నలవోలు నరసింహారెడ్డి



కరీంనగర్, నవంబర్15(సింగిడి)

పద్యం తెలుగువారికి ప్రత్యేక గౌరవాన్ని, గుర్తింపును తెస్తుందని ప్రముఖ పద్యకవి డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి అన్నారు. భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో నిర్వహించిన సాహిత్య సభలో సింగిరెడ్డి రాజిరెడ్డి రచించిన 'నీలకంఠ శతకం', రేగుల చంద్రయ్య రచించిన 'రేగుపూల పరిమళాలు' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పద్యాలు సమాజ హితం, నీతి విలువలను ప్రతిబింబించాలని ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాల్లో అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు మాతృభాషలో జరగకపోవడం బాధాకరమన్నారు. వక్తలు రెండు పుస్తకాలు సామాజిక విలువలు, సానుకూల ఆలోచనలను ప్రబోధించేలా ఉన్నాయని ప్రశంసించారు.కార్యక్రమంలో తిప్పారపు లక్ష్మీనర్సయ్యాచారి, వేములవాడ ద్రోణాచారి, సామల కిరణ్, కె.ఎస్. అనంతాచార్య, వైరాగ్యం ప్రభాకర్‌తో పాటు పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కరీంనగర్, నవంబర్15(సింగిడి)

బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని లారీ అసోసియేషన్ సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై కరీంనగర్ రూరల్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.15,730 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.పేకాట, ఇతర జూద కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే చరిత్ర పత్రాలు తెరుస్తామని హెచ్చరించారు. జూదం జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.



నేటి నుంచి దివ్యాంగులు..వృద్ధులకు ఉపకరణాలు పంపిణీ

నియోజకవర్గంలో 8 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు
80 శాతం వైకల్యం ఉన్నవారికి ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు పంపిణీ : మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 15, (సింగిడి):

హుస్నాబాద్: దివ్యాంగులు, వయోవృద్ధులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అర్హులైన వారికి ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు సోమవారం నుంచి హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. నవంబర్ 16 నుంచి 27వ తేదీ వరకు ఏడు మండలాలు, హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఈ శిబిరాలు జరగనున్నాయి. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వం ఏడిఐపి పథకం కింద అలీంకో సంస్థ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.శిబిరాల్లో అర్హులకు మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు, వాకింగ్ స్టిక్స్, కళ్లద్దాలు, నడకకు ఉపయోగపడే పరికరాలను ఉచితంగా అందించనున్నారు. 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారికి ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా ఆత్మవిశ్వాసంతో జీవించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమని మంత్రి తెలిపారు. శిబిరాల వివరాలు నవంబర్ 16న సైదాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో, 17న ఎల్కతుర్తిలోని ఎస్.ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో, 18న అక్కన్నపేటలో, 20న కోహెడలోని లక్ష్మీ గార్డెన్‌లో, 21న చిగురుమామిడిలోని చిన్న ముల్కనూరు మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో శిబిరాలు నిర్వహించనున్నారు. నవంబర్ 25న హుస్నాబాద్ రూరల్, టౌన్, 26, 27న భీమదేవరపల్లి మండలాల్లో శిబిరాలు జరగనున్నాయని మంత్రి తెలిపారు.



భీమదేవరపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్నారు. అన్ని శిబిరాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమైతాయని అర్హులను గుర్తించాలిగ్రామాల్లోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు శిబిరాల సమాచారం చేరవేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు, సర్పంచులు, ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. అర్హులెవరూ ప్రభుత్వ సాయం అందకుండా మిగిలిపోకూడదని, ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.

ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా!

నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభం
జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 15 సింగిడి

కామారెడ్డి: కుటుంబంలో అనుకోని విషాదం చోటుచేసుకున్నప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు అండగా నిలిచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం' ప్రారంభించేందుకు సిద్ధమైంది. 2026 నవంబర్ 19 నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ



అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తెలిపారు.ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తి లేదా కుటుంబ సభ్యుడి మరణంతో ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా భద్రత కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు. గ్రామగ్రామాన పథకంపై అవగాహన కల్పించాలి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రయోజనాలను కామారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి మండలానికి తీసుకెళ్లాలని ఏలే మల్లికార్జున్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పథకం లక్ష్యాలు, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం వివరాలు చేరేలా కృషి చేయాలని తెలిపారు.ప్రజలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

నిరుపేదల సొంతింటి కలకు హాజీ నాయక్ అండ!

రామలక్ష్మణపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చిన డాక్టర్గాంధారి మండలంలో ఎక్కడైనా పేదలుంటే ఇళ్లు నిర్మించేందుకు సిద్ధం

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 15 (సింగిడి)

గాంధారి: నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఓ డాక్టర్ మానవతా దృక్పథంతో ముందుకు రావడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి తోడుగా నిలుస్తూ, పేదల ఇళ్ల నిర్మాణ బాధ్యతను తీసుకునేందుకు హాజీ నాయక్ ముందుకు వచ్చారు.కామారెడ్డి జిల్లా గాంధారి మండలం రామలక్ష్మణపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో, ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని హాజీ నాయక్ నిర్ణయించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద విడతలవారీగా అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని వినియోగించుకుంటూ, లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో పూర్తి సహకారం అందిస్తానని ఆయన ముందుకొచ్చారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రభుత్వ సాయం అందినా ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేని నిరుపేద కుటుంబాలకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తోంది. హాజీ



నాయక్ ముందుకొచ్చిన తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించేందుకు ఆసక్తి చూపుతున్నారు.గాంధారి మండలంలోని పేదలకూ భరోసాతో సందర్భంగా హాజీ నాయక్ మాట్లాడుతూ.. కేవలం రామలక్ష్మణపల్లి గ్రామానికే పరిమితం కాకుండా గాంధారి మండలంలోని ఏ గ్రామంలోనైనా నిజమైన నిరుపేద కుటుంబాలు ఉండి, ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకం ద్వారా వచ్చే నిధులను విడతలవారీగా వినియోగించుకుంటూ ఇళ్ల నిర్మాణానికి సహకరిస్తానని వెల్లడించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సామాజిక బాధ్యత తోడైతే మరింత మంది పేదల జీవితాల్లో మార్పు తీసుకురావచ్చనే అభిప్రాయం గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది. నిరుపేదల సొంతింటి కలకు అండగా నిలుస్తున్న ఈ ప్రయత్నం గాంధారి మండలంలో మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.సొంతిల్లు అనేది ప్రతి పేద కుటుంబం కల.. ఆ కల నెరవేర్చేందుకు చేయూత అందించడం నిజమైన మానవత్వం ఈరోజు రామలక్షణపల్లి గ్రామంలో ఇందిరమ్మ ముగ్గు వేయడం జరిగింది ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ అనిల్ నాయక్ ఉపసర్పంచ్ కృష్ణమూర్తి గ్రామ సెక్రెటరీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్ గ్రామ కమిటీ నాయకులు హాజీ నాయక్ గ్రామ పార్టీ సీనియర్ నాయకులు గొల్ల రాజు లాండే సతీష్ వడ్డే పోశయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు భూమిపూజ

పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 15 (సింగిడి)

సిరిసిల్ల పట్టణం 31వ వార్డులో చేపట్టనున్న సీసీ మురికి నీటి కాలువ మోరీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి భూమిపూజ కార్యక్రమం నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. 31 వ వార్డులో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా ఈ మురికి నీటి కాలువ సమస్యను కౌన్సిలర్ పాశికంటి రమ్య సత్యనారాయణ మా దృష్టికి తీసుకురాగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తు మూడు లక్షల రూపాయల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో ఈ పక్క సీసీ మురికినీటి కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు..ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పాలకవర్గ



సభ్యుల అందరితో చర్చిస్తూ సిరిసిల్ల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు..అదేవిధంగా ఇట్టి మురికినీటి కాలువ నిర్మాణ పనులను మంచి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్ కు ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు పాశికంటి రమ్య సత్యనారాయణ, దొంతునేని కళ్యాణి అశోక్ రావు , గుండ్లపల్లి నీరజ పూర్ణ చందర్, ఎలుక వెంకటేశం , అడిచెర్ల రూప సాయి కృష్ణ , గెంట్యాల శ్యామల శ్రీనివాస్ , కొండ వర్షిని నరేష్ , బత్తుల రమేష్ , మున్సిపల్ అధికారులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు బింగి ఇజ్జగిరి, పాశికంటి లవన్ కుమార్, కమలాకర్ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం



వేములవాడ, నవంబర్ 15 (సింగిడి) జిల్లాలో వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, ఐదవ రోజు వేడుకలను ఆలయ ఈవో ఎల్. రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.నవంబర్ పదవ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు మరియు శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.ఈ వేడుకల్లో ఆలయ ఏఈఓ ఏఈఓ జయకుమారి, పర్యవేక్షకులు ఓన్నారం భాస్కర్ , అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





రాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 25,001 విరాళం



వేములవాడ, నవంబర్ 15 (సింగిడి)
జిల్లాలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ అభివృద్ధి మరియు విస్తరణ పనుల కోసం మల్లారం గ్రామానికి చెందిన వెంకటేష్. రూ. 25,001ఇరవై ఐదు వేల ఒక్క రూపాయి విరాళంగా అందజేశారు.తనకు కొత్తగా ఉద్యోగం రావడంతో, స్వామివారి కృపకు కృతజ్ఞతగా ఆయన ఈ విరాళాన్ని సమర్పించారు. ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో ఆలయ పి.ఆర్.ఓ పెరిక శ్రీనివాస్. ఈ విరాళం మొత్తాన్ని అందజేశారు.అనంతరం దాత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి, శాలువాతో సత్కరించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే జాజాల ఆర్థిక సహాయం

కామారెడ్డి నవంబర్ 15 (సింగిడి ప్రతినిధి):



కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గాంధారి మండలం చద్మల్ తాండకు చెందిన రాయిదాస్ మంగళ్లు (తండ్రి కన్నా) ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోవడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు.అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోవడంతో కుటుంబం తీవ్ర నష్టానికి గురైందని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన పంతుగా తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అంతే కాకుండా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కష్టకాలంలో అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, తాండవాసులు పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రూ. 1,00,116 విరాళం

వేములవాడ, నవంబర్ 15 (సింగిడి)



జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి మరియు విస్తరణ పనుల నిమిత్తం దేవరాజ్, ఉమా బాలచందర్ దంపతులు లక్షా నూట పదహారు రూపాయల (1,00,116) విరాళాన్ని అందజేశారు. యూఎస్ఏ లో ఉంటున్న తమ మనుమడు అవ్వాన్ అన్నప్రాసన వేడుక సందర్భంగా వారు ఈ విరాళాన్ని అందజేయాలని సంకల్పించారు. ఆలయ ఈవో రమాదేవి వారు చెక్కు రూపంలో విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆ దంపతులకు శేషవస్త్రం అందజేసి, స్వామివారి లడ్డు ప్రసాదాన్ని బహూకరించారు.



భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈవో, డిఈఓ

వేములవాడ, నవంబర్ 15(సింగిడి)

జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఆలయ కార్యనిర్వహణాధికారి ఈవో రమాదేవి, ఉప కార్యనిర్వహణాధికారి డిఈఓ ప్రతాప్ నవీన్ కుమార్ ఆలయ ప్రాంగణంలో విస్తృతంగా పర్యటిస్తూ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.ఆలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన వారు క్యూ లైన్ల నిర్వహణ, పారిశుభ్రత పనులు, త్రాగునీటి వసతి వంటి మౌలిక సదుపాయాలపై అధికారులకు తగు సూచనలు చేశారు.అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులతో పాటు వేములవాడ పట్టణ ప్రజలతో వారు నేరుగా మాట్లాడి, దర్శన ఏర్పాట్లపై అభిప్రాయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.భక్తులకు శీఘ్రంగా, ప్రశాంతంగా స్వామివారి దర్శనం కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు ఆదేశించారు.



ఉన్నత ఉద్యోగాలు సాధించాలి



సిద్దిపేట, నవంబర్ 15(సింగిడి)

గ్రంధాలయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత ఉద్యోగాలను సాధించాలని పాఠకులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దారిపల్లి చంద్రం సూచించారు 59వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన పాటకులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దరిపల్లి చంద్రం మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు పాఠకులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువుకోవాలన్నారు సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారే ఉన్నత ఉద్యోగాలను సాధించగలుగుతారన్నారు.

సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రథమ వార్షికోత్సవం

సిద్దిపేట, నవంబర్ 15(సింగిడి)



సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం స్థానిక పట్టణ ఆర్యవైశ్య సంఘ భవనంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అధ్యక్షులు నేతి కైలాసం , ప్రధాన కార్యదర్శి తిప్పరాజు మధుసూదన్ , కోశాధికారి చందా సురేష్ , ఉపాధ్యక్షులు మొరంశెట్టి సంతోష్ కుమార్, అంబటి పల్లి భాస్కర్ , బెజగామా రాములు , కాసనగొట్టు రవీందర్ , పోకల రాజేశం, సహాయ కార్యదర్శులు కూర శ్రీనివాస్, గందె సంతోష్ కుమార్, మంచాల దుర్గాప్రసాద్, నాగమల్ల కిషన్ , బచ్చు నాగేందర్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై ఇంపాక్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

వైరా, నవంబర్ 15 :

వైరా మండల పరిధిలోని గన్నవరం ప్రైమరీ ప్రధానోపాధ్యాయిని పి.లత ఆధ్వర్యంలో ఇంపాక్ట్ సంస్థ ద్వారా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలు, వ్యక్తిగత అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అవగాహన, తల్లిదండ్రుల బాధ్యతలు, పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.అలాగే పిల్లల అభ్యాసనా స్థాయిని మెరుగుపరచడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన విద్యార్థులను గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించడం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమానికి వైరా మండల ఎం ఈ ఓ చావా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధులు ఎం.డి.నవాబ్ పాషా, వి. డి.ఎస్. ప్రసాద్, బీ. కర్ణ, గన్నవరం ఉపాధ్యాయులు, ఎస్ ఎం సి చైర్మన్, పాఠశాల కమిటీ సభ్యులు, జడ్పీహెచ్ఎస్ఉపాధ్యాయులు,పి.ఎస్.ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరికొండలో 72 మందికి నూతన 'చేయూత' పింఛన్ల మంజూరు

ఆమనగల్లు, నవంబర్ 15:

ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన 'చేయూత' పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కడ్తాల మండలం సరికొండ గ్రామానికి చెందిన 72 మంది అర్హులకు నూతన పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా దాదాపు 50 మంది గీత కార్మికులతో పాటు ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులకు కల్యకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చేతుల మీదుగా పింఛన్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి సరికొండ గ్రామ సర్పంచ్ అద్దాల మహేందర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అద్దాల రాములు గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు రైతు వెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు. వీరితో పాటు నాయకులు గౌని లక్ష్మయ్య, ఉడతల రాములు, మహేష్, మహేందర్, రాఘవేందర్, జయ, హరి, జంగయ్య, వెంకటయ్య, పింఛన్ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

51 శాతం ఫిట్మెంట్ ప్రకటించి పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి

సిద్దిపేట, నవంబర్ 15(సింగిడి)







తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు చిట్యాల విజేందర్ రెడ్డి గారి అధ్యక్షతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరా నగర్ లో నిర్వహించడం జరిగింది. ఇట్టి జనరల్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథులు మరియు ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నె బోయిన తిరుపతి గారు పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడిపల్లి తిరుపతి రెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గారు మరియు రాష్ట్ర కార్యదర్శి దామెర రాజయ్య రాష్ట్ర కార్యదర్శి గార్లు హాజరు కావడం జరిగింది ఈ సందర్భంగా నన్నె బోయిన తిరుపతి మాట్లాడుతూ పిఆర్సి కమిషన్ వేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పి అర్ సి నివేదికను తెప్పించుకొని ఫిట్మెంట్ ప్రకటించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, 2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడి పల్లి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల మరియు డిప్యూటీ డిఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,రేషనలైజేషన్ జీవో నంబర్ 25 ను వెంటనే సవరించి,తరగతి ఒక ఉపాధ్యాయున్ని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కార్యదర్శి దామెర రాజయ్య మాట్లాడుతూ వేసవి సెలవులలో ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లు నిర్వహించాలని, పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల వివిధ రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని, పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించి రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.అనంతరం జిల్లా నూతన కమిటిని ఎన్నుకున్నారు.ఇట్టి సమావేశం లో ఉపాధ్యాయ దర్శిని పత్రికా సంపాదకులు కనకయ్య, పూర్వ ప్రధాన సంపాదకులు ప్రకాష్ రావు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా నూతన కమిటి

అధ్యక్షులు: ఏ. నర్సింహా రెడ్డి ఉపాధ్యక్షులు 1) ఆర్.మల్లేశం2)పి పాపిరెడ్డి3 పి. సత్య కృష్ణ4)యం. సుశీల5) పి. శ్రీనివాస్ గౌడ్6)పి. శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి: ఎస్. నరేందర్ కార్యదర్శులు 1)జి. శివాజి2)పి. కొండల్ రెడ్డి3)డి. నర్సింలు గౌడ్4)ఏ. శ్రీలత5)బి. మహేందర్ 6) ఇ. నర్సింలు రాష్ట్ర కౌన్సిలర్లు 1)జి. తిరుపతి రెడ్డి2)సి హెచ్. విజేందర్ రెడ్డి3) యం.డి.జమీర్ మోహియొద్దీన్4)కే.గంగా భవాని5) కే. రామ్ రెడ్డి6) ఏ. సత్య నారాయణ7)ఏ. విద్యారాణి

నేటి నుంచి ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీకి ప్రత్యేక శిబిరాలు



సిద్దిపేట, నవంబర్ 15(సింగిడి)

హుస్నాబాద్ మున్సిపాలిటీ, మండలాలలో ప్రత్యేక శిబిరాలుఅర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయ ఉపకరణాలు అందించడమే లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నవంబర్ 16 నుంచి 27వ తేదీ వరకు నియోజకవర్గంలోని 7 మండలాలు ,ఒక మున్సిపాలిటీ ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ ఒక్క దివ్యాంగుడు, వృద్ధుడు కూడా సహాయం అందక ఇబ్బంది పడకూడదని, ఏ ఒక్క అర్హుడికీ ప్రభుత్వ సహాయం అందకుండా పోకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని దివ్యాంగుల సాధికారత విభాగం ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేకంగా నిర్వహించబడుతోంది.ఈ శిబిరాల ద్వారా అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధులకు మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు, వాకింగ్ స్టిక్స్, కళ్లద్దాలు, నడక సహాయక పరికరాలు తదితర ఉపకరణాలను ఉచితంగా అందించనున్నారు. అదేవిధంగా 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న అర్హులైన దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

శిబిరాల తేదీలు, సమయాలు, ప్రదేశాల వివరాలు:

1. సైదాపూర్ మండలం: నవంబర్ 16, సోమవారం – ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణం.
2. ఎల్కతుర్తి మండలం: నవంబర్ 17, మంగళవారం – ఎస్.ఎం.ఆర్. ఫంక్షన్ హాల్, వరంగల్ రోడ్డు.
3. అక్కన్నపేట మండలం: నవంబర్ 18, బుధవారం – రైతు బజార్/హైస్కూల్ (వేదిక ఖరారు కావాల్సి ఉంది).
4. కోహెడ మండలం: నవంబర్ 20, శుక్రవారం – లక్ష్మీ గార్డెన్.
5. చిగురుమామిడి మండలం: నవంబర్ 21, శనివారం – మహాలక్ష్మి ఫంక్షన్ హాల్, చిన్న ముల్కనూరు.
6. హుస్నాబాద్ రూరల్: నవంబర్ 25, బుధవారం – మున్సిపాలిటీ.
7. హుస్నాబాద్ టౌన్: నవంబర్ 26, గురువారం మున్సిపాలిటీ.
8. భీమదేవరపల్లి మండలం: నవంబర్ 27, శుక్రవారం – ప్రభుత్వ ఉన్నత పాఠశాల. అన్ని శిబిరాలు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు మంత్రి ప్రత్యేక విజ్ఞప్తి

హుస్నాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సహకార సంఘం చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు తమ తమ మండలాలు, గ్రామాల పరిధిలోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి ఈ శిబిరాల సమాచారాన్ని వారికి చేరవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంబంధిత మండలంలో నిర్ణయించిన తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే శిబిరాలకు హాజరయ్యేలా చొరవ తీసుకోవాలని, వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.ప్రతి గ్రామంలోని అర్హులైన వారందరికీ ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ ఒక్క దివ్యాంగుడు కూడా సహాయం కోసం ఎదురుచూస్తూ నిస్సహాయంగా మిగిలిపోకూడదు. ప్రతి ఒక్కరికీ అండగా నిలిచి, వారు స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని గడిపేలా సహాయ ఉపకరణాలు అందించడమే తమ సంకల్పమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

చేవెళ్ల, నవంబర్ 15 :

షాబాద్ మండల పరిధిలోని దామర్లపల్లి మాజీ సర్పంచ్ లింగం నూతనంగా ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఆఫీస్ ను రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగంకు శుభాకాంక్షలు తెలిపి, వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం షాబాద్ మండలం పెద్దవేడు గ్రామంలో చక్కటి సుశీలకు ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో వారు నూతనంగా నిర్మించిన "ఇందిరమ్మ ఇల్లు" గృహప్రవేశ కార్యక్రమంలో చైర్మన్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నూతన గృహంలోకి ప్రవేశించిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆనందం.. కార్తీక వనమహోత్సవం

వైరా నవంబర్ 15 :

కార్తీక మాసం ప్రారంభం కావడంతో వైరా పరిసర ప్రాంతాలలోని మామిడి తోటల్లో వనసమారాధన కార్యక్రమాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం కమ్మవారి వన సమారాధన మహోత్సవంలో పలువురు మాజీ మంత్రులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవారం గ్రామంలోని సామినేని వారి మామిడి తోటలో వైరా కమ్మ జనసేవా సమితి అధ్యక్షులు కట్టా కృష్ణార్జున రావు అధ్యక్షతన జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమాలలో భాగంగా తొలుత భారీగా తరలివచ్చిన మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ డిసిసిబి చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కోట్ల నాగేశ్వరరావు, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వైరా మున్సిపాలిటీ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, వనమా వాసు, తాళ్లూరి బ్రహ్మయ్య, జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు, వైరా మున్సిపాలిటీ కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి, పలు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు చిన్నారులు ఆటపాటలతో ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా ఆడి పాడారు. మొగిలి ఎంటర్టైన్మెంట్స్ సంస్థ వారి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అతిథులను వైరా కమ్మజన సేవాసమితి కమిటీ సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. నిరుపేద కమ్మ విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నిర్వాహకులు హామీ ఇచ్చారు. మామిడి తోటల్లో ఆహ్లాదకర వాతావరణంలో సాయంత్రం వరకు మహిళలు చిన్నారులు ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపారు.



సీఎం బృందానికి పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం సంపూర్ణ మద్దతు

జడ్చర్ల, నవంబర్ 15 :

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని న్యూఢిల్లీలో కలిసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు క్యాప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి బృందానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఫోరం ప్రధాన కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి, మంత్రుల బృందం ప్రధానమంత్రికి సమర్పించిన వినతిపత్రంలోని అంశాలను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 365 మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతులను ఆదుకోవడానికి, తాగునీటి ఎద్దడిని నివారించడానికి రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని మంజూరు చేయాలని కోరడం అభినందనీయమన్నారు. అలాగే కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా కల్పించేలా కేంద్రం చొరవ చూపాలని కోరడాన్ని స్వాగతించారు. ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి, కేంద్ర అనుమతులు, ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన కింద నిధులు కేటాయించాలని చేసిన విజ్ఞప్తి కీలకమన్నారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం అనుమతులు, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం ఇప్పించాలని, సీతమ్మసాగర్ బ్యారేజీకి పర్యావరణ అనుమతులు వేగంగా మంజూరు చేయాలని కోరడం రాష్ట్ర సాగునీటి అవసరాలకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంలో తెలంగాణకు 50 శాతం నీటి వాటా కేటాయించాలని ప్రతిపాదించడం కూడా రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ఉందన్నారు.

జవాన్ కుటుంబానికి ఎమ్మెల్యే 'బీర్ల' పరామర్శ

వల్లపు మహేందర్ కు నివాళులర్పించిన బీర్ల ఐలయ్య..

నిర్వహణలో నిర్లక్ష్యంపై వైద్యులకు హెచ్చరిక

ఆలేరు, నవంబర్ 15 :

యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండు వేర్వేరు సందర్భాల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించారు. దేశ రక్షణ కోసం సైన్యంలో సేవలందించిన జవాన్ వల్లపు మహేందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేయడంతో పాటు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నిర్వహణలో అపరిశుభ్రత, నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

జవాన్‌కు ఘన నివాళి.. కుటుంబానికి పరామర్శ

తుర్కపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ వల్లపు మహేందర్ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదివారం గ్రామానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం భారత సైన్యంలో సేవలందించిన యువ జవాన్ అకాల మరణం అత్యంత బాధాకరమని అన్నారు. దేశ సేవకు అంకితమైన ఒక యువ సైనికుడిని కోల్పోవడం కుటుంబానికి, గ్రామానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మహేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దేశ సేవలో మహేందర్ అందించిన సేవలు, ఆయన అంకితభావం ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.



మార్చురీ అపరిశుభ్రతపై ఆగ్రహం

మరోవైపు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నిర్వహణలో నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫకీరుగూడెం గ్రామానికి చెందిన నాగయ్య మృతదేహాన్ని పరిశీలించేందుకు ఆసుపత్రికి వచ్చిన సందర్భంగా మార్చురీ పరిసరాలను పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం స్ట్రెచర్లపై రక్తపు మరకలు శుభ్రం చేయకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి వైద్యులను నిలదీశారు. మార్చురీ నిర్వహణలో ఇలాంటి నిర్లక్ష్యం తగదని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులు, మృతుల కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలగకుండా వైద్యులు, సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.

మీ పొట్ట ఆరోగ్యంగా ఉందా?

మన పొట్ట ఆరోగ్యంగా ఉన్నంత వరకే మనకు సంపూర్ణ ఆరోగ్యం. ఆకలి, అరుగుదల సక్రమంగా ఉన్నంత కాలం మన ఆరోగ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు. ఏ కారణం చేతనైనా పొట్టలో సమస్య తలెత్తితే, అది మన సమగ్ర ఆరోగ్యాన్నే ప్రభావితం చేస్తుంది. అజీర్తి, ఎసిడిటీ, మలబద్ధకం, గ్యాస్ ట్రబుల్, పేగుపూత వంటి సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారు. వీటిలో అధిక శాతం సమస్యలను సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతోనే సరిదిద్దుకోవచ్చు. జీర్ణవ్యవస్థను, పేగులను చక్కటి ఆరోగ్యంతో ఉంచుకోవడానికి మనం ఏమి చేయాలో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.



జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో ఆహారానిదే కీలక పాత్ర. ముఖ్యంగా పేగులను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి వేళకు తినడం చాలా ముఖ్యం. పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి సమతుల ఆహారం అవసరం. పండ్లు, కూరగాయలు, గింజధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. ఇవి పీచు పదార్థాలను అందించి, జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. ప్రాసెస్డ్ ఫుడ్‌కి పూర్తిగా దూరంగా ఉండాలి, ఎందుకంటే అవి పేగుల్లోని మంచి బ్యాక్టీరియాను దెబ్బతీసి, జీర్ణ సమస్యలను పెంచుతాయి. కాల్షియం, విటమిన్ డి వంటి పోషకాలను అందించే పాలు, మజ్జిగ, పెరుగు వంటివి పేగుల ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. తగినంత పీచు లభించేలా చూసుకోవడం ముఖ్యమే. అలాగే, మనం ఎప్పుడు తింటున్నామనేది కూడా ప్రధానమే. ఉదాహరణకు, ఛాతిలో మంటతో బాధ పడేవారు పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందే రాత్రి భోజనం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఒకేసారి ఎక్కువ ఆహారం తీసుకోకుండా, తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తినడం జీర్ణ వ్యవస్థపై భారాన్ని తగ్గిస్తుంది.

శారీరక శ్రమ:

శారీరకంగా చురుకుగా ఉండటం పేగుల ఆరోగ్యానికి కీలకం. మలబద్ధకం గలవారికి ఇది మరింత ముఖ్యం. ఎంత ఎక్కువగా శ్రమ చేస్తే, అంత ఎక్కువగా పేగులు కదులుతాయి. వ్యాయామం మలబద్ధకం, కాలేయ కొవ్వు తగ్గించడానికే కాకుండా, పేగుల్లో సూక్ష్మక్రిముల వైవిధ్యాన్ని, మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి దోహదం చేస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి.

నీరు, ద్రవాలు:

మన శరీరంలో చాలా వ్యవస్థలు నీటితోనే ముడిపడి ఉంటాయి. నీరు తగ్గితే జీర్ణక్రియ సరిగ్గా సాగదు. కాబట్టి, రోజూ తగినంత నీరు, ద్రవాలు తీసుకోవాలి. పీచు పదార్థాలతో పాటు తగినంత నీరు తీసుకుంటే మరింత మంచి ఫలితం కనిపిస్తుంది, మలబద్ధకం నివారించబడుతుంది. కృత్రిమ తీపి పదార్థాలతో చేసిన పానీయాలకు దూరంగా ఉండాలి. ఇవి పేగుల్లో బ్యాక్టీరియా సమతుల్యతను దెబ్బతీస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

దూరంగా ఉండాల్సినవి:

మద్యం, పెయిన్‌కిల్లర్లు పేగులకు హాని చేస్తాయి. మద్యం కాలేయానికి హాని కలిగించడమే కాకుండా, నేరుగా జీర్ణాశయం, పేగుల మీద ప్రభావం చూపుతుంది. మద్యం విషయంలో ఆరోగ్యకరమైన పరిమితి అంటూ ఏదీ లేదు. దీని జోలికి వెళ్ళకపోవడమే ఉత్తమం. తరచుగా నొప్పి మాత్రలు వేసుకుంటే జీర్ణాశయంలో, పేగుల్లో వాపు ప్రక్రియ ప్రేరేపితం అవుతుంది, పేగుల్లో పుండ్లు పడే అవకాశం ఉంది. కాబట్టి వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

వైద్యుల సలహా ఎప్పుడు అవసరం

తరచుగా విరేచనాలు అవుతున్నా, నాలుగైదు రోజుల వరకు తగ్గకున్నా ఏదో తేడా ఉందని అనుమానించాలి. విసర్జనలో మార్పులు లేకపోయినా, 45 ఏళ్ళు దాటాక పెద్దపేగు ముందస్తు పరీక్ష (కొలనోస్కోపీ) అవసరం. 50 ఏళ్ళు పైబడ్డాక అన్నవాహిక క్యాన్సర్ ముందస్తు పరీక్ష కూడా చేయించుకోవడం మంచిది. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించి, చికిత్స పొందవచ్చు. పైన చెప్పిన ఈ సూచనలను పాటించడం ద్వారా పేగులను ఆరోగ్యంగా ఉంచుకొని, మంచి జీర్ణ వ్యవస్థతో ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు.

అతివ Athiva Singidi

వట్టి తునకల కూర వండుదాం ఇలా



భారతదేశంలో, ముఖ్యంగా రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలలో వట్టి తునకల మటన్ కూర ఒక విశిష్టమైన, సాంప్రదాయక బలవర్ధక వంటకం.. పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉండే వట్టితునకలు..

కేవలం నోరూరించే రుచిని మాత్రమే కాకుండా, శరీరానికి అవసరమైన బలాన్ని, ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి.. ఎండబెట్టిన మాంసంతో తయారుచేసే ఈ వంటకాన్ని ఎండబెట్టిన యాట మాంసం కూర (ఎండు మాంసం) అని కూడా పిలుస్తారు. ఇది బాలింతలకు, శారీరక శ్రమ చేసేవారికి ఎంతో బలాన్ని ఇస్తుంది. అంతేకాకుండా.. నరాల బలహీనతను దూరం చేసి.. శరీరాన్ని ఉక్కులా మారుస్తుందని పేర్కొంటారు

వట్టి తునకల పోషకాలు.. ఆరోగ్య ప్రయోజనాలు..

వట్టి తునకల్లో ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి.. అంతేకాకుండా.. ఐరన్, జింక్, విటమిన్ B12, క్యాల్షియం, ఫాస్పరస్ వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి.

ఎండు మాంసం కండరాల బలానికి ఉపయోగపడుతుంది. అలాగే.. రక్తహీనతను తగ్గించి, శరీరానికి అవసరమైన శక్తిని, స్టామినాని అందిస్తాయి.

నరాల బలహీనతను తగ్గించడంలో.. రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో, ఎముకలు గట్టిపడేందుకు వట్టితునకలు సహాయపడతాయి..

అందుకే.. పూర్వకాలం నుంచి వట్టితునకలను బలవర్ధక ఆహారంగా ఉపయోగించేవారు. ప్రసవం తర్వాత బాలింతలకు బలాన్నివ్వడానికి, పాల ఉత్పత్తిని పెంచడానికి వట్టితునకలు పెట్టేవారు.

పూర్వ కాలంలో దీర్ఘకాలిక అనారోగ్యాల నుండి కోలుకునేవారికి, బలహీనంగా ఉన్నవారికి, గాయాలతో బాధపడేవారికి ఈ వట్టి తునకల కూరను ఆహారంగా ఇచ్చేవారు. దీనివల్ల వారు త్వరగా కోలుకునే శక్తి లభించేదని చెబుతారు. అందుకే.. నెలకు ఒక్కసారైనా తినాలని చెబుతున్నారు.

వట్టి తునకల తయారీ విధానం..

ముందుగా, మటన్‌ను శుభ్రంగా కడిగి, ముక్కలలో నీరు లేకుండా పొడిగా చూసుకోవాలి. అనంతరం, ముక్కలను సరైన దూరంలో ఏర్పాటు చేసుకొని, నాలుగు నుంచి పదిహేను రోజుల పాటు ఎండలో ఎండబెట్టాలి. ప్రతిరోజు సాయంత్రం ఎండ తగ్గిన తర్వాత వీటిని లోపలికి తీసుకువెళ్లి, మరుసటి రోజు మళ్ళీ ఎండలో ఆరబెట్టాలి. ఈ ప్రక్రియ ద్వారా మాంసం ముక్కలు గట్టిపడి ఐరన్ ముక్కల వలే మారతాయి. బాగా ఎండిన వట్టి తునకలను గట్టి మూత ఉన్న గాజు సీసాలో నిల్వ చేసుకుంటే సంవత్సరం పాటు తాజాగా ఉంటాయి. ఈ సాంప్రదాయ వంటకం శారీరక ఆరోగ్యాన్ని, బలాన్ని పెంపొందించడంలో ఎంతగానో తోడ్పడుతుంది. వట్టి తునకలను ఎలాగైనా వండుకోవచ్చు.. అవసరమైనప్పుడు టమాటా, దోసకాయ లేదా ఉల్లిపాయలతో కలిపి కూరగా వండుకోవచ్చు.. వట్టితునకల ఫ్రై కూడా అద్భుతంగా ఉంటుంది.

పాతకాలపు తీపి వంటకం!

అప్పటి కార్తీక మాసంలో ఫేమస్.. పురాతన కాలంనాటి, అంతరించిపోయిన ఒక రుచికరమైన తీపి వంటకం ఇప్పుడు మళ్ళీ గుర్తు చేసుకుందాం..

కావాల్సిన పదార్థాలు:

గోధుమపిండి – 1 చిన్న కప్పు, ఉప్పు – ఒక చిటికెడు, నీళ్లు – తగినంత, బెల్లం – 1 పావు కప్పు, యాలకుల పొడి – పావు టీస్పూన్, నెయ్యి – 1 టీస్పూన్, ముందుగా, ఒక బౌల్‌లో గోధుమపిండిని తీసుకుని, చిటికెడు ఉప్పు వేసి కలపాలి. ఆ తర్వాత తగినన్ని నీళ్లు కొద్దికొద్దిగా పోస్తూ పిండిని ముద్దలా కలుపుకోవాలి. పిండి మరీ సాఫ్ట్‌గా ఉండకూడదు. కొద్దిగా గట్టిగా ఉంటే సరిపోతుంది.



కలుపుకున్న పిండి నుండి చిన్న చిన్న భాగాలు తీసుకుని, వేళ్ళ నొక్కుతూ చిన్నగా తయారుచేయాలి. దీన్ని అడ్డంగా లేదా నిలువుగా, మీకు నచ్చిన విధంగా చేయవచ్చు. మరొక సులభమైన పద్ధతి ఏమిటంటే, కొద్దిగా పిండిని తీసుకుని ఒక చేతి అరచేతిపై ఉంచి, మరొక చేతి వేళ్ళతో జస్ట్ నొక్కితే సరిపోతుంది.ఈ గోధుమపిండి ముక్కలను నెమ్మదిగా వేయాలి. చిన్న ముక్కలను పెద్దగా చేయకుండా, చిన్నవిగా ఉండేలా చూసుకోవాలి. వాటిని ఎండబెట్టి నిల్వ చేసుకోవచ్చు.

పొయ్యిపై ఒక కడాయి పెట్టి, తగినన్ని నీళ్లు పోసి వేడి చేయాలి. నీరు వేడెక్కాక, మనం తయారుచేసి పెట్టుకున్న గోధుమపిండి ముక్కలను వెంటనే కలపకూడదు. అవి తమంతట తామే విడివిడిగా అవుతాయి. అవి మంచిగా ఉడికి, గట్టిగా మారే వరకు ఉడికించాలి. ఒకవేళ నీళ్లు ఎక్కువగా అనిపిస్తే, వాటిని వంపేయవచ్చు. ఉడికిన పిండి ముక్కల్లో బెల్లం (1 పావు కప్పు), యాలకుల పొడి (పావు టీస్పూన్), నెయ్యి (1 టీస్పూన్) వేసి బాగా కలపాలి.

బెల్లం కరిగి, మిశ్రమం దగ్గరపడే వరకు, పిండి ముక్కలు బెల్లం సిరప్‌ను బాగా పీల్చుకునే వరకు ఉడికించాలి. ఈ రుచికరమైన సాంప్రదాయ తీపిని వేడిగా లేదా చల్లగా సర్వ్ చేయవచ్చు. ఇది రెండు విధాలుగానూ చాలా రుచిగా ఉంటుంది. కొందరు దీన్ని పాలను పోసుకుని కూడా తింటారు.

స్థిరంగా పసిడి ధరలు



అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు క్రమంగా తగ్గుదల నమోదు చేస్తున్నాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు క్రమంగా తగ్గుదల నమోదు చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఆదివారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,37,620గా ఉంది (Gold and Silver Rates). ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,26,150గా ఉంది (Live Gold Rates). మరోవైపు వెండి ధరలు కూడా బాగా దిగి వచ్చాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.1,95,000గా ఉంది.

టాటా సన్స్ లిస్టింగ్‌తో దాతృత్వ కార్యక్రమాలకు ఇబ్బందే



టాటా సన్స్ లిస్టింగ్ ప్రతిపాదనపై టాటా ట్రస్ట్‌ల చైర్మన్ నోయల్ టాటా ఆందోళన వ్యక్తం చేశారు. టాటా సన్స్ లిస్టింగ్‌తో టాటా గ్రూప్ వ్యాపార మూల సిద్ధాంతం మారిపోవచ్చని, వాటాదారులు దాతృత్వం కంటే లాభాలకు ప్రాధాన్యమిచ్చే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. గ్రూప్ ప్రధాన ఉద్దేశాన్ని పరిరక్షించేందుకు నియంత్రణ సంస్థలు, ఇతర సంబంధిత వర్గాలతో కలిసి ప్రత్యామ్నాయ పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. శనివారం హెచ్‌టీ లీడర్‌షిప్ సమ్మిట్ 2026లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టాటా సన్స్ బోర్డు– టాటా ట్రస్ట్‌ల మధ్య అభిప్రాయ భేదాలు తారాస్థాయికి చేరుకున్న నేపథ్యంలో నోయల్ టాటా తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కంపెనీని స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని తీర్మానించిన టాటా సన్స్ బోర్డు.. చైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ పునర్నియమించింది. ఈ రెండు నిర్ణయాలను టాటా ట్రస్ట్‌లు, దాని చైర్మన్ నోయల్ టాటా వ్యతిరేకించారు.

స్టాక్ మార్కెట్ Stock Market

మ్యూచువల్ ఫండ్స్ లో ఇన్వెస్ట్ చేయాలని భావించే వారు SIP, లంప్సమ్ అనే రెండు పద్ధతుల ద్వారా మాత్రమే పెట్టుబడి పెట్టడానికి వీలు అవుతుంది. అయితే 10 సంవత్సరాల కాలపరిమితికి గాను నెలకి రూ. 5000 SIP చేస్తే ఎంత మొత్తాన్ని పొందవచ్చు, అలాగే రూ. 5 లక్షలు ఒకేసారి పెట్టుబడి చేస్తే ఎంత కార్పస్ ని ఏర్పాటు చేసుకోవచ్చు అనే విషయంలో చాలా మందికి అనేక సందేహాలు ఉన్నాయి.

రెండిటిలో ఏది లాభం

నెలకు రూ.5000 సిప్ లేక లంసమా

నెలవారీ SIP :	లంప్సమ్ పెట్టుబడి :
SIP మొత్తం : రూ. 5000	పెట్టుబడి మొత్తం : రూ. 5,00,000
పెట్టుబడి కాలపరిమితి : 10 సంవత్సరాలు	పెట్టుబడి కాలపరిమితి : 10 సంవత్సరాలు
ఆశించిన రిటర్న్ రేటు : 12 శాతం	ఆశించిన రిటర్న్ రేటు : 12 శాతం
పెట్టిన మొత్తం పెట్టుబడి : రూ. 6,00,000	పెట్టిన మొత్తం పెట్టుబడి : రూ. 5,00,000
అంచనా వేసిన రాబడి : రూ. 5,61,695	అంచనా వేసిన రాబడి : రూ. 10,52,924
మొత్తం విలువ : 11,61,695	మొత్తం విలువ : 15,52,924



ప్రస్తుతం దేశంలో మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ రోజురోజుకి పెరిగిపోతున్నాయి. నేరుగా స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు పెట్టడానికి ఇన్వెస్టర్స్ ఆసక్తి కనపరుస్తున్నారు. మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు పెట్టాలని భావించే వారికి SIP లేదా లంప్సమ్ అనే రెండు ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయి.

SIP ద్వారా ప్రతి నెలా కొంత మొత్తాన్ని పెట్టవచ్చు లేదా లంప్సమ్ ద్వారా ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టవచ్చు. అయితే ఈ రెండు పద్ధతులలో ఏది ఎంచుకోవాలనే విషయంలో చాలా మందికి అనేక సందేహాలు ఉన్నాయి. ఈ రెండు పద్ధతులు కూడా పెట్టుబడులు పెట్టడానికి అనువుగా ఉంటాయి అయితే వీటి ద్వారా వచ్చే రిటర్న్స్, రిస్క్, పెట్టుబడి విధానం మాత్రం వేరుగా ఉంటాయి. ఉదాహరణకి రూ. 5000 నెలవారీ SIP, అలాగే రూ. 5 లక్షల లంప్సమ్ పెట్టుబడులలో ఏది ఎక్కువ లాభాలని అందిస్తుందో కింద చూద్దాం.

SIP లేదా లంప్సమ్ ఆప్షన్ అనేది మీ ఫైనాన్సియల్ గోల్స్, ఇన్వెస్ట్‌మెంట్ కాలపరిమితి, రిస్క్ సామర్థ్యం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. మ్యూచువల్ ఫండ్ రిటర్న్స్ అనేవి గతంలో మాదిరిగా వస్తాయని ఎలాంటి హామీ లేదు. పెట్టుబడి పెట్టే ముందు మీకు తెలిసిన ఫైనాన్సియల్ అడ్వైజర్ సలహా తీసుకోవడం మంచిది.

కాలుష్య సంబంధిత ఆరోగ్య బీమా క్లెయిమ్‌లు పెరిగాయ్

మూడేళ్లలో 4.3 రెట్ల పెరుగుదల

గత మూడేళ్లలో కాలుష్య సంబంధిత ఆరోగ్య బీమా క్లెయిమ్‌లు 4.3 రెట్లు పెరిగినట్లు బీమా మార్కెట్ ప్లేస్ పాలసీబజార్ నివేదిక వెల్లడించింది. మొత్తం క్లెయిమ్‌లలో గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల క్లెయిమ్‌లే 78 శాతం ఉన్నాయని పేర్కొంది. ఇందులో గుండె సంబంధిత వ్యాధుల వాటా 43.5 శాతం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు 35 శాతం, న్యుమోనియా 11.2 శాతం ఉన్నాయి. 31–55 ఏళ్ల వయసున్న ఉద్యోగులు 59 శాతం క్లెయిమ్‌లు చేయగా.. సీనియర్ సిటిజన్స్ 31 శాతం, 21–30 ఏళ్ల మధ్య వయసున్న యువత 6.7 శాతం, 20 ఏళ్లలోపు వయసున్న పిల్లలు 3.7 శాతం క్లెయిమ్‌లను చేసినట్లు తెలిపింది. కాలుష్య సంబంధిత ఆరోగ్య బీమా క్లెయిమ్‌లలో ఉద్యోగులు, సీనియర్ సిటిజన్ల వాటాయే దాదాపు 90 శాతం ఉంది. ఇక ఢిల్లీలో అత్యధికంగా 8,093 క్లెయిమ్‌లు నమోదయ్యాయి. తర్వాతి స్థానాల్లో పుణె, బెంగళూరు, ముంబై, హైదరాబాద్ ఉన్నాయి. మొత్తం క్లెయిమ్‌ల చెల్లింపులు 4.5 రెట్లు పెరిగి రూ.241.6 కోట్లకు చేరుకున్నాయి. సగటు క్లెయిమ్ మొత్తం రూ.62,662గా ఉంది.

కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు..
ఎండుతున్న పంటలు!

*** నెల రోజుల్లో మూడుసార్లు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం... *30 మంది రైతులకు ఒకే ట్రాన్స్‌ఫార్మర్..**
*** పట్టించుకోని విద్యుత్ శాఖ *ఎమ్మెల్యేకు విన్నవించినా పరిష్కారం శూన్యం.. రైతుల ఆవేదన**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
రైతుల పంటలు ఎండిపోతున్నా విద్యుత్ శాఖ అధికారులకు చీమకుట్టినట్లయినా లేకుండా పోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు వరుసగా కాలిపోతూ అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. సూర్యాపేట జిల్లాలోని మోతె మండలం సిరికొండ గ్రామ పరిధిలోని ఈదులకుంట రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. నెల రోజుల వ్యవధిలోనే మూడుసార్లు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటలు కాపాడుకోవడానికి అధికారుల చుట్టూ తిరిగినా, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.ఒక్క ట్రాన్స్‌ఫార్మర్.. 30 మంది రైతులుఈదులకుంట పరిధిలో సుమారు 30 మంది రైతులు వ్యవసాయ బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. వీరంతా ఎస్సీ (మాదిగ) సామాజికవర్గానికి చెందిన నిరుపేద రైతులు. 30 మంది డీడీలు చెల్లించి విద్యుత్ కనెక్షన్లు పొందినా అందరికీ కలిపి ఒకే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. సామర్థ్యానికి మించి విద్యుత్ భారం పడటంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతోందని రైతులు చెబుతున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అర్ధరాత్రి, అపరాత్రి వేళల్లో సరఫరా కావడంతో మోటార్లు ఎప్పుడు నడపాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.మూడు సార్లు కాలినా.. మారని పరిస్థితినెల రోజుల వ్యవధిలోనే మూడుసార్లు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. కొత్తగా బోర్లు వేసుకుని సాగు చేస్తున్న రైతులకు అదనంగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఓవర్‌లోడ్ సమస్య అధికారులకు తెలిసినా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతేనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు జాప్యం జరుగుతుండగా, వరుసగా మూడుసార్లు కాలిపోవడంతో సాగు పనులు నిలిచిపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు పంట చేతికొస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నా ఫలితం ఏదీ?సమస్యను స్థానిక లైన్‌మెన్ నుంచి డీఈ వరకు పలుమార్లు విన్నవించినా పరిష్కారం లభించలేదని రైతులు చెబుతున్నారు. చివరకు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి సైతం వినతిపత్రం అందించి తమ సమస్యను వివరించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు దిశగా చర్యలు కనిపించడం లేదని వాపోతున్నారు. రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారుల్లో స్పందన లేకపోవడంపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద రైతుల సమస్య కావడంతోనే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అని ప్రశ్నిస్తున్నారు.పంట చేతికొస్తుందో.. లేదో!ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నట్లు రైతు కంపాటి వెంకన్న తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని కోరారు. ఓవర్‌లోడ్ సమస్యను అరికట్టి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు కత్తుల భద్రయ్య విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని, లేనిపక్షంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడితో పాటు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు.రైతు కంపాటి వెంకన్న, సిరికొండ, మోతె: ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ పదేపదే కాలిపోతుండటంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశాం. ఇప్పుడు పంటలు చేతికొస్తాయో.. లేదోనన్న అనుమానం కలుగుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన ప్రతిసారీ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి మా పంటలను కాపాడాలి.రైతు కత్తుల భద్రయ్య, సిరికొండ, మోతె: అధికారులు వెంటనే స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. 30 మంది రైతులకు ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఓవర్‌లోడ్ సమస్య ఏర్పడుతోంది. దీనివల్ల తరచూ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి సాగుకు ఆటంకం కలుగుతోంది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓవర్‌లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించి పంటలు ఎండిపోకుండా ఆదుకోవాలి. రైతుల ఇబ్బందులను ఇకనైనా గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలి.



మునుగోడు స్ఫూర్తితో.. మద్యపాన నిషేధానికి శ్రీకారం!



సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన నియోజకవర్గంలో బెల్ట్ షాపులపై కఠిన చర్యలు చేపడుతూ మద్యపాన నిషేధం దిశగా అడుగులు వేస్తున్నారు. ఇదే స్ఫూర్తితో అనంతగిరి మండలం వాయిలాసింగారం సర్పంచ్ నందిగామ శ్రీనివాస్ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధానికి నడుం బిగించారు. డిసెంబర్ 10లోగా బెల్ట్ షాపులు తొలగించాలని నిర్వాహకులకు గడువు విధించారు. గడువు దాటినా షాపులు కొనసాగిస్తే గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సంఘబంధం మహిళలతో సమావేశం నిర్వహించారు. మద్యం వల్ల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో కొంత వ్యతిరేకత ఎదురైనా ప్రజల సంక్షేమం, కుటుంబాల అభ్యున్నతి, గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచులు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నూతన వధూవరులకు గవర్నర్ ఆశీర్వాదం



(శంకర్‌పల్లి -నినాదం):
జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి మనవడు చిరంజీవి చైతన్య భార్గవ, చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి తేజస్వినిల వివాహ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. శంకర్‌పల్లి మండలం జన్వాడలోని నియో కన్వెన్షన్ వేదికగా జరిగిన ఈ వేడుకకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గవర్నర్ నూతన వధూవరులకు పుష్పగుచ్ఛాలు అందించి ఆశీర్వదించారు. గిరిజనులకు వెచ్చని భరోసా500 దుప్పట్ల వాహనాన్ని ప్రారంభించిన గవర్నర్(హైదరాబాద్ – సింగిడి): జనజాతీయ గౌరవ్ దివస్ (భగవాన్ బిర్సా ముండా జయంతి) సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులకు పంపిణీ చేసేందుకు 500 ఉన్ని దుప్పట్లతో కూడిన రెడ్ క్రాస్ వాహనాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆదివారం లోక్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు.అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘అభయ హంట్ ది వింటర్–2026’ పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దుప్పటి అందించడం అంటే చలి నుంచి రక్షణ కల్పించడమే కాకుండా, తెలంగాణ సమాజం అండగా ఉందనే భరోసా ఇవ్వడమని పేర్కొన్నారు. యువత గిరిజన గ్రామాలను సందర్శించి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది దక్షిణ భారతదేశ వ్యాప్తంగా మొత్తం 4,000 దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వామి బాలచంద్ర తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీ ఎం. దాన కిషోర్, సీఈఓ ప్రొఫెసర్ ఏ. శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి వెండి గద సమర్పించిన తుమ్మల రేఖ-ప్రభాకర్ రెడ్డి దంపతులు



అమీన్‌పూర్, నవంబర్ 15:(సింగిడి) :
అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి సోదరుడు తుమ్మల రేఖ–ప్రభాకర్ రెడ్డి దంపతులు ఆధ్యాత్మిక దాతృత్వాన్ని చాటుకున్నారు. అమీన్‌పూర్ గ్రామంలోని పురాతన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి సొంత నిధులతో ప్రత్యేకంగా తయారు చేయించిన వెండి గదను వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆలయానికి చేరుకున్న తుమ్మల రేఖ–ప్రభాకర్ రెడ్డి దంపతులు ముందుగా కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వెండి గదను ఆలయ అర్చకులకు అందజేశారు.ఈ సందర్భంగా తుమ్మల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, అమీన్‌పూర్ గ్రామంలోని ఈ ఆంజనేయస్వామి ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని పేర్కొన్నారు. తమ ఇల్లు ఆలయానికి సమీపంలోనే ఉండటంతో చిన్నతనం నుండి ప్రతిరోజూ ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకోవడం అలవాటుగా మారిందని గుర్తు చేసుకున్నారు. ఆలయంతో తమ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ఆంజనేయస్వామి విరాజిల్లుతున్నారని, మనస్ఫూర్తిగా మొక్కుకుంటే ఖచ్చితంగా నెరవేరుతాయని తెలిపారు.స్వామివారి ఆశీస్సులతో తమ వంతు భక్తితో ఈ వెండి గదను సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. అమీన్‌పూర్ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని, తమ కుటుంబ సభ్యులపై స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమ్మల కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి

ఖమ్మం, నవంబర్ 15(సింగిడి):
పలు శుభకార్యాలకు హాజరైన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ,మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం లక్ష్మి గార్డెన్స్ నందు చిత్తారు సింహాద్రి యాదవ్ కుమార్తె జోషిత – గురునాథ్ వివాహానికి హాజరై వదువరులను ఆశీర్వదించారు. అదేవిధంగా ఖమ్మం వాసవి గార్డెన్స్ నందు దేవరశెట్టి రామారావు కుమారుడు సాయినాథ్ – డింపుల్ శ్రీలేఖ వివాహానికి హాజరై వదువరులను ఆశీర్వదించారు.

టీఆర్‌వీకే ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పంటల పరిశీలన



నారాయణపేట, నవంబర్ 15, (సింగిడి):
నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి గ్రామంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టి ఆర్ వి కె) శాస్త్రవేత్త సమన్వయకర్త డా. ఈటెల సత్యనారాయణ మిరప, కంది ఉల్లి పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప పంటలో తామర పురుగుల ఉధృతిని పరిశీలించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు.అలాగే, రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలు, వాటి ఎంపిక పంటల ప్రణాళికపై రైతులతో చర్చించారు. ముఖ్యంగా వర్షాధార పరిస్థితులకు అనువైన ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ క్షేత్ర సందర్శనలో రైతులతో నేరుగా మాట్లాడి, పంటల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని తగిన శాస్త్రీయ సలహాలు అందించారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ విజయవంతంగా పూర్తి..

అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి
కల్వకుర్తి నవంబర్ 15 (సింగిడి):
గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ చేపట్టిన ఉచిత శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఆర్థిక పరిస్థితులు ప్రతిభకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ రెండో బ్యాచ్ 90 రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ (TASK) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులను అభినందించారు. అనంతరం వారికి ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.
గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణ అందించడమే లక్ష్యం ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది యువతీ యువకుల్లో ప్రతిభ, పట్టుదల ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన కోచింగ్ పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి నిరుద్యోగ యువతకు అండగా నిలిచి, ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగం ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా ఆ కుటుంబం మొత్తం ఆర్థిక పరిస్థితిని మార్చగలదని అన్నారు. అందువల్ల అభ్యర్థులు సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో నిరంతరం సాధన చేస్తూ తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. 90 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ.. రోజుకు 9 గంటల తరగతులు మొదటి బ్యాచ్ విజయవంతంగా పూర్తయిన అనంతరం రెండో బ్యాచ్‌కు కూడా 90 రోజుల పాటు నిర్విరామంగా శిక్షణ అందించారు. రాష్ట్రస్థాయి అధ్యాపక బృందంతో ప్రతిరోజూ 9 గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు రోజువారీ పరీక్షలు, వారాంతపు గ్రాండ్ టెస్టులు ఏర్పాటు చేశారు. పోలీస్ నియామక పరీక్షలకు అవసరమైన అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తూ అభ్యర్థుల్లో పరీక్షలను ఎదుర్కొనే సామర్థ్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులు రాబోయే పోలీస్ నియామక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని సుంకిరెడ్డి ఆకాంక్షించారు.

స్కిల్ ఫ్యాక్టరీ ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు
యువతకు కేవలం పోలీస్ ఉద్యోగాల శిక్షణకే పరిమితం కాకుండా భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని సుంకిరెడ్డి తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలోని స్కిల్ ఫ్యాక్టరీ ద్వారా కృత్రిమ మేధస్సు (ఏఐ), సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ఐటీ), భాషా నైపుణ్యాలు, ఉద్యోగ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కల్వకుర్తి నియోజకవర్గ యువతకు స్థానికంగానే నాణ్యమైన శిక్షణ, ఉపాధి అవకాశాలు చేరువ చేయాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు ఉద్యోగం సాధించి ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఒక యువకుడికి ఉద్యోగం లభిస్తే ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందనే ఆశయంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అభ్యర్థులు మాట్లాడుతూ ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 90 రోజుల పాటు నాణ్యమైన శిక్షణ అందించడం తమకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. రాష్ట్రస్థాయి అధ్యాపకుల బోధన, ప్రతిరోజూ 9 గంటల తరగతులు, రోజువారీ పరీక్షలు, వారాంతపు గ్రాండ్ టెస్టుల ద్వారా పోటీ పరీక్షలపై మంచి అవగాహన ఏర్పడిందన్నారు. ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించడం తమలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ ఉద్యోగ కలలకు అండగా నిలిచి, ఆర్థిక ఇబ్బందులు లేకుండా శిక్షణ పొందే అవకాశం కల్పించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శేఖర్, శ్రీపతి, శ్రీనితో పాటు పలువురు పాల్గొన్నారు.



ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక చేయూత..



కల్వకుర్తి నవంబర్ 15 (సింగిడి):
పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తమ లక్ష్యాలను సాధించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన వాటం శ్రీశైలం కుమార్తె సౌమ్య ఎంబీబీఎస్ వైద్య విద్యకు ఎంపిక కావడంతో ఆమె చదువుకు సహాయంగా 25 వేల ఆర్థిక సహాయం అందించారు.
వైద్య విద్యను అభ్యసిస్తున్న సౌమ్యకు అవసరమైన స్టడీ మెటీరియల్ కొనుగోలు కోసం ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థిని కుటుంబ సభ్యులకు ఈ మొత్తాన్ని అందించారు.ఈ సందర్భంగా సింగం విజయ్ గౌడ్ మాట్లాడుతూ,ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో గోలి శ్రీనివాస్ రెడ్డి సహాయం అందిస్తున్నారని తెలిపారు. సౌమ్య వైద్య విద్యను విజయవంతంగా కొనసాగించేందుకు రాబోయే మూడేళ్ల పాటు కూడా స్టడీ మెటీరియల్ ఖర్చులను భరిస్తామని గోలి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులను గుర్తించి వారి ఉన్నత విద్యకు అవసరమైన సహకారం అందించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. సౌమ్య భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి సేవలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్ నాయకులు సురేష్ గౌడ్, రుక్సుద్దీన్, వీరాస్వామి, భానుచందర్, మాణిక్యం, పరమేష్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమస్యల పరిష్కారానికి రూ.50 కోట్లు ఇవ్వండి

మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి విన్నవించిన మున్సిపల్ చైర్ పర్సన్ కిరణ్ మిత్ర



ఇల్లందు,నవంబర్ 15,(సింగిడి):
రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఇల్లందు మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఇల్లందు మున్సిపల్ పట్టణంలో నెలకొన్న సమస్యలను ప్రస్తుత రాజకీయా పరిస్థితులు, పరిణామాలును మంత్రి దృష్టికి తీసుకోని వెళ్లినట్లు పేర్కొన్నారు. వీటితోపాటు పట్టణ అభివృద్ధికి రూ.50 కోట్ల రూపాయల్ని మంజూరు చేస్తామని గతంలో ఇచ్చిన హామీ మంత్రికి గుర్తు చేయగా మంత్రి స్పందిస్తూ త్వరలో ఇల్లందు మున్సిపాలిటీకి నిధులు కేటాయిస్తామని తెలియజేయడం జరిగింది ఇల్లందు రెండో వార్డు, ఒకటో వార్డుకు సంబంధించినటువంటి ముస్లిం మైనార్టీ స్మశాన వాటిక దానికి చుట్టూ ఉన్నటువంటి ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని మంత్రి మంత్రికి సూచించగా ఆయన స్పందిస్తూ కలెక్టర్ కి చెప్పి 60 లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దాంతోపాటు ఇల్లందు మున్సిపల్ అధికారులను పూర్తిస్థాయిలో అధికారులు లేకపోవడంతో వారి స్థానంలో రెగ్యులర్గా ఉండే అధికారులని నియమించాలని కోరినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులిగండ్ల మాధవరావు,20వ వార్డు కౌన్సిలర్ ఎండి జాఫర్, వారితో పాటు సీనియర్ నాయకులు పగ్రె శీను పందిళ్ళ వెంకన్న మంత్రి కలిసిన వారిలో వున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా డోకూరి ప్రభాకర్ రెడ్డికి అవకాశం కల్పించాలి



కల్వకుర్తి నవంబర్ 15 (సింగిడి):
ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డోకూరి ప్రభాకర్ రెడ్డికి కేటాయించాలని వెల్జాల్ గ్రామ మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు అజీజ్ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ పార్టీ బలోపేతం కోసం తన సొంత డబ్బులతో డోకూరి ప్రభాకర్ రెడ్డి నిరంతరం కృషి చేశారని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తూ పార్టీ అభివృద్ధిలో కీలకంగా పనిచేశారని పేర్కొన్నారు. తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గతంలో బాధ్యతలు నిర్వహించిన ఆయనకు పార్టీ పట్ల ఉన్న నిబద్ధత, సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కేటాయించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించడం ఎంతో అవసరమని అజీజ్ అభిప్రాయపడ్డారు. డోకూరి ప్రభాకర్ రెడ్డికి ఈసారి అవకాశం కల్పిస్తే తలకొండపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని పేర్కొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేతలో 'మతలబేంటి'..!

- ఎనిమిది రోజుల్లోనే హెచ్ఎంకు మళ్లీ పోస్టింగ్..
- అదీ నివాసానికి సమీపంలోని పాఠశాలలోనే!
- ఐదుగురు అధికారుల విచారణ నివేదికలు బుట్టదాఖలా?
- రిజిస్టర్ల అక్రమాలపై క్రిమినల్ చర్యలేవీ?
- కలెక్టర్ జోక్యానికి ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల విజ్ఞప్తి

ఇల్లెందు, నవంబర్ 15 (సింగిడి):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖలో ఏం జరుగుతోంది? తప్పు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారా? నిబంధనల ప్రకారం సస్పెన్షన్ విధించిన ప్రధానోపాధ్యాయుడిని పట్టుమని పది రోజులు కూడా గడవక ముందే తిరిగి విధుల్లోకి తీసుకోవడం.. అందులోనూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాల నుంచి పట్టణంలోని పాఠశాలకు పోస్టింగ్ కల్పించడం ఇప్పుడు విద్యాశాఖలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. అటెండెన్స్ రిజిస్టర్లలో అవకతవకలు, తప్పుడు హాజరు నమోదు వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి ఇంతటి వెసులుబాటు ఎలా కల్పించారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా ఆర్థిక లావాదేవీలు చోటుచేసుకున్నాయంటూ వస్తున్న ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలను తేల్చాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులపై ఉంది.విచారణ నివేదికలన్నీ ఏమయ్యాయి?ఇల్లెందు మండలం మర్రిగూడెం (ఎం) ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న డి. రమేష్‌పై గత రెండేళ్లుగా పలు ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. అటెండెన్స్ రిజిస్టర్లలో అవకతవకలు, అర్హతలేని సెలవులకు సైతం పూర్తి వేతనం చెల్లించాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, గ్రామస్తుల నుంచి తెల్ల కాగితాలపై సంతకాలు సేకరించడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. పాఠశాల నిర్వహణ, హాజరు రికార్డుల వ్యవహారంలో చోటుచేసుకున్న అక్రమాలపై ఐదుగురు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆధారాలతో సహా జిల్లా విద్యాశాఖకు నివేదికలు సమర్పించినట్లు సమాచారం. అయినప్పటికీ సుదీర్ఘకాలం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, చివరకు సస్పెన్షన్ విధించిన అనంతరం కొద్ది రోజుల్లోనే తిరిగి విధుల్లోకి తీసుకోవడం అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలు రేకెత్తిస్తోంది. విచారణ జరిపిన అధికారుల నివేదికలకు విలువ లేదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఏజెన్సీ నుంచి పట్టణానికి.. అదీ అనుకున్న చోటే!మర్రిగూడెం పాఠశాలలో సుమారు ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడిని ఈ నెల 5వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. అయితే కేవలం ఎనిమిది, తొమ్మిది రోజుల వ్యవధిలోనే సస్పెన్షన్ ఎత్తివేసి ఇల్లెందు పట్టణంలోని ఎంపీపీఎస్ సంజయ్‌నగర్ పాఠశాలలో తిరిగి విధుల్లోకి తీసుకోవడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. మారుమూల గ్రామంలోని పాఠశాల నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని పట్టణ పాఠశాలకు పోస్టింగ్ కల్పించడంపై ఉపాధ్యాయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. సాధారణ బదిలీలకు మరికొద్ది నెలల సమయం ఉండగా, సస్పెన్షన్ ఎత్తివేత తోపాటు కోరుకున్న ప్రాంతానికి సమీపంలో పోస్టింగ్ కల్పించడంలో ఆంతర్యమేమిటన్నది అంతు చిక్కడం లేదు.సస్పెన్షన్ శిక్షనా.. బదిలీకి మార్గమా?తప్పు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన వారికి అది శిక్షగా ఉండాల్సింది పోయి, అనుకూల ప్రాంతాలకు చేరుకునేందుకు మార్గంగా మారుతోందా? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో గుండాల మండలంలోని మారుమూల గ్రామంలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనూ సదరు ఉపాధ్యాయుడిపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు రావడంతో సస్పెన్షన్‌కు గురైనట్లు ప్రచారం జరుగుతోంది. అనంతరం ఇల్లెందు మండలానికి రావడం, ఇప్పుడు మరోసారి సస్పెన్షన్‌కు గురై కొద్దిరోజుల్లోనే పట్టణ పాఠశాలకు పోస్టింగ్ పొందడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ గత పరిణామాలపైనా అధికారిక రికార్డుల ఆధారంగా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.క్రిమినల్ కేసుల ప్రకటనలకే పరిమితమా?అటెండెన్స్ రిజిస్టర్లను తారుమారు చేశారనే ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకొని, వాటిపై పూర్తిస్థాయి విచారణ జరపాల్సి ఉంది. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సస్పెన్షన్ సమయంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటూ ప్రకటించిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? పోలీసులకు ఫిర్యాదు చేశారా? కేసు నమోదైందా? విచారణ ఎక్కడి వరకు వచ్చింది? అన్న విషయాలపై స్పష్టత లేదు. క్రిమినల్ చర్యల అంశం కేవలం ప్రకటనలు, పత్రికా కథనాలకే పరిమితమైందా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రశ్నలకు జిల్లా విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.ముడుపుల ఆరోపణలపై విచారణ జరపాలిస్సెన్షన్ ఎత్తివేత, పునర్నియామకం, పట్టణ పాఠశాలకు పోస్టింగ్ వెనుక భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు బహిర్గతం కాలేదు. అయినప్పటికీ ఇంత తక్కువ వ్యవధిలో జరిగిన పరిణామాలు అనేక అనుమానాలకు తావిస్తున్న నేపథ్యంలో సస్పెన్షన్ ఎత్తివేతకు సంబంధించిన ఫైళ్లు, అధికారుల సిఫార్సులు, పునర్నియామక ఉత్తర్వులను ఉన్నతాధికారులు పరిశీలించాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయా? లేక నిబంధనల ప్రకారమే నిర్ణయం తీసుకున్నారా? అన్నది నిష్పక్షపాత విచారణతో తేల్చాలని డిమాండ్ చేస్తున్నాయి.కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.. లేకుంటే రాష్ట్రస్థాయి ఆందోళనజిల్లా విద్యాశాఖలో చోటుచేసుకుంటున్న పరిణామాలు విద్యావ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒకవైపు ఉపాధ్యాయులపై తీవ్రమైన ఆరోపణలు, మరోవైపు పాఠశాలల నిర్వహణలో వివాదాలు, ఇంకోవైపు చర్యలు తీసుకున్నట్లే తీసుకొని తిరిగి వెనక్కి తగ్గుతున్న అధికారుల తీరు విద్యాశాఖపై నమ్మకాన్ని దెబ్బతీస్తోందని పేర్కొంటున్నాయి.జిల్లా కలెక్టర్ తక్షణమే ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని సమగ్ర విచారణకు ఆదేశించాలని, సస్పెన్షన్ ఉత్తర్వులు, పునర్నియామక ఉత్తర్వులు, ఐదుగురు అధికారులు సమర్పించిన విచారణ నివేదికలను పరిశీలించాలని సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులతో సంబంధం లేని స్వతంత్ర అధికారులతో విచారణ కమిటీ ఏర్పాటు చేసి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు.జిల్లా స్థాయిలో న్యాయం జరగకపోతే రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లడంతోపాటు రాష్ట్రవ్యాప్త ఆందోళనకు కార్యాచరణ రూపొందిస్తామని సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. విద్యాశాఖలో నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయా? లేక పలుకుబడి, పలుకుబాటుకు అనుగుణంగా ప్రత్యేక వెసులుబాట్లు లభిస్తున్నాయా? అన్న ప్రశ్నలకు జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.



ఘనంగా వాల్మీకి మహర్షి ఆలయ ప్రారంభోత్సవం



గద్వాల బ్యూరో నవంబర్ 15 (నినాదం):
జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహావిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయ కొట్టి, హోమ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు బాసు శ్యామల హనుమంతు నాయుడును శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన భావితరాలకు ఆయన గొప్పతనాన్ని, ఆదర్శాలను పరిచయం చేసే కార్యక్రమమని అన్నారు. ఆదికవి వాల్మీకి జీవితం, ఆయన రచించిన రామాయణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి బోధించిన ధర్మం, సత్యం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, అవకాశాలు, ఆత్మగౌరవం కల్పించేందుకు అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సేవాసంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బల్గర నారాయణరెడ్డి, కోటేష్ నాయుడు, జిల్లా నాయకులు పచ్చర్ల శ్రీనివాసులు, అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు శేషాద్రి నాయుడు, దరూర్ వెంకటేష్ నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ధరూర్‌తో పాటు గద్వాల నియోజకవర్గంలోని వివిధ మండలాల వాల్మీకి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, కుల బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సీనియర్ సిటిజన్ పాఠకులకు సన్మానం



ఖమ్మం, నవంబర్ 15(సింగిడి):
ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి విశేష సేవలు అందిస్తూ, నిరంతరం పుస్తక పఠనాన్ని కొనసాగిస్తున్న సీనియర్ సిటిజన్ పాఠకులను చైర్మన్ ఘనంగా సన్మానించినారు. అనంతరం పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు బుక్ రీడింగ్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు, పుస్తకాల ప్రాధాన్యత, రచయితల ఆలోచనలు, విజ్ఞానాభివృద్ధిపై బుక్ టాక్ సెషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్. మల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ . సంతోష్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, ముఖ్యంగా యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

కుటుంబానికి ఎమ్మెల్యే అండ

గోదావరిఖని నవంబర్ 15 (నినాదం):
ఆకెనపల్లి గ్రామానికి చెందిన ఇతనవేణి సంధ్య – రామ్మూర్తి దంపతుల పెద్ద కుమార్తె మన్విత (ప్రిన్సి) జ్ఞాపకాలతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పరామర్శించారు.కుమార్తెను కోల్పోయిన బాధతో కన్నీరుమున్నీరవుతున్న సంధ్య కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖాన్ని పంచుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి ధైర్యం చెబుతూ, మనోస్థైర్యం కోల్పోవద్దని ఓదార్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఆకెనపల్లి సర్పంచ్ గాదె స్రవంతి – సుధాకర్, మార్కెట్ డైరెక్టర్ మంతెన మహేందర్, మాజీ సర్పంచ్ గంగాధరి శ్రీనివాస్, కానిగంటి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితాలో సవరణకు మరో అవకాశం

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల బ్యూరో నవంబర్ 15(సింగిడి):
ఎస్ఐఆర్–2026లో ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులకు నవంబర్ 21లోగా ఫారాలు సమర్పించి పేరు నమోదు చేసుకునేందుకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
భారత ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాల మేరకు గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాల్లో తిరిగి ప్రదర్శించే ఏఎస్ డిడి జాబితాల్లో ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకోవాలని తెలిపారు. ఈ జాబితాలు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.
నివాసం మార్చని ఓటర్లు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారంతో పాటు గతంలో ఫారం సమర్పించలేకపోయిన కారణాలను వివరిస్తూ అనుబంధం–బి సమర్పించాలని సూచించారు. నివాసం మార్చిన వారు కొత్త చిరునామా, సంబంధిత నియోజకవర్గ వివరాలతో కూడిన అనుబంధం–సి, చిరునామా ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎన్యూమరేషన్ ఫారాన్ని ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారికి అందజేయవచ్చని తెలిపారు. రాష్ట్ర పరిధిలోనే నివాసం మార్చిన వారికి ఈ ప్రత్యేక ప్రక్రియలో ఫారం–8 సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. చిరునామా ధ్రువీకరణ పత్రాలు లేని నిరాశ్రయుల విషయంలో సంబంధిత బూత్ స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో నిర్వహించే పరిశీలన నివేదికను నివాస ధ్రువీకరణగా పరిగణిస్తారని తెలిపారు.
గతంలో కేటాయించిన ఓటరు గుర్తింపు కార్డు నంబరు ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాన్ని పొందడంతో పాటు, ఆన్‌లైన్‌లో సమర్పించే సదుపాయం కూడా కల్పించారని వివరించారు. ఇప్పటికే కొత్త ఓటరు నమోదుకు ఫారం–6 సమర్పించిన వారు తిరిగి ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అందిన దరఖాస్తులను సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు పరిశీలించి, అర్హత మరియు సాధారణ నివాస వివరాలను ధ్రువీకరించిన అనంతరం అర్హులైన వారి పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అర్హత పొందిన వారికి గతంలో కేటాయించిన ఓటరు గుర్తింపు కార్డు నంబరునే తిరిగి కేటాయిస్తారని తెలిపారు.ఈ ప్రక్రియను నవంబర్ 21వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉన్నందున సంబంధిత బూత్ స్థాయి అధికారులు అర్హులైన ఓటర్లను సంప్రదించి అవసరమైన సహకారం అందించాలని, ఓటర్లు కూడా ఆలస్యం చేయకుండా తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులను సంప్రదించి ఫారాలు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలు, సహాయం కోసం సంబంధిత బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించవచ్చని లేదా 1950 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయవచ్చని తెలిపారు.
అనర్హుల ఓటు హక్కును తొలగించి పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడమే ధ్యేయంగా భారత ఎన్నికల సంఘం ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ వంతుగా సహకారం అందించి అర్హులైన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గడువు ముగిసిన తర్వాత తుది జాబితాలో తమ పేరు లేదని ఆందోళనకు గురికాకుండా ముందస్తుగానే తగు జాగ్రత్త వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఎన్నికల సంఘం అందించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తుది ఓటర్ల జాబితాలో తమ పేరు ఉండేలా చూసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత..



కల్వకుర్తి నవంబర్ 15 (సింగిడి):
కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ నగర్, 16వ వార్డుకు చెందిన ఆర్. శంకర్ సింగ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషాదకర విషయం స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించి, మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు తన వంతు సహకారం అందించడం ద్వారా మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బావండ్ల మధు, మున్సిపల్ మాజీ స్పెషల్ నాలెడ్జ్ పర్సన్ కుడుముల మనోహర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు భగత్ సింగ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి
గవర్నర్ శివప్రతాప్ శుక్లా



హైదరాబాద్ -సింగిడి:
గోసంరక్షణను సామాజిక, ఆర్థిక, పర్యావరణ బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడ సర్దార్ పటేల్ ఆడిటోరియంలో జరిగిన రాష్ట్రస్థాయి 'గోవిజ్ఞాన పరీక్షలు–2026' బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గోవు వెన్నెముక వంటిదని, సంప్రదాయ గోవిజ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తేనే 'ఆత్మనిర్భర్ భారత్' సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు వెచ్చని భరోసా

హైదరాబాద్ - సింగిడి:
జనజాతీయ గౌరవ్ దివస్ (భగవాన్ బిర్సా ముండా జయంతి) సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులకు పంపిణీ చేసేందుకు 500 ఉన్ని దుప్పట్లతో కూడిన రెడ్ క్రాస్ వాహనాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆదివారం లోక్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు.అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'అభయ హంట్ ది వింటర్–2026' పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దుప్పటి అందించడం అంటే చలి నుంచి రక్షణ కల్పించడమే కాకుండా, తెలంగాణ సమాజం అండగా ఉందనే భరోసా ఇవ్వడమని పేర్కొన్నారు. యువత గిరిజన గ్రామాలను సందర్శించి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది దక్షిణ భారతదేశ వ్యాప్తంగా మొత్తం 4,000 దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వామి బాలచంద్ర తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీ ఎం. దాన కిషోర్, సీఈఓ ప్రొఫెసర్ ఏ. శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఘనంగా పుస్తక ప్రదర్శన



గద్వాల బ్యూరో నవంబర్ 15(సింగిడి):
గద్వాల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నవంబర్ 15, 2026న పుస్తక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్ గౌడ్ హాజరై రిబ్బన్ కట్ చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు సంబంధించిన పుస్తకాలు, విజ్ఞాన సాహిత్యం, చారిత్రక గ్రంథాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు, పాఠకులు పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, సమాజంలో చదివే అలవాటును పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పుస్తకాలు మనిషికి మంచి ఆలోచనా విధానాన్ని, సమాజంపై అవగాహనను, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించే ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్ గౌడ్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రంథాలయ అభివృద్ధికి, పఠన సంస్కృతి విస్తరణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు, యువత, ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే

నారాయణలో బాలల దినోత్సవ వేడుకలు





నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి): నగరంలోని సుభాష్ నగర్ లోని నారాయణ హై స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యా యులుగా మారి వివిధ తరగతులకు బోధిస్తూ ఉపాధ్యా యుల బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యా యుల పాత్రలను పోషిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో ముఖ్యంగా ఏజిఎం శివాజీ, ప్రిన్సిపాల్ రోమా రాయ్ , ఏవో అఖిల్ లు పాల్గొని ఉపాధ్యా యులుగా బాధ్యతలు నిర్వహించిన విద్యార్థులను అభినం దించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతా యుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ఈ వేడుకలు పాఠశాలలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి.

గద్వాలలో గ్రంథాలయ వారోత్సవాలు

పుస్తక పఠనంతో విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం
జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు



గద్వాల బ్యూరో (సింగిడి):
శనివారం జోగులాంభ గద్వాల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. రిటైర్డ్ ఎం.ఈ.ఓ. బస్వరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం సరస్వతీ దేవి,భరత తొలి ప్రధానమంత్రి చాచా నెహ్రూ, గ్రంథాలయ శాస్త్ర పితామ హుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ నీలి శ్రీనివాసులు మాట్లాడుతూ, పుస్తక పఠనం మనిషికి విజ్ఞానాన్ని అందించడమే కాకుండా ఆలోచనా శక్తిని,వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ విజ్ఞాన, సాహిత్య పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు.సమాజంలో పఠన సంస్కృతిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ధర్నా

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్
ధర్నా కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలి రండి
టి యు డబ్ల్యూ జే టీజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ చిర్రా రవి పిలుపు



ఖమ్మం ప్రతినిధి (సింగిడి): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని, ఎన్నికలలో ఇచ్చిన జర్నలిస్టుల స్థలాల హామీని అమలు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి డిమాండ్ చేశారు. ఖమ్మంలో శనివారం టి యు డబ్ల్యూ జే (టీజేఎఫ్) జిల్లా కమిటీ సమావేశం ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. జర్నలిస్టులు అనేక సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నా రని, ప్రభుత్వాలు ఎన్ని మారిన కూడా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కా రానికి నోచుకోవడం లేదని, ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వస్తాయని ఎదురుచూస్తున్నారని, వారి ఆశలను నెరవేర్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం ఈనెల 16న సోమవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు, వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, మహిళా సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, మందుల ఉపేందర్, ప్రశాంత్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, ఖమ్మం నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి, ఉపాధ్యక్షులు మూల జీవన్ రెడ్డి , సీనియర్ జర్నలిస్టులు ఉత్కంఠం శ్రీను, కళ్యాణ్, మోహన్, సాయి, తిరుపతిరావు, యాదగిరి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, ఎన్టీవీ సాయి,నాగ శేఖర్, పెంటి వెంకటేశ్వర్లు, నరసింహారావు, కూరపాటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు



ఆర్మూర్, (సింగిడి): నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలో గల అతి పురాతనమైన, ప్రసిద్ధిగాంచిన లింబాద్రిగుట్ట పై జాతర సందర్భంగా ఈనెల 12 నుంచి బ్రహ్మోత్సవాలు వేద పండితులు ఆలయ ఆచార్యులు బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. జాతర సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి జాతర, రథోత్సవం జిల్లాలోని అతి పెద్ద జాతరగా పేర్కొంటారు. శనివారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల వియ తోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్,పాలకవర్గం సభ్యుల ఆదేశాల మేరకు లింబాద్రిగుట్టపై ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల పనులు చేపట్టి పరిశుభ్రత భక్తుల సౌకర్యార్థం కొనసాగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్ తెలిపారు. ఈ సందర్భంగా గుట్ట పై డివైడర్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు, రహదారులన్నింటినీ శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్నముళ్లపొదలను తొలగించడం, రోడ్లపై స్వీపింగ్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘనంగా స్వాగతం పలికిన అధికారులు

జిల్లా కోర్టు సముదాయాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన హైకోర్టు జడ్జి.







గద్వాల బ్యూరో,(సింగిడి): జోగులాంబ గద్వాల జిల్లాలో శనివారం హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్ పర్యటించారు. ఉదయం ఎర్రవల్లి మండలం పదో బెటాలియన్ అతిథి గృహం వద్ద న్యాయమూర్తికి జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి, ఇతర అధికారులు మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అతిథి గృహం వద్ద కాసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం న్యాయమూర్తి గద్వాల మండలం, పూడూరు గ్రామ రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న జిల్లా కోర్టు సముదాయాల నూతన భవన నిర్మాణాల స్థలమును పరిశీలించారు. హైకోర్టు న్యాయ మూర్తికి భవన నిర్మాణం పనుల గురించి అధికారులు వివరించారు. పర్యటనలో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు, సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, అడిష నల్ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్ర టరీ నిష్కాపాత్రుడు, ఆర్డీవో శ్రీనివాసరావు డివిస్పి మొగిలయ్య, బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ ఆదినారాయణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు ఎనలేనివి

డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్



మహబూబ్ నగర్ బ్యూరో (సింగిడి):మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జవహర్ లాల్ నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రప టానికి డీసీసీ అధ్యక్షులు, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ దేశ స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించారని, అనంతరం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు దూరదృష్టితో ఎన్నో సంస్కర ణలు, అభివృద్ధి కార్యక్రమా లకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని కొనియా డారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం, జాతీయ సమైక్యత వంటి విలువలకు నెహ్రూ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఆశయ ఆశయాలు నేటికి దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నా యని అన్నారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవలో ముందుండాలని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా మాజీ ఎంపీ విఠల్‌రావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ ఉపాధ్యక్షులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డిసిసి ప్రధాన కార్యదర్శులు రాములు యాదవ్, సాయిబాబా, ఎంఏ. కలీం, నాయకులు అజ్మత్‌అలీ, అవేజ్, ఫక్రు, గులాం జహీర్, తాహేర్, నర్సింహారెడ్డి, అక్బర్, గంగిరెడ్డి, అబ్రార్ హుస్సేన్, చందు యాదవ్, తిరుపతినాయక్, రాంచంద్రయ్య, అలీం, హకీమ్, మజర్ ఖాన్, నసీరుద్దీన్, నర్సింహ, జగదీష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

పాల్గొన్న నగర మేయర్ కూరగాయల ఉమారాణి





నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): దివ్యాంగ విద్యార్థులైనప్పటికీ దేశ నాయకులు, స్వాతం త్ర్య సమరయోధుల వేషధారణలో అందంగా ముస్తాబై బాలల దినోత్సవం పురస్కరించుకుని దేశం మీద ప్రేమ, దేశ ఐక్యతను మరింత పెంపొందించే విధంగా సాంస్కృ తిక ప్రదర్శన ద్వారా చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి అభినందించారు. నగరంలోని మారుతీ నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ నగర మేయర్ కూర గాయల ఉమారాణి హాజరయ్యారు. ప్రతి ఒక్కరికి ముం దుగా బాలల దినోత్సవం వేడుకల శుభాకాంక్షలు తెలి యజేశారు. మహిళలు అన్నింటిలో కూడాను ఆడపిల్లలు ఒక ఉన్నత స్థాయిలో ప్రతి విషయంలో ముందంజలో ఉండాలని ఆకాంక్షనెహ్రూలో ఉందని తెలిపారు. పిల్లలు దైవంతో సమానమని వారు సంతోషంగా బాల్యాన్ని ఆస్వాదించాలని వారికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని సూచించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ బాల్యం అనేది పిల్లలకు చాలా ముఖ్యం పిల్లలు చిన్నతనంలో ఎలాంటి ఆలోచనలు లేకుండా సంతోషంగా బాల్యాన్ని ఆస్వాదించే వయసు అని తెలిపారు. దివ్యాంగుల విద్యార్థుల ఉన్నతి కోసం ఇన్ని సంవత్సరాలుగా కృషి చేస్తున్న స్నేహ సొసైటీ కార్యదర్శి ఎన్. సిద్దయ్య, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి స్నేహ సొసైటీ సిబ్బందిని వారు అభినందించారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా స్వతంత్ర సమరయో ధుల వేషధారణలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు, సాంస్కృత ప్రదర్శనలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అదేవిధంగా స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్ట్రక్షన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు కే. రమేశ్, స్నేహ సొసైటీ కార్యదర్శి ఎన్. సిద్దయ్య, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి,మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ కోశాధికారి తాటి సుధాకర్, వినయ్, టాటా ఏఐఏ ప్రతినిధులు నరేష్ రావు, శ్రావణి, మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది, అంధ ప్రత్యేక పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, దివ్యాంగ బాలల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఢిల్లీలో యూపీఎస్సీ కోచింగ్ పొందుతున్న ఇటిక్యాల విద్యార్థినికి ఘన సన్మానం

భవిష్యత్తులో ఐఏఎస్ కలెక్టర్‌గా ఎదగాలని ఆకాంక్షించిన రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు



గద్వాల ప్రతినిధి, (సింగిడి): జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని ఆగిపోకు చరిత విద్యారంగంలో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతోంది. చంద్రన్న రెండవ కుమారుడు చెన్నకేశన్న, కళ్యాణ జ్యోతి దంపతుల కుమార్తె అయిన చరిత 9, 10వ తరగతులను కేరళలో, ఇంటర్మీడియట్ విద్యను నెల్లూరులో పూర్తి చేసింది. ప్రస్తుతం డిగ్రీ చదువుతో పాటు దేశ రాజధాని ఢిల్లీలో యూపీఎస్సీ (UPSC) పోటీ పరీక్షలకు శిక్షణ పొందు తోంది.ఇటిక్యాల గ్రామం నుంచి ఢిల్లీలో ఉంటూ ఉన్నత విద్యతో పాటు యూపీఎస్సీ కోచింగ్ పొందుతున్న తొలి విద్యార్థినిగా గుర్తిస్తూ రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కమిటీ నాయకులు చరితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులు అభ్యసించి ఐఏఎస్ అధికారినిగా, కలెక్టర్‌గా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశీస్సులతో ఆమె లక్ష్యాన్ని సాధించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆకేపోగు మైరాముడు, కో-కన్వీనర్లు ఆకేపోగు అలెగ్జాండర్, ఉదండాపురం హనుమంతు, పూడూరు ఆశన్నతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలే దేశ భవిష్యత్తు..
విద్యతోనే సమాజాభివృద్ధి

పేద, అనాథ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ
పాల్గొన్న జిల్లా డివిజనల్ చైర్మన్ కమలాకర్



కొత్తగూడెం (చుంచుపల్లి),(సింగిడి): పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాదులని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ది స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బి. వీరన్న అన్నారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ది స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్గుతండాలో పేద, అనాథ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బి. వీరన్న మాట్లాడుతూ.. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించేందుకు మాత్రమే ఉపయోగపడే సాధనం కాదని, మంచి వ్యక్తిత్వాన్ని, ఆలోచనా విధానాన్ని, సామాజిక బాధ్యతను పెంపొం దించే శక్తివంతమైన ఆయుధ మని పేర్కొన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కవిద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదన్నారు. విద్యావంతులైన పౌరులతోనే అవినీతి రహిత, సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మిం చగలమని తెలిపారు. విద్యా ర్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. దేశ అభివృద్ధికి విద్యే బలమైన పునాది అని, నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులు, దేశ నిర్మాణకర్తలుగా ఎదగనున్నారని పేర్కొ న్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ది స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ అసోసియేషన్ సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ ఎన్. రాకేష్, తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ బి. వీర ప్రతాప్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య



నారాయణపేట,(సింగిడి):నారాయణపేట జిల్లా కేంద్రంలోని యాదిగిర్ రోడ్డు మార్గంలో కమాండర్, ఆటో వాహనాల డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్ల డుతూ... చలికాలంలో పొగమంచు, తక్కువ వెలుతురు కారణంగా ప్రమా దాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనాల్లో లైట్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని, పోగా మంచులో అత్యవసరం అయితే తప్ప జర్నీ ఎక్కువ చేయరాదు అని సూచించారు. వాహన సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని అన్నారు., పరిమిత సంఖ్యలోనే ప్రయాణికులను తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ఆర్సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్ తదితర ధృవపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కరణం అవ్వొ చ్చు మద్యం తాగి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.జిల్లా కేంద్రంలోని యాదిగిర్ రోడ్డు మార్గంలో వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపి ట్రాఫిక్‌కు,ప్రజలకు అంతరాయం కలిగించరాదని, వాహనాలను నిర్ణీత క్రమంలో నిలిపి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నడపాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణచైతన్య హెచ్చరించారు.

కొండ్రావుపల్లిలో బాలల గ్రామసభ

పాల్గొన్న సర్పంచ్ కురుమయ్య



కోడేరు (సింగిడి):కోడేరు మండల పరిధిలోని కొండ్రావుపల్లి గ్రామంలో సర్పంచి కురుమయ్య ఆధ్వర్యంలో శనివారం నాడు బాలల గ్రామసభ నిర్వహించారు. ఈ సంద ర్భంగా సర్పంచి కురుమయ్య యాదవ్ మాట్లా డుతూ నేటి బాలలే రేపటి పౌరులని, దేశానికి వెన్నెముకగా నిలిచే చిన్నారులను కాపాడుకోవా ల్సిన బాధ్యత మనఅందరిపై ఉందన్నారు. పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచాలని సూచిం చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రమేష్, గ్రామస్థులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ దరఖాస్తులపై అధికారుల నిర్లక్ష్యం!

నెల రోజులైనా అందని సమాచారం..
దరఖాస్తునే తిరిగి పంపిన కలెక్టర్ కార్యాలయం



గద్వాల ప్రతినిధి (సింగిడి): ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొ చ్చిన సమాచార హక్కు చట్టం-2005 అమలులో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోం దని జల్లా పురంగ్రామానికి చెందిన సామా జిక కార్యకర్త హెచ్. శాంతన్న ఆరోపించారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలంలోని పీఏసీఎస్ సింగిల్ విండో కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 2021 నుంచి 2026 వరకు వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు కోరుతూ అక్టోబర్ 13న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఆర్టీఐ దరఖాస్తు పంపినట్లు తెలిపారు. మొత్తం 24 అంశాలతో 13 పేజీల దరఖాస్తు సమర్పించి బిల్లులు, రసీదులు, పనుల వివ రాలు, ఫొటోలు, మిగిలిన నిధుల సమాచారం కోరినట్లు పేర్కొ న్నారు. అయితే సమాచారం ఇవ్వాల్సిన అధికారులు దరఖాస్తునే తిరిగి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ కార్యాలయా నికి ఆర్టీఐ చట్టం వర్తించదని సంబంధిత అధికారి తెలిపినట్లు వెల్లడించారు. విద్యాశాఖ అధికారులను సంప్రదిం చినా సరైన స్పందన రాలేదని ఆరోపించారు. అక్టోబర్ 13న దరఖాస్తు చేయగా నవంబర్ 13 నాటికి 30 రోజులు పూర్తయినా సమాచారం అందలేదన్నారు. ఆర్టీఐ చట్టం ప్రకారం నిర్ణీత గడువులో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మొదటి అప్పీల్‌కు వెళ్లను న్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సంబంధిత శాఖల అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని కోరారు. ఆర్టీఐ దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమాచార అధికారుల వివరాలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పించాలని హెచ్. శాంతన్న కోరారు.

సామాజిక సమస్యలపై పిలుపు

. . . పిలుపు పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవి రచయిత గాయకుడు గఫూర్ శిక్షక్



నిజామాబాద్ప్రతినిధి, (సింగిడి):ప్రముఖ కవి, రచయిత ప్రేమ్ లాల్ సామాజిక సమస్యలపై రచించిన కవిత సంపుటిలో నీటి సంరక్షణ పర్యావరణ పరిరక్షణ ఎల్ నినో ప్రభావం భవిష్యత్తు తరాలు ఈ విషయ మై జాగ్రత్తలను తన కవితల ద్వారా వివరించిన తీరు చాలా బాగుందని కవితలన్నీ సామాజిక సమస్యలను విశ్లేషిస్తున్నాయని ప్రముఖ కవి రచయిత గఫూర్ శిక్షక్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం స్థానిక కేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో బి.ప్రేమ్ లాల్ రచించిన కవితా సంపుటి పిలుపు పుస్తకాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పుస్తకము లో పర్యావరణ పరిరక్షణ జల సంరక్షణ యువతకు సూచించే దిశా నిర్దేశం సమాజంలోని రుగ్మతలను తొలగించే విధంగా అన్ని కవితలు ఆలోచింపజేస్తున్నాయని,పిలుపు సమా జానికి ఒక పిలుపుగా నిలుస్తుంది అని పుస్తకానికి పెట్టిన శీర్షిక సామాజిక ప్రతిబింబంగా నిలుస్తున్నాయని అన్నారు. పుస్తక రచయిత ప్రేమ్ లాల్ మాట్లాడుతూ నీటిని సంరక్షించుకోవాలని ప్రస్తుత ఎల్‌ఈనో ప్రభావం తీవ్ర రూపం దాల్చకముందే సమా జం మేల్కోవాలని అన్నారు ఇలాంటి విషయాలను ఈ పుస్తకంలో తెలియజేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ అభిమానులు మురళి, మౌనిక, విక్రమ్, రాజేందర్, ప్రవీణ్, సురేష్, నరేష్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు ఎస్సైగా సద్దాం హుస్సేన్



కోడేరు(సింగిడి): కోడేరు పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్ఐగా కె సద్దాం హుస్సేన్ శనివారం బాధ్యతలు స్వీకరిం చారు.నాగర్‌కర్నూల్ విఆర్‌నుండి కోడేరు పోలీస్ స్టేషన్ కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రత పరిరక్షణకు ప్రాధా న్యత ఇస్తానని ప్రజల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు ద్విచక్రవా హనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి మద్యం సేవించి వాహ నాలను నడపరాదని ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు ఖాతాలను ఓటీపీలను

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా బండి రాజు



జమ్మికుంట,(సింగిడి): బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఇల్లందకుంట మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా బండి రాజు, యువజన మండల ఉపాధ్యక్షుడిగా గుర్రం రమేష్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా మురహరి రాజు, బీసీ మహిళా సంఘం మండల అధ్యక్షురాలిగా గొడుగు మానస ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం జిల్లా నాయకులు మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు తగిన అవకాశాలు, సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా సంఘం నిరంతరం కృషి చేయాలని సూచించారు. మండలంలోని అన్ని బీసీ కుల సంఘాలను సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేయాలని నూతన నాయకులకు దిశానిర్దేశం చేశారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తామని, బీసీ సమాజాన్ని ఐక్యంగా ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రంగు సంపత్ గౌడ్, రాసిమల్ల రాజు, మోటం వెంకటేష్, మాదాసు సంజీవ్, నారోజు రాకేష్, మోత్కూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత

బసవయ్య కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం



జమ్మికుంట, (సింగిడి): వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి బసవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. కుటుంబ పరిస్థితులను గుర్తించిన తాళ్లపల్లి రాజు సోషల్ మీడియా వేదికగా గ్రామస్థులు, పరిచయస్తులకు విజ్ఞప్తి చేసి రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని సమకూర్చారు. సేకరించిన మొత్తాన్ని శనివారం బసవయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సహాయ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పలువురు దాతలు తమవంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి రాజు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. బసవయ్య కుటుంబానికి తమవంతు సహాయం అందించడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. తన విజ్ఞప్తికి స్పందించి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదో వార్డు సభ్యురాలు తాళ్లపల్లి పుష్పలీల, ఆరో వార్డు సభ్యుడు చేపూరి శ్రీకాంత్ గౌడ్, గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రాజు గౌడ్, ఉపాధ్యక్షుడు రాపర్తి సతీష్ గౌడ్, రాపర్తి కొండల్ గౌడ్, తిప్పని మొగిలి గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పంజాల సది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులతో

ప్రజలకు చేరువగా సునీల్ రావు

కన్న కృష్ణ జన్మదిన వేడుకల్లో పాల్గొని అన్నదానం..
డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన సదర్ సమ్మేళనానికి ఆహ్వానం



కరీంనగర్ (సింగిడి): కరీంనగర్‌లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు కన్న కృష్ణ 64వ జన్మదిన వేడుకల్లో టవర్ సర్కిల్ వద్ద ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా అన్నప్రసాదం పంపిణీ చేశారు. కన్న కృష్ణ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం నగరంలోని ఓ డివిజన్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అభివృద్ధి పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈనెల 22న సర్కస్ గ్రౌండ్‌లోని జ్యోతిబా పూలే మైదానంలో నిర్వహించనున్న కరీంనగర్ సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని సదర్ కమిటీ, అఖిల భారత మహాసభ ప్రతినిధులు యాదగిరి సునీల్ రావును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉత్సవాల విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కన్న కృష్ణ జన్మదిన వేడుకల్లో కార్పొరేటర్ వంగల పవన్ కుమార్, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొనగా, సదర్ కమిటీ తరఫున సందబోయిన రవి యాదవ్, సందబోయిన ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పారమిత విద్యాసంస్థల్లో బాలల దినోత్సవ వేడుకలు

ఆటలు, ఆహార ప్రదర్శన, ప్రశ్నోత్తర పోటీలు.. విజేతలకు బహుమతులు



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): కరీంనగర్‌లోని పారమిత విద్యాసంస్థల్లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని విద్యార్థుల కోసం ఆహార ప్రదర్శన, ప్రశ్నోత్తర పోటీలు, వినోదభరిత ఆటలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటగా, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద నిర్మాణ యత్నంపై సమగ్ర విచారణ జరపాలి

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అదనపు కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు బీజేపీ నేతల ఫిర్యాదు



కార్పొరేటర్ బండ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ శ్రీను, ఉప్పరపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): కరీంనగర్‌లోని ఈద్గా వద్ద నగరపాలక సంస్థ అనుమతి లేకుండా రక్షణ గోడ నిర్మాణానికి ప్రయత్నించి మతవిద్వేషాలు సృష్టించేందుకు కుట్ర చేశారని బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశ్వనీ తానాజీ వాకడే, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నెల 11న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న ఈద్గా వద్ద కొందరు వ్యక్తులు నిర్మాణ సామగ్రి తీసుకొచ్చి యంత్రాలతో రక్షణ గోడ పనులు ప్రారంభించడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పనులకు ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఈ ఘటన వెనుక బీఆర్ఎస్ ముఖ్య నాయకుల ప్రమేయం ఉందని అనుమానం వ్యక్తం చేస్తూ, నగరంలో అశాంతి సృష్టించే ప్రయత్నంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, నగరపాలక సంస్థ విప్ బోయినిపల్లి ప్రవీణ్ రావు,

గ్రంథాలయాలు విద్యార్థుల జ్ఞానవికాసానికి దోహదపడతాయి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల ప్రతినిధి, (సింగిడి): గ్రంథాలయాలు విద్యార్థుల జ్ఞాన వికాసానికి ఎంతగానో దోహదపడతాయని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుపేద విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలో ఎస్సీ, బీసీ స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు కృషి చేశామని, గతంలో గ్రంథాలయంలో పోటీ పరీక్షల అభ్యర్థులకు భోజన వసతి కూడా కల్పించామని గుర్తు చేశారు. రూ.కోటి వ్యయంతో మంజూరైన నూతన లైబ్రరీ భవన నిర్మాణం దాదాపు పూర్తయిందని, దానిని త్వరగా ప్రారంభించేందుకు చైర్మన్ చొరవ చూపాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో వసతుల కల్పన కోసం రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి తన వంతుగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, సింగిల్ విండో చైర్మన్ దామోదర్ రావు, టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, ముఖేష్ కన్నా, కౌన్సిలర్లు మమత రామకృష్ణారెడ్డి, చెట్టె గంగాధర్, పిట్ట ధర్మరాజు, కూతురు రాజేష్, లైబ్రరీ కార్యదర్శి శంకరయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు

70 దేశాల నుంచి వెయ్యిమంది ప్రతినిధుల హాజరు.. గిగ్ కార్మికులతో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి బైక్ ర్యాలీ



అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం ద్వారా హైదరాబాద్‌కు ప్రపంచస్థాయిలో గుర్తింపు లభించిందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

కరీంనగర్ ప్రతినిధి,(సింగిడి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ భారత్ సమ్మిట్--2026 రెండో రోజు కార్యక్రమాల్లో చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. నవంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించిన ఈ సదస్సుకు 70 దేశాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు, మేధావులు, విధానకర్తలు హాజరయ్యారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, వాతావరణ మార్పులు, లింగ సమానత్వం, కృత్రిమ మేధస్సు తదితర అంశాలపై చర్చించారు.
సమ్మిట్‌లో భాగంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిగ్ కార్మికులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్న రాహుల్ గాంధీ, వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

విలాసాగర్ లో నూతన గ్రామ కమిటీ ఎన్నిక
గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాచపల్లి శ్రీనివాస్



జమ్మికుంట, (సింగిడి): మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నూతన గ్రామ కమిటీల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీని నియమించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరశురాం రావు, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాచపల్లి సాగర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముంజాల ప్రశాంత్, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా ముంజాల తిరుపతి గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాచపల్లి చిరంజీవి, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఉండాడి రవి, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ రఫీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మంజుల రాజేష్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారు పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఉండాడి కుమార్, నాకతి రాజు, సిరిసేటి కుమార్, కుడుతాల నరేందర్, కొడారి గణేష్, రాచపల్లి వంశీ, నెల్లి శీను తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



జగిత్యాల పట్టణ అధ్యక్షులు కాశెట్టి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, ఫ్లోర్ లీడర్లు వేముల శ్రీనివాస్, నిరిపురం శ్రీనివాస్, స్వరూప వేణుగోపాల్, జిల్లా పదాధికారులు, మోర్చా, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగిత్యాల ప్రతినిధి (సింగిడి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ సమావేశాన్ని వ్యతిరేకిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు మాట్లాడుతూ తెలంగాణను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా చూపిస్తామనే పేరుతో భారత వ్యతిరేక శక్తులతో ఈ సమ్మిట్‌ను ఏర్పాటు చేశారని ఆరోపించారు. సదస్సులో పెట్టుబడుల అంశాలను పక్కనపెట్టి జాతీయ సమైక్యతకు భంగం కలిగించే అంశాలను చర్చకు పెట్టారని విమర్శించారు. ఎలాంటి రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వ పదవిలో లేని రాహుల్ గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించి, ప్రపంచ దేశాల ప్రతినిధుల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసం వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రం కరువు కాటకాలతో అల్లాడుతుంటే, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ నాయకత్వానికి భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో

సూర్యగ్లోబల్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు



మౌనిక, రజిత, సుమన్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగిత్యాల ప్రతినిధి (సింగిడి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించగా, జానపద, శాస్త్రీయ, దేశభక్తి గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు, విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ రావు మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని, వారి చేతుల్లోనే రేపటి సమాజ నిర్మాణం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమ శిక్షణ, సమయపాలన, సేవాభావం అలవర్చుకోవా లని, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు శ్రీధర్ రావు, హరిచరణ్ రావు,

తెలంగాణ సగర సంఘం రాష్ట్ర

కోశాధికారిగా కానిగంటి శ్రీనివాస్



జమ్మికుంట, (సింగిడి): తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కోశాధికారిగా హుజూరాబాద్ మండలం కనుకుల గిద్ద గ్రామానికి చెందిన కానిగంటి శ్రీనివాస్ నియమి తులయ్యారు. రాష్ట్ర సగర సంఘం కార్యవర్గం ఆమోదించిన తీర్మానం మేరకు ఆయనను రాష్ట్ర కోశాధికారిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం ప్రకటించారు. కానిగంటి శ్రీనివాస్ గత అనేక సంవత్సరాలుగా సగర కుల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. గతంలో కరీంనగర్ జిల్లా సగర సంఘం అధ్య క్షుడిగా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహి స్తూ సంఘం బలోపేతానికి తనవంతు సేవలందిం చారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర కోశాధి, కారిగా కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా కానిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సగర కుల హక్కుల సాధన, సామాజిక అభ్యున్నతి కోసం అనేక సంవత్సరాలుగా నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, రాష్ట్ర ముఖ్య సలహాదారు ఆర్.బి. ఆంజనేయులు సగరతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, అన్ని జిల్లాల అధ్యక్షులు, నాయకులకు, సంఘం సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా సగర సంఘం నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ, సంఘం అభివృద్ధికి, సగర కులస్తుల సంక్షేమానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని శ్రీనివాస్ సగర పేర్కొన్నారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో

బాలల దినోత్సవ వేడుకలు

నెహ్రూ చిత్రపటానికి నివాళులు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): కరీంనగర్‌లోని వివిధ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, జాతీయ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ తొలి ప్రధానమంత్రిగా నెహ్రూ విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి, ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు విశేష కృషి చేశారని కొనియాడారు. బాలలపై ఆయనకున్న ప్రేమకు గుర్తుగా చిన్నారులు చాచా నెహ్రూ అని ఆప్యాయంగా పిలుచుకునేవారని తెలిపారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భయం లేని బాల్యాన్ని అందించడమే ఆయన ఆశయాలకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నెహ్రూ వేషధారణలో అలరించగా, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో ధాన్యం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలి
మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): ఎలబోతారం, ఫకీర్‌పేట్, బహదూర్ ఖాన్‌పేట్, దుబ్బపల్లి, తహెర్ కొం డాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్లు మీసాల శంకర్, సంపత్, కనకయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేకుంటే కఠిన చర్యలు. టౌన్ సీఐ కరుణాకర్



జగిత్యాల ప్రతినిధి (సింగిడి): జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం పట్టణంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 95 వాహనాలను అదుపులోకి తీసుకొని జరిమానాలు విధిం చారు. అనంతరం వాహన యజమాను లకు నంబర్ ప్లేట్ల ఆవశ్యకతపై కౌన్సె లింగ్ నిర్వహించగా, వారు స్వచ్ఛందంగా తమ వాహనాలకు కొత్త నంబర్ ప్లేట్లను అమర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ ప్రతి వాహనానికి తప్పనిసరిగా నిర్దేశించిన ప్రామాణిక నంబర్ ప్లేట్లు ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారం..

రైస్ మిల్ యజమాని అరెస్ట్...గతంలోనూ ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం కేసు



జమ్మికుంట, (సింగిడి): ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందించే ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్న రైస్ మిల్ యజమానిని వీణవంక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5న వీణవంక మండలం కోరుకల్ గ్రామంలోని వాసవి ఎంటర్‌ప్రైజెస్ వద్ద హైదరాబాద్‌కు చెందిన జుఖీ అధికారులు అందిన సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 23.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వాహన డ్రైవర్ కుర్ర తిరుపతి వివిధ గ్రామాల నుంచి కిలో రూ. 20 చొప్పున పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, వాసవి రైస్ మిల్ యజమాని నార్ల వెంకటేశ్వర్లుకు కిలో రూ. 25 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. సదరు యజమాని ఆ బియ్యాన్ని కోళ్ల ఫారాలకు కిలో రూ. 30 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కేసులో నిందితుడైన నార్ల వెంకటేశ్వర్లును నవంబర్ 13న వీణవంక పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, రిమాండ్ విధించారు. కాగా, గతంలోనూ ప్రభుత్వానికి చెందిన 12,914.83 క్వింటాళ్ల ధాన్యాన్ని దుర్వినియోగం చేసి, రూ. 4,16,83,097 మేర మోసానికి పాల్పడిన కేసులో ఆయన నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి హెచ్చరించారు.

singidinews@gmail.com

భారత కుర్రాళ్లపై పాక్ ఫైర్



న్యూఢిల్లీ: అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై భారత యువ జట్టు విజయం సాధించినా.. మ్యాచ్ అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు వివాదానికి దారితీశాయి. భారత ఆటగాళ్లు విజయోత్సవాల సందర్భంగా పాక్ క్రికెటర్లను అవమానించేలా ప్రవర్తించారంటూ ఆ దేశ మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. మహమ్మద్ యూసఫ్ భారత ఆటగాళ్ల పెంపకంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయగా.. మరో మాజీ క్రికెటర్ తన్వీర్ అహ్మద్ ఏకంగా ఐసీసీ నిషేధం విధించాలని డిమాండ్ చేశాడు.

భారత ఆటగాళ్ల పెంపకంపై యూసఫ్ వ్యాఖ్యలు

గెలుపోటములు క్రీడల్లో సహజమని, విజయం సాధించినంత మాత్రాన ప్రత్యర్థులను కించపరిచేలా వ్యవహరించడం సరికాదని మహమ్మద్ యూసఫ్ పేర్కొన్నాడు. భారత యువ క్రికెటర్ల తల్లిదండ్రుల పెంపకం సరిగ్గా లేదంటూ వ్యక్తిగత విమర్శలకు దిగాడు. మైదానంలో వారి ప్రవర్తన వీధి రౌడీలను తలపించిందని వ్యాఖ్యానించాడు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పాటించాలని హితవు పలికాడు. ప్రత్యర్థి జట్టును గౌరవించడం ప్రతి క్రికెటర్ బాధ్యత అని పేర్కొన్నాడు.

ఐసీసీ బ్యాన్ విధించాలన్న తన్వీర్

మరోవైపు పాకిస్థాన్ మాజీ క్రికెటర్ తన్వీర్ అహ్మద్ కూడా భారత యువ ఆటగాళ్లపై తీవ్ర ఆరోపణలు చేశాడు. పాక్ ఆటగాడు హంజా జహూర్‌ను భారత క్రికెటర్లు లక్ష్యంగా చేసుకున్నారని, కావాలనే రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని విమర్శించాడు. డ్రెస్సింగ్ రూమ్ సమీపంలోనూ పాకిస్థాన్ ఆటగాళ్లను కించపరిచేలా సంబరాలు చేసుకున్నారని ఆరోపించాడు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో చోటుచేసుకున్న పరిణామాలపై ఐసీసీ సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశాడు. నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిషేధం విధించాలని కోరాడు.

ఒక్క పరుగు తేడాతో భారత్ విజయం

ఇదిలా ఉంటే అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత యువ జట్టు చివరి వరకు ఉత్కంఠభరితంగా పోరాడింది. తొమ్మిది వికెట్లు కోల్పోయినా లక్ష్యాన్ని చేరుకుని ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత్ తొమ్మిదోసారి అండర్-19 ఆసియా కప్ ఛాంపియన్‌గా నిలిచింది. అయితే విజయం అనంతరం ఆటగాళ్ల సంబరాలపై పాక్ మాజీ క్రికెటర్లు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీశాయి.



పిన్న వయసులో కెప్టెన్‌గా వైభవ్ ఘనత!



ఇందౌర్: భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన ఘనత సాధించాడు. టీ20 క్రికెట్‌లో జట్టుకు కెప్టెన్సీ వహించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 15 ఏళ్ల 232 రోజుల వయసులో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బిహార్ జట్టుకు సారథ్యం వహించాడు. దీంతో గతేడాది 17 ఏళ్ల 311 రోజుల వయసులో క్రొయేషియా తరఫున కెప్టెన్సీ చేసిన జాక్ వక్సచ్ రికార్డును అధిగమించాడు. అయితే కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లో వైభవ్‌కు విజయం దక్కలేదు. సౌరాష్ట్రతో జరిగిన ఈ పోరులో బిహార్ తొలుత 9 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. వైభవ్ 12 బంతుల్లో 18 పరుగులు చేశాడు. అనంతరం సౌరాష్ట్ర 16.3 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

ఖేలో ఇండియా నిర్వహణకు

రూ.203 కోట్ల బడ్జెట్

డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు..
7 వేల మందికి పైగా క్రీడాకారుల రాక



న్యూఢిల్లీ, నవంబర్ 15(సింగిడి): తెలంగాణ క్రీడా చరిత్రలో ఖేలో ఇండియా యూత్‌గేమ్స్-2026మైలురాయిగా నిలవనున్నాయని రాష్ట్రక్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో జరగనున్న ఈ పోటీల లోగో, మస్కట్‌ను కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. కేంద్రం కేటాయించిన రూ. 21 కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 203.13 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఈ నిధులతో స్టేడియాల్లో శాశ్వత క్రీడా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మొత్తం 27 క్రీడాంశాల్లో పోటీలు జరగనుండగా, తెలంగాణ సంప్రదాయ క్రీడ కర్రసాము ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దేశవ్యాప్తంగా 7 వేల మందికి పైగా క్రీడాకారులు, 1,200 మంది కోచ్‌లు, సహాయక సిబ్బంది పాల్గొననున్నారు. హైదరాబాద్‌తో పాటు హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో పోటీలు నిర్వహించనున్నారు.

సీతారామ జపంతో

పాక్‌పై గెలిచా..

కొడుకు మాటలకు సెహ్వాగ్ ఫిదా!



న్యూఢిల్లీ: అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించిన అనంతరం యువ క్రికెటర్ ఆర్యవీర్ సెహ్వాగ్ తన తండ్రి, మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్‌కు వీడియో కాల్ చేశాడు. ఈ సంద ర్భంగా మ్యాచ్ చివరి ఓవర్‌లో తాను ఎదుర్కొన్న ఉత్కంఠను తండ్రి తో పంచుకున్నాడు. చివరి ఓవర్‌లో చాలా టెన్షన్ పడ్డానని.. ఆ సమయంలో సీతారాం.. సీతారాం అంటూ జపిస్తూ భావోద్వేగా లను నియంత్రించుకున్నానని చెప్పాడు. పాకిస్థాన్‌పై విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపాడు.

కొడుకు వీడియో కాల్‌ను పంచుకున్న వీరూ

ఆర్యవీర్‌తో జరిగిన వీడియో కాల్ సంభాషణను వీరేంద్ర సెహ్వాగ్ సోషల్ మీడి యాలో పంచుకు న్నాడు. కొడుకు మాటలకు ఆనందం వ్యక్తం చేస్తూ.. ఇలాగే కష్టపడుతూ భవిష్యత్తులో మరిన్ని ట్రోఫీలు సాధించాలని ఆకాంక్షించాడు. ప్రస్తుతం తండ్రీకొడుకుల మధ్య జరిగిన ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముఖ్యంగా మ్యాచ్ ఉత్కంఠ సమయంలో సీతారామ జపం చేశానంటూ ఆర్యవీర్ చెప్పిన మాటలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.

భయంతో భరించా..

స్వర భాస్కర్ షాకింగ్ కామెంట్స్



బాలీవుడ్ నటి స్వర భాస్కర్ తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో బయ టపెట్టి సంచలనం సృష్టించారు. 2011లో మధ్యప్రదేశ్‌లోని పచ్‌మఢీలో జరిగిన ఓ సినిమా అవుట్‌డోర్ షూటింగ్ సమయంలో ఒక దర్శకుడు తనను లైంగికంగా వేధించాడని ఆమె ఆరోపించారు. అప్పట్లో తనకు 20 ఏళ్ల వయసు మాత్రమే ఉందని, ఇండస్ట్రీలో అప్పుడప్పుడే నిలదొక్కుకుం టున్న సమయం కావడంతో తనకు ఎలాంటి పర్సనల్ టీమ్ గానీ, సపోర్ట్ గానీ లేదని తెలిపారు. భౌతిక స్పర్శ లేకపోవడంతో, ఆ దర్శకుడి ప్రవర్తనను తాను మొదట్లో లైంగిక వేధింపులుగా గుర్తించలేకపోయానని చెప్పారు. 56 రోజుల ఆ షూటింగ్ షెడ్యూల్ మొదలైన మొదటి కొద్ది రోజుల్లోనే ఈ వేధింపులు ప్రారంభమయ్యాయని స్వర గుర్తు చేసుకున్నారు.



సుడి పెళ్లిపై అషురెడ్డి క్లారిటీ

సోషల్ మీడియా సెన్సేషనల్ బ్యూటీ అషురెడ్డి లీక్స్‌తోపాటు పలు సినిమాల్లో నటించి మెప్పించారు. ఇక ఈ ముద్దుగుమ్మ, బిగ్‌బాస్ రియాలిటీ షోలో పాల్గొన్న తర్వాత అషురెడ్డికి ఫ్యాన్ ఫాలోయింగ్ మరింతపెరిగింది.కమెడియన్ సుడిగాలి సుధీర్‌ను అషురెడ్డి పెళ్లి చేసుకోబోతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా పుకార్లు షికారు చేస్తున్నాయి. వీరిద్దరూ కలిసి షోలు చేస్తుండటంతో వీరి మధ్య ఏదో ఉందంటూ నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా సుప్రిత హోస్టుగా వ్యవహరిస్తున్న ఒక షోకు అతిథిగా వెళ్లిన అషురెడ్డి, ఈ పెళ్లి వార్తలపై ఎట్టకేలకు స్పందించి పూర్తి క్లారిటీ ఇచ్చారు. అషురెడ్డి స్పందిస్తూ, ఆ వార్తలు వింటుంటే ఏం మాట్లాడాలో కూడా తెలియడం లేదని చెప్పారు. సుధీర్ చాలా మంచి వ్యక్తి అని, 'ఫ్యామిలీ స్టార్స్' షో కోసం తామిద్దరం గత రెండేళ్లుగా కలిసి పని చేస్తున్నామని తెలిపారు. సుధీర్‌తో తనకు పెళ్లి జరగబోతోందంటూ వస్తున్న వార్తలలో ఏమాత్రం నిజం లేదని, అవన్నీ కేవలం పుకార్లు మాత్రమేనని అషురెడ్డి స్పష్టం చేశారు.

చాందినీపై నెట్టింట ట్రోలింగ్

ప్రశ్నిస్తే నన్ను నిందిస్తారా?
ట్రోలింగ్‌పై చాందినీ చౌదరి ఎమోషనల్ పోస్ట్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ చాందిని చౌదరి ఓ వైపు వరుస సినిమాలు చేస్తూనే.. పలు విషయాలపై రియాక్ట్ అవుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్న ఆమె.. ఇటీవల తన సొంతం ఊరైన విశాఖపట్నంలో జరుగుతున్న అక్రమ కొండల తవ్వకాలపై తన ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో చాందినీపై నెట్టింట తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ మొదలైంది. తనపై వస్తున్న ఈ విమర్శల వర్షంపై తాజాగా, చాందినీ చౌదరి ఒక వీడియో విడుదల చేస్తూ ఘాటుగా స్పందించారు. 'ప్రశ్నలు అడిగినందుకు నన్ను నిందిస్తారా? నా అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కునాకు లేదా?' అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో మనకు ఏదైనా బాధ కలిగించినప్పుడు, దాని గురించి మన అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పుకునే హక్కుప్రతి ఒక్కరికీ ఉంటుందని ఆమె గుర్తు చేశారు. కేవలం తమ అభిప్రాయాలతో నా ఆలోచనలు కలవలేదనే కారణంతో తనను తప్పుబట్టడం, వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతతో స్పందిస్తే.. వ్యక్తిగత దాడి చేయడం సరికాదని చాందినీ చౌదరి స్పష్టం చేశారు.

అభిమానులకు అల్లు గుడ్‌న్యూస్



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఆకాశంలో ఒకతార సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిమా నులకు గుడ్ న్యూస్ చెప్పారు. తాను నటిస్తున్న రాకా సినిమా అప్డేట్ త్వరలోనే ఉంటుందని చెప్పారు. సినిమా అప్డేట్ ఆలస్యం అవుతుందని తనకు తెలుసని, కానీ ఇచ్చేప్పుడే బెస్ట్ ఇవ్వాలని అనుకుంటు న్నామని చెప్పారు. కచ్చితంగా బెస్ట్ ఇస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే అల్లు అర్జున్ రాకాపై అభిమా నుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాకు అట్లీ దర్శకత్వం వహిస్తుండగా సన్ పిక్చర్ బ్యానర్ పై సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణే హీరోయిన్‌గా నటిస్తోంది. రష్మిక మందన్న, మృణాల్, జాన్వీకపూర్ లాంటి హీరోయిన్‌లు సైతం సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నారు. దాదాపు 700 నుండి 900 కోట్ల భారీ బడ్జెట్ తో సినిమాను తెరకెక్కిస్తున్నారు. భారీ బడ్జెట్ తో పాటు భారీ తారాగణం సినిమాలో ఉండటంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి.

సినిమా సింగిడి Cinema Singidi

సోమవారం
16-11-2026

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737